అపరాధ పరిశోధన

రు.7 | మార్చి '87

Blank Page

సంపుటి: 44
సంచిక: 2

ఫోన్ నెం
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 84 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

మార్చి, 1987

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ పీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

తొలిమాట

నమస్కారము. పత్రికా నిర్వహణ వ్యయం, రవాణా చార్జీలు బాగా పెరగటంవల్ల పత్రిక ధరను స్వల్పంగా పెంచక తప్పటం లేదు. వచ్చేనెలనుండి "అపరాధ పరిశోధన" విడి ప్రతి వెల రు. 7-50 లు, ఏడాది చందా రు. 90/-లు. పాఠకులు ఎప్పటివలె మాతో సహకరించ వలసిందిగా కోరుతున్నాము.

'రిజిష్టర్డు పోస్టు' చార్జీలను ప్రభుత్వం దాదాపు రెట్టింపు పెంచిన కారణంగా 'హోమ్ డెలివరీ' సభ్యులకు పత్రికలను 'బుక్ పోస్టు'లో పంపుతున్నాము. కోరిన వారికి మాత్రం 'రిజిష్టర్డు పోస్టు'లో పంపగలము. పత్రికలు ఎవరికైనా 26 వ తేదీ లోపల చేరకపోతే ఆ విషయం మాకు తెలియజేయవలసిందిగా మనవి చేస్తున్నాము.

'హోమ్ డెలివరీ' సభ్యులకు మరొక సౌకర్యం కూడా కలిగిస్తున్నాము. ప్రతి రెండు నెలల కాపీలు ఒకేసారి V. P.లో తెప్పించుకోవచ్చును. ఈ పద్ధతిలోకూడా పత్రికల ఖరీదుకుమించి అదనంగా ఏమీ చెల్లించనవసరంలేదు. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము. రెండేసి నెలలకు (4 కాపీలు) రు. 30-00 లకు V.P. లో పంపబడతాయి. యీ సౌకర్యం కావలసినవారు మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

సెలవా మరి—

మీ

—శ్యామ దామోదర్ రెడ్డి.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. రాంగ్ నంబర్ పద్మనాభం — కె.వి.యస్. ప్రకాశరావు
17. రక్త తిలకం — వసుంధర
36. ఘరానా దొంగలు — సుంకరి రాంప్రసాద్
64. అగ్నిపునీత — సి.వి. నరసింహదాసు
75. కిడ్నాపర్ అంకుల్ — జొన్నలగడ్డ రామలక్ష్మి
95. ధన్వంతరి వారసులు — కె. బి. యస్. కుమార్
108. శాపగ్రస్తులు — వి. పద్మప్రియ
125. నకిలీ అహల్య — ఎమ్. రాధిక
143. బూట్లు — అపర్ణానైటింగేల్
162. మనిషిలోని దెయ్యం — కె.వి.యస్.ఎస్. మూర్తి
176. మరణయాత్ర — (సీరియల్) ప్రతాప రవిశంకర్

నవలలు (సప్లిమెంట్)

3. తోలు బొమ్మ — వి. యస్. రావ్
80. సునీత గీసిన బొమ్మ — వసుంధర
124. బందిపోట్లు — భీమవరపు పురుషోత్తం
170. అన్వేషణ — (సీరియల్) వి.ఎస్. రావ్

ఇంకా — ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరా పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు

రాంగ్ నెంబర్ పద్మనాభం

—కె.వి.యస్. ప్రకాశరావు—

కిటికీలో నుండి బోయ్ పేపరు గిరవాటువేసి వెళ్ళిపోయాడు. పక్కనే కుర్చీలో కూచున్న సుధారాణి పేపరందుకున్నది.

హెడ్ లైన్స్ చకచక చదవసాగింది సుధారాణి.

“బ్యాంకు దోపిడీ - నాలుగు లక్షల అపహరణ!”

"నక్సలైట్లచే లక్షాధికారి హత్య?"

"మెంటల్ ఆసుపత్రినుండి రోగి అదృశ్యం!"

"ఆకలిబాధ భరించలేక తల్లి, నలుగురు పిల్లల ఆత్మ హత్య!"

చిరాకుగా పేపరును బల్లమీదకు గిరవాటు వేసింది సుధారాణి. పేపర్లనిండా ఒకటే వార్తలు! దోపిడీలు, హత్యలు, మానభంగాలు!

దేశ పురోభివృద్ధి యీ విషయాలలోనే ఎక్కువగా వున్నట్లు తోచింది సుధారాణికి. ప్రభుత్వం పోలీసులు ఏం చేస్తున్నారో ఆమె కర్థం కాలేదు.

సుధారాణికి ఇరువది సంవత్సరాలు దాటాయి. డిగ్రీ ఫైనల్ యియర్ చదువుతోంది. కాలేజీకి వారం రోజులు శెలవు లిచ్చారు.

శివరావు యిన్‌కమ్‌టాక్సు ఆఫీసులో పని చేస్తున్నాడు. భార్య చనిపోయి రెండు సంవత్సరాలయింది. సుధారాణి ఏకైక సంతానం.

చదువు పూర్తికాగానే వివాహం చేద్దామనే తలంపులో వున్నాడు శివరావు.

సుధారాణికి కాలక్షేపం లేదు. స్నేహితులంతా శెలవుల వలన వూళ్ళకు వెళ్ళిపోయారు.

టైం చూసుకున్నది. తొమ్మిది గంటలు దాటింది. మరో అరగంటలో తండ్రి ఆఫీసుకి వెళతాడు. వంట మనిషి వంట వండి వెళ్ళిపోతుంది. తర్వాత తనకు తీరుబాటే!

"అమ్మా సుధా, ఆఫీసుకి వెళ్ళొస్తా."

ఆలోచనల నుండి తేరుకొని "తొందరగా రా నాన్నా. ఏదయినా పిక్చర్‌కి వెళ్దాం" అన్నది సుధారాణి.

"అలాగేనమ్మా" అంటూ శివరావు వెళ్ళిపోయాడు.

టేబుల్ మీదనున్న ఇంగ్లీషు నవల తీసింది.

ఆమెకు డిటెక్టివ్ సాహిత్యమంటే చాలా యిష్టం. ప్రఖ్యాత డిటెక్టివ్ రచయితలయిన ఆరుద్ర, కొమ్మూరి, టెంపోరావు మొదలగువారి రచనలు చదివింది.

ఎర్రగుర్రం మీద పరిశోధనకు యుగంధర్, వాలి వెళితే ఎలా వుంటుందో ఆలోచిస్తూ నవ్వుకున్నదామె.

అంతలో ఫోన్ "ట్రింగ్, ట్రింగ్" మంది.

తండ్రి ఆఫీసుకి వెళ్ళి గంటపయినయింది. యింతలో తండ్రి ఎందుకు ఫోను చేసి వుంటాడో ఆమె కర్థం కాలేదు. ఏమైనా మరచిపోయినా పంపడానికి యిక్కడెవరూ లేరు.

"హలో!" అన్నది సుధారాణి.

"హల్లో! వసుధేనా మాట్లాడేది?" అవతల వైపు నుండి ఎవరిదో మొగ కంఠం విన్పించింది.

"సారీ! ఆ పేరుగలవాళ్ళెవరూ లేరు" అన్నది సుధారాణి.

"సారీ ప్లీజ్....రాంగ్ నెంబర్."

ఫోన్ డిస్కనక్టయింది!

సుధారాణి టెలిఫోన్స్వాళ్ళ లీలలకు నవ్వుకున్నది. ఒక నెంబర్ రింగ్ చేస్తే మరో నెంబర్ పలుకుతుంది. అదీ కాకపూతే ఎక్స్ఛేంజ్ వస్తుంది.

నవలతీసి చదవసాగింది.

"ట్రింగ్! ట్రింగ్!"

సుధారాణి రిసీవర్ తీసి చెవి దగ్గిర వుంచుకున్నది.

"హల్లో....యూజిట్ 26389."

సుధారాణి దీర్ఘంగా నిట్టూర్చింది. కారణం!

యిందాకటివ్యక్తే మాట్లాడుతున్నాడు!?

"నో ప్లీజ్.... యిటీజ్ 2·388" అన్నది సుధారాణి.

"ఓ సారీ, మరలా మీ నెంబరే రింగయింది."

"లెటిట్ బి" అన్నది సుధారాణి.

"చూడండి మేడమ్! నేను రింగ్‌చేసే నంబర్ పలక్క గంట నుండి చస్తున్నాను, రాంగ్ నెంబరే వస్తోంది."

"టెలిఫోన్ కంప్లయింట్స్‌కు బుక్ చేయండి" సలహా యిచ్చింది సుధారాణి.

"భలేవారండి మీరు. ఆ నెంబర్ రింగ్‌చేస్తే ఆసుపత్రి పలుకుతోంది."

సుధారాణి కిసుక్కున నవ్వింది.

"మీకు నవ్వులాటగానే వుంటుంది. అర్జంట్ అనుకుంటే పుణ్యకాలం పూర్తయ్యేలా వుంది" దిగులు నిండిన స్వరంతో అన్నాడా వ్యక్తి.

సుధారాణి మాట్లాడలేదు.

"మీకు శ్రమ యిచ్చాను. వుంటానండి" అంటూ అతను ఫోను పెట్టేసాడు.

పాపం! అతనెవరో ఫోను కోసం శ్రమపడుతున్నాడు. అసలు యిలా రాంగ్ నెంబర్స్ ఎందుకు పలుకుతాయో అర్థం కాలేదామెకు.

లేచి భోజనానికి వెళ్ళబోతూంటే మరలా ఫోను మోగింది. బహుశా రాంగ్ నెంబరవవచ్చును. ఒక క్షణం ఆలోచించింది సుధారాణి. రాంగ్‌నెంబర్ కాక తండ్రి ఫోన్ చేస్తే——?

"హల్లో!" అన్నది సుధారాణి.

"సారీ మేడం. మరలా మీకు ట్రబుల్ యిచ్చింది ఫోను" అదే కంఠస్వరం.

అతని స్వరం వింటూంటే జాలి కల్గింది సుధారాణికి. మాట్లాడకుండా వున్నదామె.

"హలో! ఫోను పెట్టేసారా?" అడిగాడతను.

"లేదు. మీ పేరు?" అడిగింది సుధారాణి.

"పద్మనాభం."

"సినిమా ఏక్టర్ పద్మనాభమా?"

నవ్వి "మీరు జోక్స్ బాగా వేస్తారా? లేక నేనంటే వేళాకోళంగా వుందా?" అన్నా డతను.

"అదేం కాదులెండి. మీరు ఫోన్ కోసం పడే శ్రమ చూస్తూంటే జాలి వేస్తోంది."

"మీ కభ్యంతరం లేకపోతే మీ పేరు...." అంటూ ఆగాడు పద్మనాభం.

"నా బెటాల్. నా పేరు సుధారాణి."

"స్వీట్ నేమ్. ఓ - సారీ. మన్నించండి" అన్నాడు పద్మనాభం కంగారుగా.

"పర్వాలేదులెండి. మీ నెంబర్ కోసం ప్రయత్నించండి. వుంటా" అంటూ సుధారాణి ఫోన్ పెట్టేసింది.

సుధారాణి భోజనం చేస్తూ ఆలోచిస్తూ కూచున్నది. యీపూట తనకు బాగా కాలక్షేపమవుతోంది. టెలిఫోన్ వారి ధర్మమా అని రాంగ్ నెంబర్ ధర్మమా అని కాలక్షేపం అవుతోంది.

హాలులో కూచున్నది సుధారాణి. నవల చదవసాగింది. అప్పటికి టైం రెండు కావస్తోంది.

"ట్రింగ్! ట్రింగ్!"

సుధారాణి రిసీవర్ చెవివద్ద పెట్టుకొని "హల్లో పద్మనాభంగారేనా మాట్లాడేది?" అన్నది నవ్వుతూ.

"ఎలా కనిపెట్టారు?" అడిగాడు పద్మనాభం.

"వూహించాను. మీరు రింగ్ చేసిన నెంబర్ రాంగ్ నెంబరవుతుందని, నాకే రింగవుతుందని అనుకున్నా. నా వూహ కలక్టయింది."

"నాకు చాలా నిరాశ కల్గించింది. నాకు కావలసిన వ్యక్తి దొరకక చాలా బాధపడుతున్నాను."

"ఎందుకా బాధ?"

"మీ కర్థం కాదు. పోనీలెండి. మీరు నాకో సహాయం చేయగలరా?" అడిగాడు పద్మనాభం.

"ఏమిటి?"

"తర్వాత కాదంటే బాధపడాలి."

"ఎవరు? మీరా నేనా?"

"నేనే!"

"పడనివ్వనులెండి చెప్పండి!" అన్నది సుధారాణి ఏదో ఆలోచిస్తూ.

"నా కెందుకో భయంగావుంది."

"అభయ హస్తం ప్రసాదిస్తున్నాను. చెప్పండి?"

"యీ సాయంత్రం మీరు ఖాళీగా వుంటారా?"

"ఎందుకు?"

"మీతో టీ త్రాగాలనే కోరికగా వున్నది."

సుధారాణి మాట్లాడలేదు.

"మీకు కోపం వచ్చింది. అవునా? నేను ముందే చెప్పాను. నా కోరిక మీకు సమంజసం కాదని!"

"అదేం కాదు."

"అంటే నా కోరిక మీరంగీకరించినట్లేనా?" వుత్సాహంగా అడిగాడు పద్మనాభం.

"ఒప్పుకుంటున్నాను."

"థాంక్స్. మీ డాడీ ఐదు గంటలకు యింటికి వస్తా

రనుకుంటాను. నేను గం 3-30 లకు మీ యింటికి వస్తాను. యిరువురం 'రూబీ' హోటల్‌కు వెళ్దాం. గంట సేపు కబుర్లు చెప్పుకుంటూ టీ త్రాగుదాం. తర్వాత మీరు మీయింటికి—నేను నా స్నేహితురాలు 'వసుధ' ఇంటికి! ఒ.కే!" అన్నాడు పద్మనాభం.

"ఒ.కే!" అన్నది సుధారాణి.

"మీకేమయినా అభ్యంతరమయితే ముందుగా చెప్పండి. నేను రావడం మానివేస్తాను."

సుధారాణి నవ్వి "నేను అభ్యంతరం లేదని చెప్పాను కదా. మీకెందుకా అనుమానం. నేను మీ కొసం ఎదురు చూస్తూంటాను. నాకు కూడా బోర్ కొడుతోంది. మీ కంపెనీ నాకు హాయి కలిగిస్తుందనుకుంటాను." అన్నది.

"ష్యూర్! తప్పకుండా"

"అయితే, మీరాక కోసం, మా యింటి తలుపులు తెరచి వుంటాయి."

"థ్యాంక్యూ!"

ఫోను డిస్‌కనక్టయింది.

సుధారాణి టైం చూసింది. మూడు కావస్తోంది. పద్మనాభం ఎలా వుంటాడో! తనెటువంటి డ్రస్ వేసుకుంటే బావుంటుందో!

యిప్పటివరకూ తనకెవరూ బోయ్ ఫ్రెండ్స్ లేరు. యీనాటి నుండి పద్మనాభంతో మొదలు!

అసలు తను పద్మనాభం కోరిక ఎందు కంగీకరించింది? తనలో ఏదో బలహీనత ఏర్పడినందువలననే అతని ఆహ్వానాన్ని మన్నించింది.

యీ విషయం డాడీకి తెలిస్తే కోప్పడతాడు!

యికముందు యిలా జరగకూడదు. డాడీ యింటికి

రాకుండానే తాను యింటికి వచ్చేయాలి.

పరాయి మనిషి—ముక్కూ మొహం తెలియనివ్యక్తి? తాను టీకి వస్తానని చెప్పడం!

ఏమిటో ఒక్కో పర్యాయం తమకు తెలియకుండానే కొన్ని కొన్ని విషయాలు జరిగిపోతూంటాయి. అటువంటి పరిస్థితే తాను తెచ్చుకున్నది.

నిలువుటద్దం ముందు తన అందానికి మెరుగులు దిద్దుకోసాగింది సుధారాణి. ఫుల్‌వాయిల్ నీలం చీరం, అదే రంగు జాకెట్ వేసుకున్నది.

రెండు జడలు! ఒకజడ భుజం ముందుకు వేసుకొని అద్దంలో మరలా చూసుకున్నది. తన అందం తనకే వెర్రెక్కిస్తోంది. తనకే దిష్టి తగిలేలావుంది.

పద్మనాభం వచ్చే సమయమయింది. అతనికోసం ఎదురు చూస్తూ తలుపులు ఓరగా తెరచి కూచున్నది సుధారాణి.

పద్మనాభంతో షికారువెళ్ళి యింటికి రావడం ఆలస్యమయితే డాడీ చిన్నబుచ్చుకుంటారు. డాడీతో చిన్న పని మీద వెళుతున్నట్లు తనకోసం ఎదురు చూడవద్దని చెప్పడం మంచిదిలా తోచింది సుధారాణికి.

ఫోను ఆఫీసుకి రింగ్ చేసింది సుధారాణి.

"హలో డాడీ! సాయంత్రం పిక్చర్ ప్రోగ్రాం కాన్సిల్. మరోపని తగిలింది. నా కోసం ఎదురు చూడక. బై!" అనిచెప్పి ఫోన్ పెట్టేసింది.

తిరిగి ఆలోచనలలో పడింది సుధారాణి. అంతలో ఆమెకు మరో ఆలోచన కల్గింది. పద్మనాభం ఫోను చేసే 'వసుదేవరు?'

ఎన్నిసార్లు రింగ్ చేసినా 26389 ఫోను నుండి జవాబు

రాకపోవడమేమిటి? ఆలోచిస్తూ రాంగ్‌నెంబరు పద్మనాభం కోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

2

గుమ్మం బయట కారు హారను విన్పించింది.

సుధారాణి గుమ్మంవైపు చూసింది.

టిప్‌టాప్‌గా వున్న యువకుడొకడు గుమ్మంవద్ద నిలబడి "లోపలకు రావచ్చునా?" అని అడిగాడు.

పద్మనాభం గొంతుకే! మనిషి అందగాడు. ముప్పది సంవత్సరాలుంటాయి! అంతకు ముందుకు అతన్నెప్పుడు చూడ్లేదు.

'కమిన్'. అంటూ సుధారాణి అతన్ని ఆహ్వానించింది.

"ప్లీజ్ కూచోండి. జస్ట్ యిప్పుడే వస్తాను." అంటూ సుధారాణి బెడ్‌రూంలో దూరింది. పది నిమిషాల తర్వాత బయటకొచ్చి "సారీ! ఆలస్యమయింది. పదండి" అన్నది.

యిరువురూ బయటకు నడిచారు.

"యీ కారు...." అడిగింది సుధారాణి.

"నాదే" అంటూ టైం చూసుకున్నాడు పద్మనాభం. నాలుగు గంటలు దాటుతోంది.

"సారీ పద్దూ." అన్నది సుధారాణి.

ఉలిక్కిపడ్డాడు పద్మనాభం. అప్పటికే కారు బయలుదేరింది. డ్రైవ్ చేస్తున్నాడు పద్మనాభం. వెనుక సీటులో కూచున్నది సుధారాణి.

"యూ మీన్ పద్దూ...."

నవ్వుతూ "ముద్దుగా పిలవడం నా కలవాటు. మీ కిష్టం లేకపోతే పద్మనాభమనే పిలుస్తా. యిప్పుడు మన మెక్కడికి వెళుతున్నాం." అడిగింది సుధారాణి.

"చెప్పాను కదా. హోటల్ 'రూబీ'! ఆ తర్వాత...."

"ఊ. తర్వాత?"

మాట్లాడలేదు పద్మనాభం. మవునంగా డ్రైవింగ్ చేయ సాగాడు. పద్మనాభం పదే పదే అద్దంలో వెనుకనుండి వచ్చే వాహనాలను గమనించ సాగాడు. మధ్య మధ్యలో సుధను పరిశీలనగా చూడసాగాడు.

"యింతకు మీ వసుధ ఫోనులో దొరికిందా?" నవ్వుతూ అడిగింది సుధారాణి.

"లేదు. ఆమె దొరకదు. కష్టం!"

"కారణం?" అడిగింది సుధారాణి.

పద్మనాభం మరలా మాట్లాడలేదు. కారుని స్పీడుగా పోనివ్వసాగాడు. సుధారాణి బయటకు చూస్తూన్నదల్లా ఉలిక్కిపడింది.

"మిస్టర్ పద్మనాభం. కారు పట్టణం పొలిమేరలు దాటింది. యిటెక్కడికి?" గాబరాగా అడిగింది సుధా రాణి.

"చూస్తావ్. మాట్లాడక కూచో." పద్మనాభం సంబో ధనలో మార్పు గమనించింది సుధారాణి.

వెనుకనుండి ఏదో కారు వస్తోంది. అది దగ్గరకు వచ్చే సమయంలో బిగ్గరగా అరవసాగిందామె. అయితే అప్పుడే పద్మనాభం హారన్ నొక్కిపెట్టి వుంచాడు.

తర్వాత "పిచ్చి వేషాలేయక నోర్మూసుకొని కూచో, లేకపోతే ...." కోపంగా అన్నాడు పద్మనాభం.

"ఏం చేస్తావ్?"

"వసుధ దగ్గరకు పంపిస్తాను."

"ఆమె ఎక్కడుంది?"

"చెప్తే గాబరాపడతావ్ సుధా. ఆమె ఘోరంగా హత

చేయబడింది?"

"హ....త్యా? ఎవరు చేసారు? నువ్వేనా?" భయం భయంగా అడిగింది సుధారాణి.

అప్పటికి కారు పొలాలలోనుండి వెళ్ళి ఒక పాడు బడిన యింటిదగ్గర ఆగింది. పద్మనాభం క్రిందికి దిగి, "నువ్వు కూడా దిగు మిస్ సుధారాణీ." అన్నాడు.

"యిక్కడ....ఎందుకు?"

పద్మనాభం పిచ్చిగా నవ్వాడు.

"సుధారాణీ! ఒక్కొక్కరికి ఒక్కో అలవాటు. నా అలవాటు వింటే నువ్వు ఆశ్చర్యపోతావ్. అయితే నాకీ అలవాటెలా కలిగిందో నాకే తెలియదు...."

"ఏమిటి నీ అలవాటు?"

"అందమైన అమ్మాయిల చిరునామాలు తెల్సుకోవడం. వారిని ఫోనుద్వారా ఆకర్షించడం—నాతో తీసుకొని రావడం—యిటువంటి ప్రదేశంలో బలాత్కరించడం!"

కెవ్వుమని అరచింది సుధారాణి.

"పిచ్చిపిల్లా, యింకా కథ ప్రవేశం కాకుండానే అరుస్తావేం?" అంటూ ఆమెను కారునుండి బయటకు లాగి చంపమీద చెళ్ళున కొట్టాడు పద్మనాభం.

"వద్దు. నన్నేం చేయక! నీ గురించి యెవరికి చెప్పను. నన్ను వదలిపెట్టు...."

"పిచ్చి సుధా! రా-నన్ను సుఖపెట్టి, నువ్వు సుఖ పడు." అంటూ సుధారాణిని తనమీదకు లాక్కున్నాడు పద్మనాభం.

అతన్ని గెంటి పక్కకు తప్పుకుని "యిప్పుడు జ్ఞాపకాని కొస్తోంది. క్రిందటివారం వూరిబయట ప్రమీల అనే

అమ్మాయి నెవరో బలాత్కారించి హత్యచేశారని పేపర్లో చదివాను ఆ బలాత్కారం—హత్య నువ్వే చేశావా?" అన్నది సుధారాణి.

"ఆ విషయం నీకు ముందుగా జ్ఞాపకానికి రాకపోవడం నీ దురదృష్టం—నా అదృష్టం. యిక ఆలస్యం వద్దు కమాన్." అంటూ పద్మనాభం ఆమె వైపుకి గెంతాడు.

"నీది చాలా చెడ్డ అలవాటు. యిది పిచ్చివాని చేష్ట కన్నా దారుణమైనది. నీలాంటివారిని మెంటల్ ట్రీట్ మెంట్ కు పంపించాలి."

"గుడ్ గర్ల్. నిజం చెప్పావ్. అయితే నీ కా అవ కాశం చాలాతక్కువ. ఎందుకంటే యిక నువ్వు పదిహేను నిమిషాలలో చనిపోబోతున్నావ్?"

"అని నువ్వు పొరబాటు పడుతున్నావ్ పద్దూ. నేను నిక్షేపంలా క్షేమంగా వుంటాను. నేను చెప్పినట్లుగా నిన్ను ట్రీట్ మెంట్ కి పంపిస్తాను. నీ మెదడు వాష్ చేయిస్తా."

"షటప్. నీతో వాగడం నాది తప్పు. నువ్వు క్షేమంగా వుంటావా! హా!—హా!....హా!?" పిచ్చిగా నవ్వాడు పద్మనాభం.

"మిస్టర్ పద్మనాభం. నీ ఫోను పదే పదే నాకు రావ డంతో నాకు నీమీద అప్పుడే అనుమానం కలిగింది. అప్పుడే నాకు ప్రమీల హత్య గురించి జ్ఞప్తికొచ్చింది. 26389 నెంబరుకు ఫోన్ చేసి కనుక్కున్నాను. ఆ నెంబ రులో వసుధ అనే అమ్మాయెవరూలేరు. నువ్వు మోసగాడి వని తేలిపోయింది.

"వచ్చిన అవకాశాన్ని వదలుకోదలచుకోలేదు. నిన్ను

రెడ్ హేండెడ్‌గా పట్టుకోవాలి. ఎలా?

"మా నాన్నకు ప్రోగ్రాం కాన్సిల్ అయినట్లు ఫోను చేసా. అక్కడే లిటిగేషన్ వుంది. సాధారణంగా నా ప్రోగ్రాం ఎప్పుడూ కాన్సిల్ అవవు. అయితే కారణం చెప్తాను. చెప్పలేదంటే ఏదో ఆపదకు సంకేతం.

"నాన్న అందుకు తగు సన్నాహాలు చేస్తాడని తెల్సును. యీలోగా నేను కూడా పోలీసులకు ఫోను చేశాను. నువ్వు రాకముందే నాన్న, యిన్‌స్పెక్టర్ వచ్చారు.

"తర్వాత నువ్వు వచ్చావు. కావాలనే నీతో యిక్కడకు వచ్చాను. నీ నోటిద్వారా చెప్పిన విషయాలన్నీ టేప్ చేశాను. యిదిగో ఆ టేప్." అంటూ జాకెట్ నుండి మినీ టేప్ రికార్డర్ తీసింది సుధారాణి.

"యూ డర్టీ బిచ్. నన్నే మోసం చేస్తావా? నువ్వెలా తప్పించుకుంటావో చూస్తాను." అంటూ పద్మనాభం సుధారాణి మీదకు దూకబోయాడు. అంతే!—

'ఢాం!!' మంటూ పిస్టల్ పేలిన చప్పుడుతో గుండు పద్మనాభం కాలికి తగిలి అతను కెవ్వుమంటూ నేల కూలాడు.

కారు డిక్కీలోనుండి పోలీస్ యిన్‌స్పెక్టర్, సుధారాణి తండ్రి బయటకు వచ్చారు.

"కంగ్రాట్స్ మిస్ సుధా! ఒక ఘోరమైన హంతకుణ్ణి ధైర్యంగాపట్టి అప్పగించినందుకు మా డిపార్ట్‌మెంట్ మీకు చాలా రుణపడి వుంటుంది" అన్నాడు యిన్‌స్పెక్టర్, పద్మనాభం చేతికి సంకెళ్ళువేస్తూ.

నలుగురినీ మోసుకుంటూ కారు పట్నంవైపు బయలు దేరింది. □

రక్తతిలకం

వసుంధర

ఉదయం తొమ్మిదైనా యింకా నిద్రలేవలేదు శశాంక.

తన నెపరూ డిస్టర్బ్ చేయరాదని అతడు ముందే శాసించి ఉన్నాడు. అందువల్ల బాయ్ ఎవడూ అతడి గది వైపు చూడను కూడా చూడలేదు.

శశాంక యింకా ఎంతసేపు నిద్రపోయేవాడో తెలియదు. తొమ్మిది గంటలకు మంచం పక్కనేవున్న ఫోను గణగణ మ్రోగింది.

విసుగ్గా చేయి చాపి రిసీవర్ తీసుకుని—"హలో!" అన్నాడు.

"శశాంకేనా మాట్లాడుతూంట...." సన్నగా మధురంగా ఓ స్త్రీ గొంతు ధ్వనించిందందులో.

"ఊఁ" అన్నాడు శశాంక మత్తుగా.

"నేను—వాసంతిని...."

శశాంకకు మత్తు కాస్త వీడింది-"ఏమిటి విశేషం?"

"మావారూరికి వెళ్ళారు. వెంటనే బయల్దేరివచ్చేయి."

శశాంక లేచి మంచంమీదే ఎగిరి కూర్చున్నాడు—"ఎప్పుడు వెళ్ళారు?" అన్నాడతడు.

"ట్రయినెక్కించి కదిలేదాకా ఆగి టాటా చెప్పి మరీ వచ్చాను. ఇల్లు చేరీ చేరగానే నీకు ఫోన్ చేస్తున్నాను.

"వెరీ గుడ్ - క్షణాలమీద వచ్చేస్తున్నాను...."

"నీకోసం ఎదురు చూస్తూంటాను...."

అతడు ఫోన్ పెట్టేశాడు. మంచంమీంచి ఒక్క ఉరుకురికి బాత్రూంలో దూరాడు. పావుగంటలో వన్ బై వన్ కాలకృత్యాలు తీర్చుకోవడం ముగించాడు. తర్వాత వంటికి పౌడరు రాసుకున్నాడు. బట్టలు వేసుకుని వంటికి, బట్టలకు సెంటు రాసుకున్నాడు.

హోటల్లోంచి బయటపడి ఆటో ఎక్కాడు.

పావుగంటలో ఆటో ఆమె యింటివెనుక ఆగింది.

అదో చిన్న సందు. అతడు డబ్బివ్వగానే ఆటో వెళ్ళిపోయింది.

వెనుక తలుపులు దగ్గరగా వేసివున్నాయి. అతడు

తోయగానే తలుపులు తెరుచుకున్నాయి.

శశాంక అటూ యిటూ చూశాడు.

సందు నిర్మానుష్యంగా ఉంది.

అతడు లోపలదూరి తలుపు గడియవేశాడు.

చిన్న దొడ్డి. అక్కడొక జామచెట్టు, సపోటాచెట్టు ఉన్నాయి. బీర, దోస పాదులున్నాయి. బెండ, వంగ మొక్కలున్నాయి.

ఒక్క పూలమొక్క కూడా లేదు.

"పూర్ టేస్ట్!" అనుకున్నాడతడు.

మరో నాలుగడుగులు వేస్తే యిల్లు....

తలుపులు దగ్గరగా వేసిఉన్నాయి.

అతడు తలుపుతీసి లోపల ప్రవేశించి మళ్ళీ తలుపులు వేశాడు.

సన్నటి వరండా....

వరండాకు పక్కగా చిన్న గది - అది పనిమనిషి గిన్నెలు తోమేందుకు. అక్కడనే స్టోర్‌రూం - వంటగది.

వరండా అయిపోయింది.

అతడు డైనింగ్‌హాల్లో ప్రవేశించాడు. డైనింగ్ హాలు నానుకుని స్నానాలగది ఉంది. గది తలుపులు తెరిచి ఉన్నాయి. లోపల ఎవరూ లేరని తెలుస్తూనే ఉంది.

అతడు డైనింగ్‌హాలు దాటాడు.

డ్రాయింగ్ రూం వచ్చింది.

డ్రాయింగ్ రూంలో కార్పెట్....మూడు సోఫాలు....

ఓ మూలగా టీవీ - మరో మూల స్టీరియో సిస్టం.

గోడలకు పోస్టర్లు....

"గుడ్ టేస్ట్!" అనుకున్నాడు శశాంక.

డ్రాయింగ్ రూంలో ఆమె లేదు.

డ్రాయింగ్ రూం నానుకుని బెడ్రూముంది.

శశాంక బెడ్రూంలో ప్రవేశించాడు.

బెడ్రూంలో కార్పెట్ ....

గది మధ్యగా అర్ధచంద్రాకారంలో రెండు మంచాలు దగ్గరగా చేర్చబడి వలయాకారంలోకి మారాయి.

మంచంమీద మెత్తటి పరుపు.

మంచానికి దగ్గర్లో డ్రస్సింగ్ టేబిల్.

డ్రస్సింగ్ టేబిలుమీద కళ్ళజోడుంది.

శశాంక అక్కడకువెళ్ళి కళ్ళజోడు తీశాడు.

అతడికి తెలుసు....ఆ కళ్ళజోడు వాసంతిది.

కళ్ళజోడు వాసంతి శరీరంలో ఒక భాగం. అది లేకుంటే ఆమె గుడ్డిదానితో సమానం.

అందుకే ఆమె ఎప్పుడూ కళ్ళజోడుతోనే ఉంటుంది.

కళ్ళజోడు ఆమె అందాన్ని పెంచడం ఒక విశేషం.

ఇంకా చెప్పాలంటే కళ్ళజోడుతోనే ఆమె ఎక్కువ బాగుంటుంది.

అయితే కళ్ళజోడు లేకుండా అతడామెను చూడనూ లేదు.

ఇప్పుడు వాసంతి కళ్ళజోడు లేకుండా ఎక్కడికి వెళ్ళింది.

తనకు ఫోన్‌చేసి ఎటు మాయమైంది?

జవాబు చెప్పడానికా అన్నట్లు బెడ్రూంకున్న అటాచ్డ్ బాత్‌లోంచి నీటిధార పడుతున్న చప్పుడు వినబడింది.

అంటే వాసంతి స్నానానికి వెళ్ళిందన్నమాట.

ఇంతసేపూ ఏం చేసింది?

తనకు ఫోన్ చేశాకనే వెంటనే వెళ్ళొచ్చుగా....

మరీ యింత వెంటనే తను రాగలడని ఆమె అనుకో

లేదేమో!

శశాంక నవ్వుకుంటూ బాత్రూంవైపు దారితీశాడు.

గదికి తలుపులు లేదు.

పల్చటి తెర ఉంది.

శశాంక తెరను చప్పుడు కాకుండా తొలగించాడు.

అతడప్పుడు బాత్రూం గుమ్మంలో ఉన్నాడు.

లోపల....

గీజర్లోంచి వెచ్చబడిన నీటిధార షవర్లోంచి వానజల్లులా పడుతోంది.

ఆ వానజల్లులో ఆమె తడుస్తోంది.

పచ్చటి బంగారంలాంటి వళ్ళు.

షవరుకింద ఆమె తళతళ మెరిసిపోతోంది.

నల్లటి పొడవాటి కురులు - ఆమె స్నానం చేస్తూంటే కాసేపు ముందు. కాసేపు వెనక్కి పోతున్నాయి.

శశాంక ఆమెనే చూస్తున్నాడు.

వాసంతి సౌందర్యం అసామాన్యం.

ఆ సౌందర్యం చిత్రపటమై అజంతా గుహల్లో నిలిచి పోవాలి. ఆ సౌందర్యం శిల్పమై కోణార్కలో భాసించాలి. ఆమె చలనం నాట్యమై అంతర్జాతీయ వేదికల నలరించాలి.

శశాంక చప్పుడు చేయకుండా ఆమెనే చూస్తున్నాడు.

తన నల్లటి కురులను తెల్లబరచాలా అన్నట్లు వాటికామె షాంపూ పట్టించింది. మెరిసే ఆ వంటిమీద ఏ కాలుష్యమున్నదనో - ఇంకా ఆ వంటికి సబ్బు పట్టించింది.

శశాంక ఆమెను చూస్తున్నాడు.

అతని శరీరంలో వేడి పుడుతోంది.

వెళ్ళి ఆమెను తాకాలనీ - ఆమెకు హత్తుకుపోవాలనీ

మనసు తొందర పెడుతోంది.

అయినా అతడు నిగ్రహించుకున్నాడు.

ఆమెనలా చూడడం ఒక అపూర్వానుభవం.

ఇలాంటి అవకాశం ఎవరికో తప్ప దొరకదు.

తనున్నాడని తెలిస్తే ఆమె యింత నిస్సంకోచంగా స్నానం చేయదు.

తనకు తెలిసిన యిల్లు కాబట్టి ఆమె సులభంగా మసల గల్గుతోంది తప్ప - యిప్పుడామె గుడ్డివానితో సమానం.

ఆమె షవరుకింద అన్నివైపులకూ తిరిగింది. గుమ్మం వైపుకూడా చూసింది. కానీ కళ్ళజోడు లేని ఆమె కన్నుల కతడు కనబడలేదు.

ఆమె స్నానం ముగించింది.

టర్కిష్ టవలుతో వళ్ళు తుడుచుకుని - టవలును స్టాండుమీద వదిలింది.

స్లిప్పర్‌తో బాత్‌రూం గుమ్మం వరకూ వచ్చింది.

శశాంక పక్కకు తప్పుకున్నాడు.

ఆమె స్లిప్పర్స్ వదిలి డోర్‌మాట్ వద్ద కాళ్ళు తుడుచుకుని బెడ్‌రూమ్‌లో ప్రవేశించింది.

తిన్నగా డ్రెస్సింగ్ టేబిల్ వద్దకు వెళ్ళింది.

వంటికి పౌడర్ రాసుకుంది సెంటు పూసుకుంది.

అప్పుడు చేతులతో తడిమి కళ్ళజోడందుకుని పెట్టుకుంది.

అద్దంలో తన ప్రతిబింబం చూసుకుంటే తన వెనుకనే శశాంకం కనిపించాడామెకు.

ఆశ్చర్యంగా - "అరే నువ్వెప్పుడొచ్చావ్?" అని అందామె.

"నువ్విలా ఫోన్ చేయగానే అలా యిక్కడ

వాలాను...."

అప్పుడు వాసంతి కళ్ళలో సిగ్గు....

"ఏయ్ - నేను పిలిస్తే మాత్రం దొంగలా నా బెడ్ రూమ్‌లో దూరవచ్చా? వెళ్ళి బుద్ధిగా డ్రాయింగ్ రూమ్‌లో కూర్చొని నేను పిలవగానే లోపలకు రా...."

శశాంక ఆమెను బలంగా కౌగలించుకొని - "నేను నిన్ను వదలను...." అన్నాడు.

"నేనే నిన్ను స్వయంగా పిలిచాను. కాబట్టి నేను చెప్పినట్లు వినాలి నువ్వు....లేకుంటే అంతా రసాభాస అవుతుంది."

శశాంక ఆమెను వదిలి డ్రాయింగు రూమ్‌లో కూర్చొన్నాడు.

తనకు వాసంతి ఎలా పరిచయమయిందో అతడాలోచిస్తున్నాడు.

ఆమె భర్తతో కలిసి సినిమాకు వచ్చింది. సినిమా చివర్లో వుండగా ఆమె భర్త వెళ్ళిపోయాడు ఎందుకనో!

వాసంతి ఒంటరిగా హాల్నించి ఇంటికి బయల్దేరాలి.

ఆమె శశాంక నక్కడ పలకరించింది.

"మా వారు అనుకోకుండా ఓ స్నేహితుడింటికి వెళ్ళారు. మీరు నన్ను కాస్త ఇంటిదాకా దిగబెట్టగలరా?" అనడిగిం దామె.

శశాంక ఆమె అందం చూసి సంతోషంగా ఒప్పుకున్నాడు.

ఆమె యింటికి సందు గొందుల అడ్డదార్లు.

ఓ యిరుకు సందులో నలుగురు గూండాలు....

"నిన్ను సినిమాహాల్లో చూశాం....ఇక్కడ కాశాం" అన్నాడొకడు.

ఏం జరుగుతుందో తెలుసుకునేలోగా అక్కడ కొంత అత్యాచారం జరిగింది. ఆమె చీర వూడింది. జాకెట్, బ్రా, పూర్తిగా తొలగించబడ్డాయి.

అప్పుడు శశాంక ఆవేశపడ్డాడు. అతడి ఆవేశం నలుగురు గూండాలనూ అక్కణ్ణించి తరిమేసింది.

ఈలోగా ఆమె చీర కట్టుకుని భుజాలనిండుగా కప్పుకుంది.

శశాంక ఆమెను ఇంటిదాకా తీసుకొని వెళ్ళాడు.

"థాంక్యూ వెరీమచ్!" అందామె.

"అది నా డ్యూటీ!" అన్నాడతడు.

అతడు వెళ్ళిపోతానన్నా బలవంతపెట్టి ఆమె లోపల కాహ్వానించింది. అతణ్ణి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి తను బట్టలు మార్చుకొని వచ్చింది.

"భోంచేసి వెళ్ళాలి మీరు" అందామె.

అతడొప్పుకోలేదు.

"వంట రెడీగా వుంది. వారెలాగూ ఈ పూటకు భోజనానికి రారు. మీరు భోంచేస్తే నాకు తృప్తిగా వుంటుంది" అందామె.

ఆమె సమక్షం నుంచి త్వరగా తప్పుకోవడం అతడికీ యిష్టం లేదు.

ఇద్దరూ కలిసి భోంచేశారు.

భోజనం దగ్గిర క్రమంగా ఆమె తన కథ చెప్పుకుంది. భర్తకు చెడుతిరుగుళ్ళున్నాయి. ఎవరయినా తనతో ప్రేమగా మాటాడితే చాలునని చూస్తోందామె.

"నాకు మీ స్నేహం కావాలి" అందామె.

"మీవంటి అందగత్తె స్నేహం నన్ను తప్పుదారిలో నడిపించవచ్చు" అన్నాడు శశాంక.

"అంటే?" అంది వాసంతి అర్థం కానట్లు.

"గూండాలు మొరటుగా చేయబోయినది నేను స్నేహముతో సాధించాలనుకోవచ్చు. మీరు వివాహిత కాబట్టి నా స్నేహం శ్రేయస్కరం కాదు. నేను బలాత్కారాలకు పాల్పడను. కానీ స్త్రీ నాకు బలహీనత—" అన్నాడు శశాంక నిర్మొహమాటంగా.

ఇలా సూటిగా మాట్లాడ్డం అతడి కలవాటు.

ఆమె నొచ్చుకోలేదు - "జీవితంలో యింతవరకూ నేనెవర్నీ ప్రేమించలేదు. నా కోసం నలుగురు గూండాలను ధైర్యంగా ఎదిరించిన మీపై నాకు ప్రేమ పుట్టింది. నేను వివాహితను కావడం నా దురదృష్టం. మీరు నా స్నేహాన్ని కాదని మరింత దురదృష్టవంతురాలిని చేయవద్దు" అంది నెమ్మదిగా.

ఆమె తనంటే యిష్టపడుతోందని శశాంక గ్రహించాడు. అప్పుడే ఆమెను బెదరగొట్టేయడం యిష్టం లేక "సరే - మనం స్నేహితులం. అందుకు గుర్తుగా ఏకవచన ప్రయోగం ప్రారంభిద్దాం" అన్నాడు.

ఆరోజుకే విశేషమూ జరగలేదు. ఇద్దరూ విడిపోయినా ఒకరి అడ్రసొకరు తీసుకున్నారు. ఫోన్ నంబర్లు నోట్ చేసుకున్నారు.

తర్వాత వీలునుబట్టి థియేటర్స్ దగ్గరా, పార్కుల్లోనూ వాళ్ళు చాలాసార్లు కలుసుకున్నారు.

వారి మధ్య చనువు, చనువుతోపాటు కోరిక పెరిగాయి.

అతడు నిర్మొహమాటంగా తన కోరికను బయట పెట్టాడు.

"ఇంతవరకూ నేను తప్పు చేయలేదు. తప్పు చేయ

దానికి కొంత మానసిక ధైర్యం కావాలి. అంతవరకూ నువ్వాగాలి. నేను తప్పు చేస్తానని హామీ యివ్వగలను" అంది వాసంతి.

తొలి పరిచయంలో ఆమెను అర్ధనగ్నంగా చూశాడు.

ఈనాడు పూర్తినగ్నంగా చూశాడు.

శశాంక మనస్సు ఉత్సాహంతో పరవళ్ళు తొక్కుతోంది.

అతడింకా ఆలోచనల్లో ఉండగానే ఆమె వచ్చింది.

లేత గులాబీరంగు చీరలో—

అదేరంగు బ్లవుజులో—

ఆ రంగు చెక్కిళ్ళతో—

ఆమె ముద్దొస్తోంది.

శశాంక ఆమెను ముద్దు పెట్టుకున్నాడు.

"ఏమిటా తొందర?" అందామె అతణ్ణి మందలిస్తూ.

"నిన్ను చూసి తొందర పడకుండా ఎన్నాళ్ళో ఉన్నాను. ఈనాడు కుదరదు."

ఆమె అతణ్ణి మృదువుగా విడిపించుకుని— "మనం కాసేపు ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకుందాం—" అంది.

అతడంగీకరించాడు.

ఇద్దరూ ఎదురెదురుగా సోఫాల్లో ఉన్నారు.

ఆమె మాట్లాడుతోంది. అతడు వింటున్నాడు.

ఆమె అతడి కళ్ళలోకి చూస్తోంది.

మధ్య మధ్య సుతారంగా జారిన పైటను సవరించుకుంటోంది.

పైట సవరించుకొనడంలో ఆమె చేసే ఆలస్యం అతణ్ణి

రెచ్చగొడుతోంది.

ఆమె మాట్లాడుతోంది. అతడు మాట్లాడలేక పోతున్నాడు.

కాసేపయ్యాక అతడు— "నేను తొందరపడక తప్పదు"— అంటూ లేచి నిలబడ్డాడు.

"ఒక్కక్షణం." అంటూ ఆమె లోపలకు వెళ్ళి కొద్ది క్షణాల్లో తిరిగి వచ్చింది. అప్పుడామె చేతిలో చిన్నసైజు వైన్‌గ్లాస్ ఉంది. గ్లాస్‌లో గులాబిరంగు ద్రవముంది.

"ఏమిటది?" అన్నాడతడు.

"తాగిచూడు...." అందామె.

అతడాగ్లాసందుకున్నాడు. కొద్దిగా రుచి చూశాడు.

అతడికా ద్రవమేమిటో తెలిసిపోయింది.

"ఇది నా కవసరంలేదు—" అన్నాడతడు.

"ఎందుకని?"

"ఇది పురుషుడిలో లేని కోరికను పుట్టిస్తుంది. ఉన్న కోరికను రెట్టింపు చేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మగాణ్ణి మదపిచ్చికి గురిచేస్తుంది...."

"మరి సందేహిస్తావేం? పుచ్చుకో...."

"ఈ ద్రవాన్నిమించి నీ రూపం నన్ను పిచ్చెక్కిస్తోంది...."

"అది చాలదు నాకు....అందుకే ఈ ద్రవం. నువ్వు కేవలం నా కోసం.... నా మీద కోరికతో ఇక్కడ కాసేపు గడపాలి. నేనేం చెప్పినా కాదనలేని స్థితిలో ఉండాలి. అప్పుడే మన స్నేహం ఫలించినట్లు....ఇన్నాళ్ళుగా ఎదురు చూసినందుకు తగ్గ ఫలితం లభించినట్లు....ప్లీజ్ కాదనకు.... పుచ్చుకో...."

అతడు ఒకే గుక్కలో మొత్తం ద్రవాన్ని పుచ్చుకున్నాడు.

ఆ తర్వాత....

2

మర్నాడుదయం ఎనిమిది గంటలు....

అతడప్పుడే మంచంమీంచి లేచాడు.

ట్రేలో కాఫీ తెచ్చింది వాసంతి.

"బెడ్ కాఫీ!" అందామె.

అతడు కాఫీ తాగాడు.

కాఫీ తాగుతున్నంతసేపూ అతడివంకే చూస్తోందామె.

అతడు మాత్రం వంచిన తలెత్తకుండా కాఫీ తాగి అప్పుడామెను చూశాడు,

ఆమె తననే చూస్తోందని గమనించి కొద్దిగా సిగ్గుపడ్డాడు.

అప్పుడే వికసించిన పుష్పంలా ఉన్నదామె!

చూడ్డానికెంత తాజాగా, సుకుమారంగా కనబడుతోంది!

కానీ నిన్న తనామెను ఘోరంగా....ఇంకా చెప్పాలంటే క్రూరంగా....అదీ ఆమె కోరికపై....

అప్పుడేం జరుగుతోందో అతడికి తెలియదు. అతడామెకు పూర్తిగా లొంగిపోయాడు.

నిన్న తన చేతులో దారుణంగా నలిగిన యువతి ఈ రోజెంత తాజాగా ఉంది! అని ఆశ్చర్యపడుతున్నాడతడు.

"ఈ రోజు కూడా ఇక్కడే ఉంటావా?" అంది వాసంతి.

"ఉండొచ్చా?" అన్నాడతడు.

"వద్దు. రేపురా...." అందామె.

"ఎందుకని?"

"ఈ రోజు మధ్యాహ్నం బంధువులొస్తారు!"

"ఎక్కణ్ణించి?"

"హైదరాబాదునించి...."

"హైదరాబాదంటే ఎక్కడ?" అన్నాడతడు.

"హైదరాబాదంటే ఎక్కడుందో నీకు తెలియదా?"

"తెలుసు—ఒకటి ఇండియాలో....ఒకటిపాకిస్తాన్లో."

ఆమె తడబడుతూ—"ఇప్పుడు పాకిస్తాన్ ప్రసక్తి ఎందుకు?" అంది.

"వాసంతీ—నీ పేరు వాసంతికాదు. షబ్నమ్!" అన్నాడు శశాంక.

"షబ్నమ్—ఎవరు చెప్పారు?" అందామె కంగారుగా.

"నాకు తెలుసు - నాపై షబ్నమ్ ప్రయోగించబడు తుందని!"

"నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా?"

"నేనేం మాట్లాడుతున్నానో నీకు తెలుసు. నేనెవరో కూడా నీకు తెలుసు...."

"ఎవరు నువ్వు?" అంది వాసంతి.

"భారత గూఢచారిని...."

"కౌయ్...." అంది వాసంతి.

"షబ్నమ్! నీ అందానికి నా జోహార్లు. నీ ప్రతిభకు కూడా నా జోహార్లు.... కానీ ఈ శశాంకను బుట్టలో వేయడం అంత సులభంకాదు...."

"ప్లీజ్ శశీ....నువ్వలా మాట్లాడకు...."

"నువ్వు పాకిస్తాన్ గూఢచారిణివి. ఇక్కడ మకాం పెట్టావు. ఈ ఊళ్ళో నేనే పనిమీద ఉంటున్నానో నీకు ముందే తెలుసు. నీ అందాన్ని నాకు ఎరగా చూపాలను కున్నావు. గూండాల పేరుతో నాటకమాడి నన్నాకర్షించావు.

నాకు స్త్రీ బలహీనత ఉందని నీకు తెలుసు. అందుకే నన్నూరించి ఊరించి మానసికంగా నీకు బానిసనయ్యే స్థితికి తీసుకుని వచ్చావు. అప్పుడు నాచేత వశీకరణ ద్రవం తాగించి నన్ను నీకు బానిసగా చేసుకున్నావు. నిన్నటి బలహీన క్షణాల్లో నీక్కావలసిన రహస్యాలన్నీ తెలుసుకున్నావు...."

"నీ కథ చాలా బాగుంది. అన్నీ తెలిసే నా దగ్గర కెందుకొచ్చావు? నాతో అనుభవాన్నెందుకు కోరావు? వశీకరణ ద్రవాన్నెందుకు తాగావు....?"

"అదే నాతో వచ్చిన యిబ్బంది. నేను నీ చేత ఆకర్షించబడ్డాను. నీ అందానికి దాసుడి నయ్యాను. నీతో మజా చేయాలనిపించింది. నిన్నటి అనుభవం నేను మరిచి పోలేదు...." అతడు గుర్తు చేసుకుంటున్నట్లు ఆగాడు.

ఆమె నవ్వుతూ - "నీ నుంచి నేను తెలుసుకున్న రహస్యాలు అబద్ధం కావని నాకు తెలుసు. అలా చెప్పి నన్ను నమ్మించాలనుకోకు. వశీకరణద్రవం నీచేత అబద్ధం పలికించదు...." అంది.

"ఆ విషయం నాకు తెలుసు. నేను నీకు మొత్తం రహస్యాలన్నీ చెప్పేశాను. అందులో ఏమీ సందేహం లేదు. అవి చెప్పినప్పుడు నేను నీ మాయలో వున్నాను. నా మీద నాకు అదుపు లేదు. అదీ నీకు తెలుసు...."

షబ్నమ్ తమాషాగా నవ్వి - "సింహాసనం మీద కూర్చోకపోయినా ఈ ప్రపంచాన్ని ఆడదే శాసిస్తుంది" అంది.

"నిజం చెప్పావు....కానీ నీనుంచి ఈ రహస్యాలు నీవాళ్ళకు చేరవు....అదీ నాకు తెలుసు...." అన్నాడు శశాంక.

"ఎందుకని?"

"ఇక మీదట ఈ యిల్లు నా అదుపులో ఉంటుంది."

"ఒకవేళ యిప్పటికే రహస్యాలు చేరవలసిన చోటుకు చేరితే?"

"ఎలా?" అన్నాడు శశాంక ఆశ్చర్యం నటిస్తూ.

"ఎలాగో అలా...."

శశాంక కళ్ళు మూసుకుని - "బహుశా నీ దగ్గర ట్రాన్స్‌మీటరుండి ఉంటుంది. దాంతో నీవాళ్ళకు సమాచారం చేరవేసి వుంటావు....అవునా?"

షబ్నమ్ అవుననలేదు. ఆమె గర్వంగా నవ్వింది.

శశాంక నిట్టూర్చి - "నువ్వు చెప్పింది నిజం. ఆడదే మగాణ్ణి శాసిస్తోందీ ప్రపంచంలో. నేను తెల్సుకున్న రహస్యాలను బాస్‌కి ట్రాన్స్‌మిట్ చేయాలని ఎన్నో విధాల ప్రయత్నించాను. ఎన్నో అడ్డంకులొచ్చాయి. హోటల్లో మైక్రోఫోన్ ఉంటున్నాయి. చుట్టుప్రక్కల ఎవరో పొంచి ఉంటున్నారు. రకరకాల యిబ్బందులు.... ఈలోగానే నువ్వు నా రహస్యాలను లాగేశావు...." అన్నాడు.

"నేను పాకిస్తాన్ గూఢచారిణిని...." అందామె గర్వంగా.

"నీ యింట్లో పనిచేసే పనిమనిషి రామి తెలుసా నీకు?" అన్నాడతడు.

"ఏం?"

"ఆమెపై నీ అభిప్రాయం?"

"పని బాగా చేస్తుంది."

"అప్పగించిన పని ఏదయినా బాగా చేస్తుందామె. ఆమె భారత గూఢచారిణి."

షబ్నమ్ తెల్లబోతూ - "ఇది నేనూహించలేదు. అసలు నన్నెవ్వరూ అనుమానించే అవకాశమున్నదని నేననుకో లేదు" అంది.

శశాంక నవ్వాడు.

"రామి సంగతి యిప్పుడెందుకు చెప్పావు?" అందామె.

"ఆమె నీ యింట్లో ట్రాన్స్‌మీటర్లున్న విషయం కనుగొంది. నిన్ననే వాటి స్థానంలో అలాంటిదే మరో ట్రాన్స్‌మీటరుంచింది."

"అంటే?"

"రామి ఎలక్ట్రానిక్స్ ఇంజనీరు. నీ ట్రాన్స్‌మీటర్స్‌ని క్షుణ్ణంగా అర్థం చేసుకుని డిపార్టుమెంటుకు సమాచారాన్నందజేసింది. ఆలాంటి ట్రాన్స్‌మీటర్లు తయారయ్యాయి ...."

"అయితే!"

"నిన్నరాత్రి నువ్వు పంపిన సమాచారం సరాసరి మా బాస్‌కు చేరింది."

"వ్వాట్!"

"థాంక్స్ ఫర్ ది సర్వీస్-" అంటూ అతను లేచి. నిలబడి ఆమెను దగ్గరగా లాక్కుని బలంగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె అతణ్ణి విడిపించుకుని - "నిజంగా!" అంది.

"టెస్ట్ యువర్ ట్రాన్స్‌మీటర్ ...."

షబ్నమ్ తన బ్లవుజులోంచి ట్రాన్స్‌మీటరు తీసి ఓ నంబర్ నొక్కింది.

"బాస్.... నేను శశాంకను ..." అన్నాడతడు.

"వెల్‌డన్ మైబాయ్...." అందవతలి గొంతు.

షబ్నమ్ ట్రాన్స్‌మీటర్ ఆఫ్‌చేసి - "మోసం" అంది.

"మోసం నీది...." అన్నాడు శశాంక.

"డియర్ శశాంకా! హేట్సాఫ్ టూ యూ...." అంది షబ్నమ్.

"అఫ్‌కోర్స్.... నేను భారతగూఢచారిని కదా!" అన్నాడతడు.

"ఇంత సులభంగా నేను మోసగించబడతాననీ - ఓడి పోతాననీ అనుకోలేదు...." అంది షబ్నమ్ నిట్టూర్చి.

"విచారించకు. పురుషుడి చేతిలో స్త్రీ భంగపడక తప్పదు."

"నేను నీకు తనువు. మనసు ఇచ్చాను. నువ్వు నన్ను మోసగించావు...." అంది షబ్నమ్.

"నేను కూడా నీకు తనువు, మనసు ఇచ్చాను. నువ్వు నన్ను మోసగించావు...." అన్నాడు శశాంక.

"అయితే నీ తదుపరి కార్యక్రమ మేమిటి?"

"ఈ రోజుకు వేరే కార్యక్రమమేమీ లేదు. అంతా నీతోటే...."

"నాతోటా?"

"ఊఁ"

"నేను పాకిస్తాన్ గూఢచారిణిని. ఒక్కసారి మోస పోయినా - అస్తమానూ ఓడిపోను."

"ఈ పూటకు నువ్వు గూఢచారిణివి కాదు."

"మరెవర్ని?"

"ఓ అందాల భామవు."

"అంటే?"

"షబ్నమ్; స్త్రీ నాకు బలహీనత. నీపై నాకు మోజు తీరలేదు. మనం కొన్నాళ్ళిక్కడే సరదాగా గడుపుదాం. కాదనకు."

"ఐ హేట్ యూ...." అంది షబ్నమ్.

"నిన్న నీ ప్రేమను చవిచూస్తూ నీతో గడిపాను. ఈ రోజు నీ ద్వేషాన్ని చవిచూస్తూ రోజంతా గడుపుతాను" అన్నాడు శశాంక.

ఆమె మాట్లాడలేదు.

శశాంక ఆమెను తాళ్ళతో కాళ్లూ చేతులు బంధించి తను స్నానాది కాలకృత్యాలు తీర్చుకుని వచ్చాడు. తర్వాత ఆమెను బంధవిముక్తురాలిని చేశాడు.

ఇద్దరూ కలిసి భోంచేశారు.

కలిసి అనుభవం పంచుకున్నారు.

ఆమె ప్రతిఘటించలేదు.

"ఐ లవ్‌యూ!" అందామె అతడితో.

"థాంక్యూ...." అన్నాడు శశాంక.

"నీవు కోరినట్లే నేను పాకిస్తాన్ గూఢచారిణి నన్న విషయం మర్చిపోతాను. ఇక్కడే వుండిపోయి కనీసం కొంతకాలంపాటు నీతో జీవితం పంచుకుంటాను" అంది షబ్నమ్.

శశాంక నవ్వాడు.

"గూఢచారి వృత్తినుంచి గృహిణిగా నన్ను మార్చిన ఘనత నీదే అవుతుంది" అందామె మళ్ళీ.

"అంటే నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా?"

షబ్నమ్ తల వంచుకుంది.

"డియర్ షబ్నమ్! మన పెళ్ళి నాకిష్టమే! కానీ ఆ భగవంతుడు మనని వేర్వేరు దేశాలలో పుట్టించాడు. నీ

దేశమంటే నీకు భక్తి. నా దేశమంటే నాకు భక్తి. మన దారులు కలవవు. మన జీవితాలు కలవవు...."

"కలుస్తాయి - నేను మారిపోతే?"

"నువ్వు మారవని నాకు తెలుసు."

"ఎలా?"

"నేను మారనని నాకు తెలుసు కాబట్టి!"

షబ్నమ్ మాట్లాడలేదు.

"డియర్ షబ్నమ్! నా దేశానికి సంబంధించి నీవు ప్రమాదకరమైన వ్యక్తివి. నానుంచి రహస్యాలు తెలుసుకుని నీ దేశానికి చేరవేయాలనుకున్నావు. నీ ప్రయత్నం విఫలమైంది. ఇప్పుడు నా స్త్రీలోలత నాధారం చేసుకుని ఇక్కణ్ణించి నెమ్మదిగా తప్పించుకు పారిపోయి-నీ దేశం చేరాలనుకుంటున్నావు. నిన్ను బంధించి హింసించినా నీ దేశం గురించి ఒక్క రహస్యం కూడా నీచేత బయట పెట్టించలేనని నాకు తెలుసు. కానీ నా రహస్యాలు తెలిసిన నిన్ను బ్రతకనివ్వడం నా దేశానికి క్షేమం కాదు. అయాం సారీ...."

మెరుపు వేగంతో శశాంక రివాల్వర్ తీసి ఆమెను పేల్చాడు.

ఎర్రటి చిక్కటి రక్తం ఆమె గుండెల్లోంచీ బయటకు చిమ్మింది.

షబ్నమ్ కుప్పలా కూలిపోయింది.

శశాంక ఆమెను సమీపించి - చిమ్మిన రక్తంతో ఆమె నుదుట తిలకం దిద్ది "మన పెళ్ళి అయిపోయింది. ఏదో ఒక రోజున నాకూ యిలాంటి గతే పడితే స్వర్గంలో నిన్ను కలుసుకుంటాను" అన్నాడు. □

ఘరానా దొంగది

సుంకరి రాంప్రసాద్

ట్రింగ్ ....ట్రింగ్ ....ట్రింగ్ ....

కాలింగ్ బజర్ మ్రోతకు మత్తుగా పడుకున్న డాక్టర్ జీవన్‌రావు ఉలిక్కిపడి లేచాడు.

తన గుండెలమీదనున్న భార్య చేతిని సుతారంగా తీసి ప్రక్కకు పెట్టాడు. ఒక్కసారి సన్నగా మూలిగి

అటు ప్రక్కకు తిరిగి పడుకుంది ఆమె.

ఆమెకు నిద్రపడితే ఒక పట్టాన తెలివిరాదు. అతడికి చీమ చిటుక్కుమంటే చాలు మెలకువ వచ్చేస్తుంది.

"అదృష్టవంతురాలు!" అనుకున్నా డతడు భార్యవంక అసూయగా చూస్తూ.

ఇంతలో....మరోసారి కాలింగ్ బజర్ మ్రోగింది. విసుగ్గా గోడ గడియారం వంక చూసాడతడు.

మూడూ....ఇరవై!

ఇంత రాత్రిపూట తనను నిద్రలేపుతున్న వా రెవరబ్బా ఆఁ?... ఇంకెవరయి ఉంటారు. ఎవరో పేషెంట్లే!

ఎవరికో ప్రాణం మీదకు వచ్చిఉంటుంది.

ఇప్పుడు తన పీకలమీదకు వచ్చింది.

ఒక అర్థరాత్రీ లేదు. అపరాత్రీ లేదు. పాడు జన్మ! ఎప్పుడు పేషెంట్లు పిస్తే అప్పుడు ఎటెండ్ కావాలి.

లేకుంటే, డాక్టర్ గర్వపోతని, పేషెంట్ల ప్రాణా లంటే పూచిక పుల్లకంటే హీనంగా చూస్తాడని....చెడు ప్రచారం బయలుదేరుతుంది.

దానితో తన ప్రాక్టీసు పని గోవిందా!

వెధవ ప్రొఫెషన్! సణుక్కుంటూ మంచం దిగా డతడు.

ఆవులిస్తూ బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు. నైటు గౌన్ సర్దుకున్నాడు.

ఇంతల మరోసారి మ్రోగింది కాలింగ్ బజర్!

అంతే! కోపంతో అతడికి వళ్ళు మండిపోయింది.

విసురుగా వెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా ఇద్దరు యువకులు నిలబడి ఉన్నారు. సుమారు ముప్ఫయి, ముప్ఫయి అయిదు సంవత్సరాల వయసుంటుంది వారికి,

వారిని మ్రింగేసినట్లు చూసాడతడు.

"సారీ ఫర్ ద ఇన్‌కన్వీనియన్స్ డాక్టర్! మా సిస్టర్‌కు చాలా సీరియస్‌గా ఉంది. మీరు కాస్త....ప్లీజ్"

ఆ యువకుని గొంతులో అభ్యర్థన.

డాక్టరు శాంతించాడు. వారితో బయటకు నడిచాడు.

అతడి ఇంటిముందు ఒక నల్లరంగు అంబాసిడిర్ కారు ఆగివుంది. కారు వెనుక సీటులో పడుకొనిఉన్న ఒక యువతి బాధతో మెలికలు తిరిగిపోతూంది.

"అమ్మాయిని తీసుకురండి." అన్నాడు డాక్టర్.... కన్సల్టింగ్ రూమ్‌ను తెరుస్తూ.

ఆ ఇద్దరు యువకులూ, కారు డ్రయివర్ ఆ అమ్మాయిని మోసుకుంటూ లోపలకు వచ్చారు. బల్లమీద పడుకో బెట్టారు.

డాక్టర్ ఆ బల్లను సమీపించాడు. అతనికి ఇరు ప్రక్కలా ఆ యువకులు నిలబడివున్నారు. డాక్టర్ పేషెంట్ గూర్చి ఆత్రంలోనే ఉన్నాడు. తెరచిఉన్న తన బెడ్ రూమ్‌లోనికి పిల్లిలా ప్రవేశించిన కారు డ్రయివర్‌ను అతడు గమనించలేదు.

ఆ యువతి సన్నగా మూలుగుతూంది. బాధతో మెలికలు తిరిగిపోతుంది. డాక్టర్ ఆమె పొట్టపై చేయి వేసాడు.

అంతే!

ఆమె మూలుగు టక్కున ఆగిపోయింది. సన్నని చిరునవ్వుతో ఆమె పెదవులు మెల్లగా విచ్చుకున్నాయి.

ఆశ్చర్యంగా ఆమెవంక చూసాడతడు.

"ఆమెకు ఏ నొప్పిలేదు డాక్టర్!"

కూల్‌గా అంటున్న ప్రక్కనున్న యువకుని వంక ఉలిక్కిపడి చూసాడతడు. అప్పటికే అతడి కడుపుకు

సన్నగా గ్రుచ్చుకుంటున్నాయి ఆ యువకుల చేతులలోని కాకుల మొనలు.

భయంతో నోరు ఆర్చుకుపోయింది అతనికి.

"డాక్టర్! అరచి గోలచేయడానికి ప్రయత్నించవద్దు. నీవు నోరు తెరిచిన మరుక్షణం నీ భార్యా, నీవూ శాశ్వతంగా నిద్రపోతారు.

ఆఁ....యిక మరి గదిలోనికి వెళ్దామా!"

ఆ యువకులవంక ఒకమారు వెర్రిగా చూసి, తడబడుతున్న అడుగులతో బెడ్ రూమ్ వైపు నడిచాడతడు.

లోపల....అచేతనంగా పడిఉన్న భార్యనూ, మంచం ప్రక్కనే నిలబడివున్న కారు డ్రయివర్‌ను చూసేసరికి అతడు హతాశుడై పోయాడు.

"ఏం చేశారు నా భార్యను?" అన్నాడతడు దీనంగా.. ఆత్రంగా.

"యింకా ఏమీ చేయలేదు డాక్టర్! జస్ట్ మత్తుమందు యిచ్చాం. ఎంతయినా ఆడది కదా, భయంతో అరచి గోల చేస్తుందేమోనని.

"ఇప్పుడు, ఆమె నిద్ర పోవాల్సింది తాత్కాలికంగానా లేక శాశ్వతంగానా అన్నది మీపై ఆధారపడి ఉంటుంది."

"ఏం....కావాలి మీకు?"—హీనంగా ధ్వనించింది డాక్టర్ గొంతు.

"మీ ఐరన్ సేఫ్ తాళాలు డాక్టర్!"

అతడు మారు మాట్లాడకుండా, నైటు గౌను జేబులో ఉన్న తాళాల గుత్తిని వారికి అందించాడు.

అతడికి తెలుసు వారిని ఎదురించి ప్రయోజనం లేదని. తన కళ్ళముందే తను కూడబెట్టుకున్న నగదు, నగా, నట్రా అంతా ఊడ్చుకు పోతుంటే ఏమీ చేయలేక,

విస్పహోయంగా విలుచుండి పోయాడతడు.

డాక్టర్ భార్య మెడలోని మంగళ సూత్రాన్ని కూడా విడిచి పెట్టలేదు వారు. దోచుకోవడం పూర్తి అయ్యాక, డాక్టర్‌కు కూడా క్లోరోఫాంతో స్పృహను పోగొట్టి, మరీ, చక్కా పోయారు వారు.

2

"చెప్పండి. ఎలా జరిగింది దొంగతనం?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ దినేష్.

అతని ఎదురుగా కూర్చున్న అప్పలనాయుడు ఇనస్పెక్టర్ వంక దిగాలుగా చూసాడు. అతని ముఖం పీక్కుపోయి వుంది. అతని ప్రక్క ఆతని భార్య కాంతమ్మ కూర్చుని వుంది.

ఇన్‌స్పెక్టర్ ప్రశ్నకు సమాధానం అతడు చెప్పలేదు. అతని భార్య చెప్పింది.

తెల్లవారుఝాము మూడు దాటి ఉంటుంది.

అంతా గాఢంగా నిద్రపోతున్నాం.

పెరటి తలుపును ఎవరో కొడుతూండడంతో నాకు తెలివి వచ్చింది. ఆవులిస్తూ లేచి కూర్చున్నాను.

"ఇంత రాత్రిపూట తలుపు తడుతున్నది ఎవరు చెప్మా అనుకున్నాను."

మా ఆయన, పిల్లలూ వళ్ళు తెలియకుండా నిద్ర పోతున్నారు. మంచం మీదనుండి క్రిందకు దిగాను.

అంతలో మరోసారి తలుపులను తట్టిన శబ్దం వినిపించింది.

"వదినా! కాంతమ్మొదినా!" సన్నగా ఒక ఆడగొంతు వినిపించింది.

అప్పుడు గుర్తుకు వచ్చింది నాకు, ఆ తలుపులను

తడుతున్నది ఎవరయి ఉంటారో?

ఈ రోజునుండీ కార్తీక స్నానాలకు ఏటిలోనికి వెళ్దామనుకున్నాను. అంత ఉదయాన్నే లేవాలంటే నాకు తెలివిరాదు. అందుకే ఎదురింటి అమ్మాజమ్మను కాస్త నన్ను నిద్రలేపమని చెప్పాను.

అమ్మాజమ్మకు ఇలాంటి పూజలూ, పునస్కారాలూ కొట్టిన పిండి. ఆమె ఎలాగూ ప్రతిరోజూ ఏటికి స్నానానికి వెళ్తుంది. ఆమె ఎలాగూ తోడు ఉంటుంది కదా అని, నేనూ వెళదామనుకున్నాను.

'అమ్మాజమ్మే అయిఉంటుంది.' అనుకుంటూ పెరటి తలుపు వైపు నడిచాను.

"ఏం వదినా, ఏటికి స్నానానికి వస్తానన్నావు. రావా ఏమిటి?"

తలుపులను తడుతూ కేకవేసిందామె.

"వస్తున్నా వదినా!" అంటూ తలుపు తెరిచాను.

ఎదురుగా ముసుగు వేసుకొని నిలబడి ఉంది అమ్మాజమ్మ. ఆమెను చూసేసరికి ఆశ్చర్యం వేసింది.

"అమ్మాజమ్మ ఇంత సన్నంగా ఉందేమిటి చెప్మా!" అనుకున్నాను ఆమెవంక ఆశ్చర్యంగా చూస్తూ.

ఆమె ఒక్క అడుగు ముందుకు వేసింది. అప్పుడు చూసాను ఆమె ముఖాన్ని.

ఆమె అమ్మాజమ్మకాదు. ఎవరో యువతి!

"ఎవరు....?"

నా గొంతులోని మాట గొంతులోనే ఉండి పోయింది. ఆ యువతి చటుక్కున ఏదో గుడ్డను నా ముక్కుకు అదిమి పెట్టింది.

ఏదో తీయని వాసన....నా ముక్కుపుటాలకు సోకింది.

కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించింది. ఏదో మైకం నన్ను ఆవహించ సాగింది.

ఆ యువతి చేసైగ చేయగానే ఏవో మూడు ఆకారాలు మెల్లగా మా ఇంటిలోనికి ప్రవేశించాయి. ఆ ఆకారాలు దొంగలని గ్రహించాను.

తర్వాత నాకు స్పృహ తప్పింది.

తెలివి వచ్చే సరికి, నేను పెరటి గుమ్మం దగ్గర పడి ఉన్నాను.

ఇల్లు గుల్లచేసి పోయారు దొంగలు.

బీరువాలో దాచుకున్న సొమ్ము, నగలూ, ఆఖరుకు నా వంటి మీద నగలను కూడా వారు పట్టుకొని పోయారు."

ఆమె చెప్పడం ముగించింది.

"పోయిన నగలు సుమారుగా ఎంత విలువ చేస్తాయి?"

"సుమారు ఇరవై తులాలు ఉంటాయండీ అన్నీకలసి." అంది ఆమె.

"వివరంగా చెప్పండి."

పోయిన నగల వివరాలను చెప్పడం ప్రారంభించింది ఆమె. చిన్న నోట్ పాడ్‌పై ఇన్‌స్పెక్టర్ వ్రాసుకుంటున్నాడు.

ఒకటి, రెండు మామూలు రొటీన్ ప్రశ్నలు అడిగి.... వెళ్ళటానికి ఉద్యుక్తుడయ్యాడు ఇన్‌స్పెక్టర్.

అంతవరకూ సంభాషణంతా కాంతమ్మ, ఇన్‌స్పెక్టర్‌ల మధ్యే జరిగింది. అప్పలనాయుడు మౌనంగా కూర్చుని ఉన్నాడు.

అతనివంక ఆశ్చర్యంగా చూసాడు ఇనస్పెక్టర్.

అతడు ఒక్క మాటకూడా మాట్లాడకపోవడం అతనికి వింతగా అనిపించింది.

"పాపం! మీ ఆయన మూగవారనుకుంటాను."
అన్నాడు అప్పలనాయుడు వంక జాలిగా చూస్తూ....

అంతే!

అప్పలనాయుడి ముఖం నల్లగా మాడిపోయింది.
కాంతమ్మ ముఖం ఎర్రగా కందిపోయింది.

కోపంతో ఆమె ముక్కు పుటాలు పెద్దవయ్యాయి.

"మీరు వచ్చిన పని చూడండి. మా ఇంటి విషయాలు మీకు అనవసరం!" అంది చిరాగ్గా!

అవాక్కయిపోయాడు ఇన్స్పెక్టర్!

ఇందులో వారి ఇంటివిషయమేమిటో ... కాంతమ్మకు ఒక్కసారిగా ఎందు కంత కోపం వచ్చిందో అర్థం కాలేదు అతనికి.

తలను గోక్కుంటూ బయటకు నడిచాడు అతడు.

పాపం....అతనికి తెలియదు.

అప్పల నాయుడు మూగవాడు కాదని. కాంతమ్మ ముందు నోరు ఎత్తని భార్యా విధేయుడని.

ఉన్నమాటంటే ఉలుకెక్కువంటారు కదా! అందుకే కాంతమ్మకు కోపం వచ్చింది తన భర్తను మూగవాడు అనేసరికి.

3

"సో! వాట్ ఆర్ యువర్ ప్రొసీడింగ్స్?"

చూస్తున్న ఫైలును టేబిల్పైన ఉంచి అడిగాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉమాపతి.

అతని ఎదురుగా సబ్ఇన్స్పెక్టర్ దినేష్ ఎటెన్షన్లో నిలబడి ఉన్నాడు. ఒక్కసారి చిన్నగా గొంతును సవరించుకొని చెప్పటం ప్రారంభించాడతడు.

"జరిగిన రెండు దొంగతనాలనూ పరిశీలి స్తే ఆ రెండు దొంగతనాలనూ చేసింది ఒకే ముఠా అని తెలుస్తూంది సర్. ఆ ముఠాలో మొత్తం నలుగురున్నట్లు తెలుస్తుంది. ఒక యువతి, ముగ్గురు యువకులు.

క్లోరోఫాంనూ, కారునూ వినియోగిస్తున్నారంటే వీరు చిల్లర నేరస్తులు కారు. అడ్వాన్స్డ్ క్రిమినల్స్.

అప్పటికీ, ఎందుకయినా మంచిదని, పోలీస్ రికార్డ్ల లోనికి ఎక్కిన పాత నేరస్తులందరినీ కస్టడీలోనికి తీసు కున్నాను. వారిని డాక్టర్ జీవన్‌రావుకూ, కాంతమ్మగారికీ చూపించాను.

కాని ఈ లోకల్ క్రిమినల్స్‌లో ఆ దొంగలు లేరని స్పష్టం చేసారు వారు.

కాంతమ్మగారి కేసును తీసుకుంటే:

ఆరోజు తెల్లవారుఝామున కాంతమ్మను ప్రక్కింటి అమ్మాజమ్మ వచ్చి, నిద్రలేపి, కార్తీక స్నానాలకు పిలు స్తుందని వారు గ్రహించగల్గారంటే, తాము దోపిడీ చేయ బోయే ఇంటినీ, పరిసరాలనూ, అక్కడి మనుషులనూ వా రెంతగా స్టడీచేసారో అర్థం అవుతుంది.

వారు లోకల్ క్రిమినల్స్ కారు కాబట్టి పైవారికి ఇదంతా స్టడీ చేయాలంటే రెండు, మూడు రోజులైనా పడుతుంది.

ఎవరయినా క్రొత్తవారు తమ ఏరియాలో వరుసగా రెండు, మూడు రోజులు తచ్చాడితే ఆ ప్రాంతంలోని వారికి అనుమానం వస్తుంది.

కాని, అలా అనుమానం రాకుండా ఏ ప్రదేశాన్నయినా పరిశీలించగల అవకాశం ఎవరికి ఉంది?

ఒక్క భిక్షగాళ్ళకు మాత్రమే.

నేను కాంతమ్మవాళ్ళు ఉంటున్న వీధిలో ఎంక్వయిరీ చేసాను. నా అనుమానం నిజమని తేలింది.

దొంగతనం జరుగడానికి ముందు వరుసగా మూడు రోజులూ ఒక సాధువు ఆ వీధిలోనికి భిక్షకు వచ్చేవాడట. ఎవరో క్రొత్త సాధువు కామోసు ననుకున్నారు ఆ వీధిలోనివారు. దొంగతనం జరిగాక మరి ఆ సాధువు కనిపించటం లేదు.

ప్రస్తుతం ఊరిలోనున్న భిక్షగాళ్ళనూ, సాధువులనూ, సన్యాసులనూ స్టేషన్‌కు పిలిపించాను.

వారిలో కూడా ఆ దొంగలు లేరని డాక్టర్ జీవన్‌రావు, కాంతమ్మ చెప్పారు.

ఊరిలోనికి ఎవరయినా క్రొత్త భిక్షగాడుగాని, సాధువు గాని వస్తే వెంటనే మనకు రిపోర్ట్ చేయమని చెప్పి, ఆ భిక్షగాళ్ళను వదిలేసాను.

రాత్రులు గస్తీ తిరగడానికి కొందరు కానిస్టేబిల్స్‌ను నియమించాను.''

అతనివంక మెచ్చుకోలుగా చూసాడు సర్కిల్ ఉమాపతి.

"గుడ్ వర్క్! ఫర్దర్ ప్రోగ్రస్ ఏమైనా ఉంటే నాకు రిపోర్ట్ చేయండి.''

సి. ఐ. కు సెల్యూట్ చేసి గది బయటకు నడిచాడు ఇన్‌స్పెక్టర్ దినేష్.

తనపై అధికారి తను చేసిన ఏర్పాట్లను మెచ్చుకోవడం వలన వచ్చిన ఆనందం అతని ముఖంలో తాండవిస్తోంది.

అయితే, అతనిలో ఆ ఆనందం ఎంతోసేపు నిలువలేదు.

అతడు తన గదిలోనికి వెళ్ళి, కుర్చీలో కూర్చోగానే రైటర్ బాబూరావు అతని దగ్గరకు వచ్చాడు. ఇన్‌స్పెక్టర్‌కు సెల్యూట్ చేసి, మెల్లగా చెప్పాడు యిలా:

"మీరు సి. ఐ. గారితో మాట్లాడుతూ ఉండగా ఫోన్ వచ్చింది సర్. మెట్ట వీధిలోని బంగారం వ్యాపారి సుందరాచారి ఇంట్లో దొంగతనం జరిగిందట సార్."

"ఎప్పుడు....?"

"మధ్యాహ్నం రెండుగంటల ప్రాంతంలోనట!"

అతడొకసారి చేతికున్న రిస్ట్‌వాచ్ వంక చూసుకున్నాడు. టైమ్ అయిదు కావస్తూంది.

'ఈపాటికి దొంగలు సురక్షితంగా తమ గూళ్ళకు చేరి ఉంటారు.' అతడు అసహనంగా తల విదలించాడు.

అవమానంతో అతని ముఖం ఎర్రవారింది.

ఇన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసాక కూడా, పట్ట పగలు, మిట్ట మధ్యాహ్నం, టౌన్ మధ్యనున్న ఒక యింటిని హాయిగా దొంగలు దోచుకోగలారంటే....అది తమ డిపార్ట్‌మెంట్‌కూ, ముఖ్యంగా తనకూ ఎంత అవమానకరమో అతనికి తెలుసు.

అతడు మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రూం లోనికి నడిచాడు.

'ఫర్దర్ ప్రోగ్రస్ ఏమైనా ఉంటే, తనకు రిపోర్ట్ చేయమని' కొద్ది క్షణాలక్రితమే సి.ఐ. అతనితో అన్నాడు.

ఇప్పుడు దొంగలయొక్క ప్రోగ్రస్‌ను రిపోర్ట్ చేయడానికి సి. ఐ. గదిలోనికి వెళ్ళాలంటే అతనికి సిగ్గుగా ఉంది.

కాని తప్పదు కదా. ఉద్యోగ ధర్మం!

4

"మధ్యాహ్నం ఒంటిగంట దాటి ఉంటుంది. సరాసరి తిన్నగా మా ఇంటి గేటుముందే ఆగింది వారెక్కి వచ్చిన కారు. వెధవ సంతని నేనే దగ్గరుండి మరీ ఇంటిలోనికి ఆహ్వానించి తీసుకొని వెళ్ళాను." అన్నాడు సుందరాచారి.

ఒక్కసారిగా పది లంఖణాలు చేసినట్లు పీక్కుపోయి ఉంది అతని ముఖం.

"మీరే స్వయంగా ఆ దొంగలను ఇంటిలోనికి తీసుకొని వెళ్లారా?" ఆశ్చర్యంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్ దినేష్.

"నా కర్మ! అప్పటికి దొంగలని ఎక్కడ తెలిసి ఏడ్చింది! దిక్కుమాలిన సంతని పెళ్ళివారనుకొని మోస పోయాం!" బాధగా అరచేత్తో నుదురును కొట్టుకున్నాడు సుందరాచారి.

"పెళ్ళివారా!—" ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా నోరు వెళ్ళబెట్టాడు.

"అవునండీ! మా కర్మకాలి ఆ సంతను పెళ్ళివారే అనుకున్నాం. అయినా వారిని చూసి దొంగలని ఎలా అనుకోగలం? దర్జాగా కారులో వచ్చారు.

అబ్బాయి అంటే పెళ్ళికొడుకు దబ్బపండులా ఉన్నాడు. అబ్బాయి తండ్రి, అన్నయ్య, వదిన....మొత్తం వచ్చిన నలుగురూ హుందాగా, దర్జాగా కన్పిస్తున్నారు. వారి సఫారీ సూట్లూ, బూట్లూ, ఆ అమ్మాయి కట్టుకున్న పట్టు చీరా, పెట్టుకున్న నగలూ....వారిని చూస్తే లక్షాధికారుల్లా ఉన్నారు...."

"అంటే ఈ కేసులో కూడా, ఒక యువతి, ముగ్గురు యువకులు ఉన్నారన్నమాట! అంటే ఈ దొంగతనం చేసింది కూడా పాత ముఠాయే." అనుకున్నాడు ఇనస్పెక్టర్.

సుందరాచారి చెప్పుకుంటూ పోతున్నాడు.

"ఏ మాత్రం జంకూ, గొంకూ లేకుండా దర్జాగా ఇంటిలోనికి వచ్చారు. హాయిగా కుర్చీల్లో కూర్చుని, మేం ఏర్పాటుచేసిన పలహారాలన్నీ సుష్టుగా తిన్నారు.

ముదనష్టపు సంతని,

పందికొక్కుల్లా పలహారాలన్నీ మేసి మరీ యిల్లు దోచుకుపోయారు.... వెధవ సంత."

"జరిగిందేమిటో కొంచెం వివరంగా చెబుతారా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"చెబుతున్నాగా!"

"అహం.... అలా కాదు. మొదటనుండీ, వివరంగా చెప్పండి."

"హుం!" అని ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చి చెప్ప సాగాడు సుందరాచారి.

"ఈ మధ్య మా అమ్మాయికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నాం. ఏవో ఒకటి, రెండు సంబంధాలు వచ్చాయి. మాకు నచ్చలేదు. వైజాగ్‌లో మా బాబాయి కొడుకు వెంకటేశ్ అని, షిప్ యార్డ్‌లో పనిచేస్తున్నాడు. వాడు ఒక సంబంధాన్ని తీసుకు వచ్చాడు. అబ్బాయి వాడితోనే షిప్ యార్డ్‌లో పనిచేస్తున్నాడట!

రేపు పెళ్ళి చూపులకు, పెళ్ళివారిని తీసుకొని వస్తానని చెప్పాడు. మరి ఏమయిందో ఏమో మధ్యాహ్నం పన్నెండు గంటల వేళ సడన్‌గా ఫోన్ చేసాడు....వైజాగ్ నుండి.

'పెళ్ళి కొడుకుకు రేపు సడన్‌గా ఏదో కాంప్ తగిలిందట. అందుచేత పెళ్ళివారు ఈ రోజే బయలుదేరి వచ్చేస్తున్నారు. యింకో గంటా, గంటన్నరలో అక్కడ ఉంటారు. సిద్ధంగా ఉండండి' అని చెప్పాడు వాడు.

వాడికేదో ఇన్‌స్పెక్షన్ తగిలిందట. అందుచేత తాను రాలేక పోతున్నానని. పెళ్ళివారు నల్ల అంబాసిడర్ కారులో వస్తారు, వారిని రిసీవ్ చేసుకోమని చెప్పాడు.

వాడు చెప్పినట్లుగానే, వారు నల్ల అంబాసిడర్ కారులో వచ్చారు. వెంకటేశ్ పంపించాడని చెప్పడంతో....మరి నాకు అనుమానమే రాలేదు. వారిని సాదరంగా ఇంటిలోనికి ఆహ్వానించాను.

మేము మాట్లాడుతూ కూర్చున్నాం. అమ్మాయిని అలంకరించి తీసుకు వచ్చింది నా భార్య. ఆడవాళ్ళూ, పిల్లలూ చాప మీద కూర్చున్నారు. మగపెళ్ళివారితో వచ్చిన యువతి తాను కూడా చాపమీదే కూర్చుంది.

కాసేపు ఏవో మాట్లాడాక, హాండ్‌బ్యాగ్‌లో నుండి స్ప్రేయింగ్ సెంట్ బాటిల్‌ను బయటకు తీసింది. సరదాగా నవ్వుతూ పిల్లలపైనా, ఆడవారిపైనా సెంట్‌ను స్ప్రే చేసింది.

అంతే! మరు నిముషంలో వారంతా మత్తుగా వూగుతూ, నేలమీద వాలిపోయారు. నేను ఆందోళనగా గట్టిగా అరవబోయాను. ఒక యువకుడు ఛటుక్కున నా నోరును మూసాడు. నేను కోపంతో విసురుగా లేవబోయాను. మరో యువకుడు నా భుజాలను అదిమిపెట్టాడు. మూడవవాడు పెద్ద కత్తిని నా గొంతుమీద ఉంచాడు.

గొంతు విప్పినా, ఎదురించడానికి ప్రయత్నించినా, నిర్దాక్షిణ్యంగా చంపి పారేస్తామని బెదిరించారు వారు. నేను భయంతో కర్రలా బిగుసుకుపోయాను.

ఆ యువతి, తెలివి తప్పి పడిఉన్న ఆడవారి వంటి

మీదనున్న నగలను వలచడం ప్రారంభించింది. ఇద్దరు యువకులు నన్ను ఇంటిలోనికి నడిపించారు. మూడవ వాడు అక్కడే కాపలా ఉన్నాడు.

నా చేతులతోనే ఇనప్పెట్టెని, బీరువాను తెరిపించారు. నగదూ, నగలూ, వెండిసామానూ, పట్టు చీరలూ అన్నింటినీ మా సూట్ కేస్‌లోనే సర్దుకొని మరీ చక్కాపోయారు.

దిక్కుమాలిన సంతకు ఏ జన్మలో అచ్చి ఉన్నానో. నా ఇల్లును గుల్ల చేసి పోయారు."

దుఃఖంతో అతని గొంతు సన్నగా వణికింది.

అతనివంక జాలిగా చూసాడు ఇనస్పెక్టర్.

"మరి....వారు కారులో బయలుదేరినప్పుడు అయినా, మీరు కేకలు వేసి, ఇరుగు పొరుగు వారిని పిలవక పోయారా?"

"అప్పుడు నాకు తెలివి ఉంటే కదా!"

"అంటే?"

"దోచుకోవడం పూర్తయినాక, వెళ్ళిపోయే ముందు ఆ దిక్కుమాలిన సెంటును నా ముఖానికి కూడా స్ప్రే చేసారు. అంతే! నేనూ తెలివి తప్పి పడిపోయాను."

ఇనస్పెక్టర్ సాలోచనగా తల పంకించాడు.

పట్టపగలు పెళ్ళివారి వేషాలలో వచ్చి దర్జాగా యిల్లు దోచుకుపోయారంటే వారెంత ఘరానా దొంగలో....

ఎంత ప్లాన్డ్‌గా, సుందరాచారినీ, అతడి కుటుంబ వ్యవహారాల్నీ స్టడీ చేసారో అర్థం అవుతుంది.

ఇన్‌స్పెక్టర్ ఆలోచిస్తున్నాడు.

ఈ పెళ్ళి సంబంధం గూర్చి దొంగలకు ఎలా తెలిసి ఉంటుంది? సుందరాచారితో అతని బాబాయి కొడుకు ఈ

సంబంధం గూర్చి చెబుతూ వుండగా ఆ దొంగలు విని వుండాలి.

"ఎలా వారికి ఆ అవకాశం చిక్కింది?"

ఇన్స్పెక్టర్ సుందరాచారి వంక చూసాడు.

"వెంకటేశ్ ఈ సంబంధం గురించి మీతో ఎక్కడ చెప్పాడు? ఐ మీన్....మీరు యింట్లో ఉన్నప్పుడా? షాపులో ఉన్నప్పుడా?"

"షాపులోనే కూర్చుని మాట్లాడుకున్నాంమేం."

"అప్పుడు షాపులో ఎవరెవరు ఉన్నారో చెప్ప గలరా?"

ఒక్క క్షణం ఆలోచించి, తరువాత తలను అడ్డంగా తిప్పాడు సుందరాచారి.

"ఊహుఁ....సరిగ్గా గుర్తులేదుగాని ఎవరో ఇద్దరు ముగ్గురు పల్లెటూరి వారున్నారనుకుంటాను. ఏదో వెండి సామాను బేరం చేస్తున్నారు."

"ఆ పల్లెటూరి వారిలో ఏ ఒక్కరికయినా ఇప్పుడు మీ ఇంటిలో పడ్డ దొంగల్లో ఏ ఒక్కరితోనైనా పోలి కలు కలిసే అవకాశం ఉందా?"

మరోసారి తలను అడ్డంగా త్రిప్పాడు సుందరాచారి.

"ఏమో! ఆ పల్లెటూరివారిని నేను సరిగా గమనించ లేదు."

ఇన్స్పెక్టర్ అసహనంగా తల విదిలించాడు.

ఆ దొంగలను గూర్చి సుందరాచారి ప్రత్యేకంగా చెప్పబోయేది ఏమీ లేదని అతనికి అర్థమైపోయింది.

పోయిన నగదు, నగలు వాటి వివరాలను వ్రాసుకొని, ఒకటి రెండు మామూలు ప్రశ్నలు అడిగి సుందరాచారిని

పంపించేశా డతడు.

దొంగలు చాలా పకడ్బందీగా ప్లాన్ వేసుకొని మరీ ఈ దోపిడీలు చేస్తున్నారు. ఎక్కడా, ఏ చిన్న క్లూను కూడా విడిచిపెట్టటం లేదు.

ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా, ఎంత కట్టుదిట్ట మయిన కాపలా ఏర్పాటు చేసినా వారి దొంగతనాలను అరికట్టటం అసాధ్యమై పోతూంది.

ఎలా?

ఎలా ఈ ఘరానా దొంగలను పట్టుకోవడం?

తీవ్రంగా ఆలోచిస్తున్నాడు ఇన్‌స్పెక్టర్ దినేష్.

అంతలో ....

గోడకు కొట్టిన బంతిలా రివ్వుమంటూ తిరిగి వచ్చాడు సుందరాచారి.

అతని వంక ఆశ్చర్యంగా చూసాడు ఇన్‌స్పెక్టర్.

"సార్! ఇప్పుడు గుర్తుకు వచ్చింది. ఆ దొంగల ముఠాలోని యువతికి కంఠం మీద కుడివయిపున కంది బద్దంత పుట్టుమచ్చ వుంది."

సుందరాచారి మాటలకు నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు ఇన్‌స్పెక్టర్‌కు.

ఆ పుట్టుమచ్చ గురించి చెప్పడానికి పరుగెత్తుకుంటూ వచ్చిన అతని వంక జాలిగా చూసాడు ఇన్‌స్పెక్టర్.

అతడికి కేసును చూస్తుంటే నవ్వు వస్తూంది. 'నల్ల రంగు అంబాసిడర్ కారు, ముగ్గురు యువకులు, ఒక యువతి, ఆమె కంఠంపై పుట్టుమచ్చ.' ఇవీ ఈ కేసు లోని క్లూలు. వీటి ఆధారంతో దొంగలను వెతికి పట్టుకో వాలి. సాధ్యమయ్యేనా?

5

"సో....వాట్ నెక్స్ట్....మిస్టర్ దినేష్?"

సాలోచనగా చూస్తూ అడిగాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉమాపతి.

"ప్రయత్నిస్తున్నాం సర్!" మెల్లగా అన్నాడు దినేష్.

"ప్రయత్నాలు కావు దినేష్! ఫలితాలు కావాలి. కేవలం పది రోజుల వ్యవధిలో మన సర్కిల్‌లో మూడు మేజర్ థెఫ్ట్స్ జరిగాయంటే....ఇట్స్ ఎ షేమ్‌ఫుల్ ఆన్ అవర్ పార్ట్. సిగ్గుతో మనం తలలు వంచుకోవాలి.

ఈ రోజు ఉదయం స్థానిక ఎం. ఎల్. ఏ. ఫోన్ చేసారు. ఒక గంట క్రితం డి.ఎస్.పి. ఫోన్ చేసారు.

వీరందరికీ సంజాయిషీలు యిచ్చుకోవాలంటే నాకు తల కొట్టేసినట్లుంది.

షేమ్ దినేష్! ఇట్స్ ఎ గ్రేట్ షేమ్!

ఒకదాని తరువాత ఒకటిగా మన ప్రాంతంలోనే వారు దొంగతనాలను కొనసాగిస్తున్నారంటే....ఆఫ్టరాల్ ఆ దొంగ వెధవలకు కూడా....మనం వెధవల్లా కనిపిస్తున్నామన్న మాట!

నో! ఐ కాంట్ బేర్ ఇట్!

ఆఖరికి దొంగలకు కూడా మన డిపార్టుమెంటు అలుసయి పోవటాన్ని నేను సహించలేను."

నిప్పులు త్రొక్కిన కోతిలా కోపంతో చిందులేస్తున్న సర్కిల్ వంక విస్మయంగా చూసాడు దినేష్. తల వంచుకుని అతడు వేస్తున్న పిచ్చి కేకలను మౌనంగా భరిస్తూ నిలుచున్నాడు.

"నల్ల అంబాసిడర్ కారు కన్పిస్తే ఆపి చెక్ చేయ.

మనండి. అందులో ముగ్గురు యువకులు, ఒక యువతిగాని కనిపిస్తే వెంటనే ఆ కారును అక్కడ ఆపి. మనల్ని కాంటాక్ట్ చేయమనండి. కంఠంపైన పుట్టుమచ్చ ఉన్న కొత్త యువతి ఎవరయినా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే ఆమెను స్టేషన్‌కు తీసుకొని రమ్మనండి. మన కానిస్టేబుల్స్ అందరికీ వీటి విషయమై స్ట్రిక్ట్ ఆర్డర్స్ యివ్వండి."

ఉమాపతి చెబుతున్న మాటలన్నింటికి బుద్ధిగా తలూపాడు ఇన్‌స్పెక్టర్ దినేష్.

గది బయట నిలుచుని, వారి మాటలను వింటున్న హెడ్డు ఉలిక్కిపడ్డాడు.

"ఉరిమి, ఉరిమి మంగళం మీద పడ్డట్టు ఇదేదో మా నెత్తిమీదికి వచ్చేటట్లుంది" అనుకున్నాడతడు.

సర్కిల్ గది తలుపులు తెరుచుకున్నాయి. విసురుగా బయటకు వచ్చాడు ఇన్‌స్పెక్టర్ దినేష్.

సి. ఐ. తో తల వాచేట్లు చీవాట్లు తిని వచ్చిన ఇన స్పెక్టర్ దినేష్.... హెడ్డు వంక కోపంగా చూసాడు.

"పిల్లికాలు ఎద్దు మడితే, ఎలుక వయిపు ఎర్రగా చూసిందట!"

ఆ సామెత గుర్తుకు వచ్చింది హెడ్డుకు.

"ఇక నన్ను తింటాడు గురుడు!" అనుకున్నాడు హెడ్డు....ఇన్‌స్పెక్టర్ వంక దీనంగా చూస్తూ.

6

బాణంలా దూసుకు వస్తున్న నల్లరంగు అంబాసిడర్ కారును చూసేసరికి, సి.ఐ.గారు యిచ్చిన ఆజ్ఞలు టక్కున గుర్తుకు వచ్చాయి కానిస్టేబుల్ రాజయ్యకు.

చటుక్కున చేతిలోనున్న స్టాప్ బోర్డును చూపించా

రతడు.

కీసుమంటూ శబ్దం చేస్తూ ఆగిందా కారు.

ట్రాఫిక్ కంట్రోలింగ్ పిల్లర్ నుండి క్రిందకు దిగి, ఆ కారును సమీపించాడు రాజయ్య. కారులోనికి తొంగి చూసాడు. కారులోనున్న వ్యక్తులను చూడగానే అతని కళ్ళు మిలమిలా మెరిసాయి.

ఏదో పెన్నిధి దొరికినట్లు అతని ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

కారు ముందు సీట్లో ఇద్దరు యువకులు, వెనుక సీట్లో ఒక యువతి, యువకుడు కూర్చుని ఉన్నారు. తెల్లగా పాల మీగడలా మెరుస్తున్న ఆ యువతి కంఠం మీద కుడివైపున కంది బద్దంత పుట్టుమచ్చ!

నల్లరంగు అంబాసిడర్ కారు, ముగ్గురు యువకులు, ఒక యువతి, ఆమె కంఠంపై కందిబద్దంత పుట్టుమచ్చ. సందేహం లేదు. వీరే ఆ దొంగల ముఠా!'

"యురేకా!" అని గట్టిగా అరవాలనిపించిందతనికి.

ఈ దెబ్బలో తనకు ప్రమోషన్ ఖాయం! ఒక్క సారిగా హెడ్డు. ఛ! ఛ! హెడ్డేం ఖర్మ! ఏకంగా ఇన్‌స్పెక్టర్ అయిపోతాను....' అతడు కలలలో తేలిపో సాగాడు.

కారును ఆపేసి కారు దగ్గరకు వచ్చి శిలావిగ్రహంలా నిలబడి పగటి కలలు కంటున్న రాజయ్య వంక విసుగ్గా చూసాడు డ్రయివ్ చేస్తున్న యువకుడు.

"క్యేఁ" మంటూ హారన్ వాయించాడు.

హారన్ శబ్దానికి ఉలిక్కిపడి, ఊహల లోకం నుండి బయటపడ్డాడు రాజయ్య.

"మీరొకసారి స్టేషన్‌కు రావాలి" అన్నాడు రాజయ్య

ఎంతో మర్యాదగా.

తన మాట వారు కాదనరని అతనికి తెలుసు. అతనికి పది అడుగుల దూరంలో ఇద్దరు సార్జెంట్సు బుల్లెట్స్‌పై సిద్ధంగా వున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను లెఖ్ఖచేయకుండా, ఏవయినా వాహనాలు వెళ్ళినట్లయితే వాటిని వెంబడించి అడ్డగించేందుకు ఆ సార్జెంట్స్ నియమింపబడ్డారు.

అతడి మాటను నిర్లక్ష్యం చేసి ఆ కారు ముందుకు కదలిన మరుక్షణం ...ఆ సార్జెంట్సు బుల్లెట్సుపై వారిని వెంటాడి అరెస్ట్ చేస్తారు.

ఆ సార్జెంట్స్ విషయం. వాహనాలపై ప్రయాణించే వారందరికీ తెలుసునని, రాజయ్యకు తెలుసు.

అందుకే అతడంత ధైర్యంగా, ధీమాగా ఆ కారును ఆపి, వారిని స్టేషన్‌కు రమ్మని పిలిచాడు.

"ఎందుకు? అడిగా డొక యువకుడు అసహనంగా.

"ఎందుకో, మా ఇనస్పెక్టరుగారు చెబుతారు. మీరు ముందు స్టేషన్‌కు పదండి" అన్నాడు రాజయ్య.

వారు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"మే మేమీ రాంగ్ రూట్‌లో రాలేదే?"

"అవును, రాలేదు."

"మా లైసెన్సు కరెక్టుగానే ఉంది. కావాలంటే చూడండి."

"అవును ఉండే ఉంటుంది."

డ్రయివింగ్ సీటులో కూర్చున్న యువకుడు అందిస్తున్న లైసెన్స్ పేపర్స్ చూడకుండానే అన్నాడు రాజయ్య.

"అయితే స్టేషన్‌కు ఎందుకు రావటం?"

"అది స్టేషన్‌లో మా ఎస్. ఐ. గారు చెబుతారు."

అంతవరకూ మౌనంగా కూర్చుని వున్న యువతి మెల్లిగా నోరు తెరిచింది. పక్కనున్న యువకుని చూసి,

"వాట్ ఆల్ దిస్. అతనితో డిస్కషన్ ఎందుకు? యిక్కడెక్కడయినా ఫోన్ దొరుకుతుందేమో చూడు రాజ్!

డాడీని కాంటాక్టు చేస్తాను.

ఇక్కడో ట్రాఫిక్ కాన్‌స్టేబుల్ మనల్ని అల్లరి పెడుతున్నాడని డాడీకి చెబితే .... తరువాత జరగాల్సింది ఆయనే చూసుకుంటారు" అంది ఆమె చిరాకుగా.

"డాడీ ఎవరు?" అడిగాడు రాజయ్య ఆమె వంక అనుమానంగా చూస్తూ.

"ఆమె ఎవరనుకున్నావ్? డి.ఎస్.పి. గారి అమ్మాయి. ఆ ప్రక్కనున్న అబ్బాయి....ఆమెకు కాబోయే భర్త!"

మెల్లగా, రహస్యం చెబుతున్నట్లుగా అన్నాడు డ్రయివింగ్ సీట్లో కూర్చున్న యువకుడు.

డి. ఎస్. పి. పేరు విన్నవెంటనే కంగారు పడ్డాడు రాజయ్య. అయితే ఆ తడబాటు కేవలం ఒక్కక్షణం మాత్రమే!

ట్రాఫిక్ కంట్రోలింగ్‌కు పంపిస్తూ, తనతో తమ హెడ్డు అన్న మాటలు టక్కున గుర్తుకు వచ్చాయి రాజయ్యకు.

"ఒరే రాజయ్యా!

నీవొక పిచ్చి మాలోకానివి. నీ ముఖం చూడగానే నీ దొట్ట వెధవ సన్నాసివని ఎవడికైనా ఇట్టే అర్థం అయిపోతుంది.

ట్రాఫిక్ కంట్రోలింగ్‌లో మనం చాలా ఎలర్ట్‌గా

ఉండాలి.

రాంగ్ రూట్లో పోయినవాళ్ళు, లైసెన్స్‌లు లేనివాళ్ళు, ఓవర్ స్పీడు వెళ్ళేవారు. మనం ఆపేసరికి, మననుండి తప్పించుకోవడానికి, తాము ఇనస్పెక్టర్ బావమరుదుల మనో, సి ఐ. గారి చుట్టాలమనో, ఎస్. పి. గారి స్నేహితులమనో హరికథలు చెబుతుంటారు.

వారి కథలు మనం నమ్మామంటే మన చెవిలో పువ్వు పెట్టి వారు చక్కాపోతారు."

ఆ మాటలు గుర్తుకు రాగానే రాజయ్య ఎలర్ట్ అయిపోయాడు. 'అర్థమైనవారితోనూ చెవిలో పువ్వు పెట్టించుకోవడానికి తనేం చవట సన్న్యాసి కాడు.'

వారివంక కోపంగా చూశాడతడు.

"పదండి. స్టేషనుకు వెళ్దాం" అన్నాడతడు తను కూడా కారులో ఎక్కి కూర్చుంటూ.

7

"ఎక్కడ? ఎక్కడ ఆ దొంగలు?"

స్టేషన్‌లో అడుగు పెడుతూనే ఎగ్జయిట్‌మెంట్‌లో చిన్నగా అరిచాడు సర్కిల్ ఇనస్పెక్టర్ ఉమాపతి.

"సెల్‌లో పెట్టాము సర్!"

వినయంగా సి. ఐ. కు సెల్యూట్ చేస్తూ అన్నాడు కానిస్టేబిల్ రాజయ్య.

"గుడ్ వర్క్! గుడ్ వర్క్! అవునూ....వారిని పట్టుకున్నది ఎవర్రా?" చకచకా సెల్‌వైపు నడుస్తూ అడిగాడు ఉమాపతి.

"నేనే సర్! ట్రాఫిక్ కంట్రోలింగ్‌లో డ్యూటీ చేస్తుండగా వీరు పట్టుబడ్డారు. వెంటనే స్టేషన్‌కు తీసుకువచ్చి, సెల్‌లో పడేసి, మీకు ఫోన్ చేసాను." సి. ఐ.

వెనుకే మెల్లగా నడుస్తూ చెప్పాడు రాజయ్య.

"వెరీ గుడ్....! వెరీగుడ్....!" అన్నాడు ఉమాపతి, అతనివంక మెచ్చుకోలుగా చూస్తూ.

"నాదేముంది. అదంతా మీ గొప్పతనమే సర్!

నల్లరంగు ఎంబాసిడర్ కారు, ముగ్గురు యువకులు, ఒక యువతి, ఆమె కంఠంపై కంది బద్దంత పుట్టుమచ్చ. ఆ క్లూలన్నీ యిచ్చింది మీరే కదా సార్! మీరిచ్చిన క్లూల సాయంతోనే నేను ఆ దొంగలను పట్టుకోగలిగాను."

వినయంగా అన్నాడు రాజయ్య.

తను ఆరోజు ఎస్. ఐ. తో అన్నమాటలు అంత సత్వర ఫలితాన్నిచ్చినందుకు సంతోషంగా ఉబ్బి, తబ్బిబ్బయిపోయాడు....ఉమాపతి.

వారింకో నాలుగడుగుల్లో సెల్‌ను సమీపిస్తారనగా....

"తాను డి. ఎస్. పి. కూతురునని బుకాయించడానికి ప్రయత్నించింది సర్....ఆమె! అలాంటి టక్కులు నా దగ్గరా?"

రాజయ్య మాటలకు ఉలిక్కిపడ్డాడు ఉమాపతి. ఒక్క అంగలో ఆత్రంగా సెల్ దగ్గరకు చేరుకున్నాడు.

లోపల....

ఆ ముగ్గురు యువకుల మధ్యా అసహనంగా అటూ, ఇటూ పచార్లు చేస్తూంది ఆ యువతి.

గులాబి రంగు జార్జెట్ చీర, భుజాలపై వ్రాలుతున్న నల్లని వత్తయిన జుట్టూ, నిండయిన బుగ్గలూ, చేపల్లాంటి కళ్ళూ....లక్క పిడతలాంటి నోరూ....సందేహం లేదు. ఆమే!

"మైగాడ్!" అన్నాడతడు అప్రయత్నంగా.

కొన్ని నెలల క్రితం....డి. ఎస్. పి గారి యింట్లో

జరిగిన ఏదో ఫంక్షన్‌కు వెళ్ళినప్పుడు చూసాడు.

అదే ముఖం అదే రూపు.

సందేహంలేదు. ఆమె డి.యస్.పి. గారి అమ్మాయే!

అరచేతులు చెమటలు పట్టాయి ఉమాపతికి.

'తన ముద్దుల కూతురిని జైలులో పెట్టారన్న వార్త తెలియగానే' డి.యస్.పి. రూపం ఎలా వుంటుందో ఊహించుకొనే సరికి అతని బి.పీ. పెరగసాగింది.

"ఓపెన్ ద డోర్స్!" పిచ్చివాడిలా గట్టిగా అరిచాడతడు.

"సారీ.... మేడం! సారీ ఫర్ ద ఇన్‌కన్వీనియన్స్.... ఏదో తెలియక మావారు చేసారు."

కటకటాల బయట నిలబడి తనను అభ్యర్థిస్తున్న ఉమాపతి వంక ఒక్కక్షణం ఆశ్చర్యంగా చూసిందామె.

మరుక్షణం కోపంతో ఆమె ముఖం కందగడ్డలా మారిపోయింది.

"మీరు డి.యస్.పి. గారి అమ్మాయని తెలియక....!" నీళ్ళు నములుతూ అన్నాడతడు.

"తెలియకపోతే, చెప్పినప్పుడు వినాలి. హౌ డేర్ యూ ఆర్ టు కీప్ మి ఇన్ ద సెల్?" కోపంగా అరిచిందామె.

ఆమె నిజంగా డి.యస్.పి. గారి అమ్మాయని తెలిసిన మరుక్షణం కానిస్టేబిల్ రాజయ్య భయంతో వణికిపోయాడు.

ఆ యువతిని లాలించి, బుజ్జగించి, ప్రతిమాలి, కూల్ డ్రింక్స్‌తో కూల్ చేసి. 'డి.యస్.పి. గారితో ఈ విషయం చెప్పనని' ఆమెతో ప్రామిస్ చేయించుకొని,

అప్పటికప్పుడు కేజీ జీడి పప్పును తెప్పించి, వారి కారులో పెట్టించి, వారిని సగౌరవంగా సాగనంపే సరికి....

ఉమాపతికి తల ప్రాణం తోకకు వచ్చింది.

కారు కదలినంత వరకూ బయటే నిలుచుని, తరువాత స్టేషన్‌లోనికి నడిచాడు.

లోపలకు రావడంతోనే చుట్టూ కలియజూసాడు. "ఎక్కడ? ఎక్కడ ఆ రాజయ్య?" కోపంగా అరిచాడతడు.

ఏడీ....పాపం ఆ పక్షి అక్కడ ఉంటేగా!

స్టేషన్‌కు అరఫర్లాంగు దూరంలో భయంతో....పరుగెడుతున్నాడతడు.

'ఈ క్షణంగాని సి.ఐ. ఉమాపతికిగాని చిక్కితే.... తనను కర, కరా నమిలేస్తాడని' అతనికి తెలుసు.

అందుకే ఆ పరుగు!

పిచ్చివాడిలా పరుగెడుతున్న రాజయ్య వంక ఆశ్చర్యంగా చూస్తూ, స్టేషన్‌లోనికి అడుగుపెట్టాడు హెడ్డు.

"రాజయ్యను ట్రాఫిక్ కంట్రోలింగ్‌కు పంపించింది నీవేనా?"

ఎదురుగా రాక్షసునిలా నిలబడి, కోపంగా అడుగుతున్న సర్కిల్‌ను చూసి తడబడ్డాడు హెడ్డు.

"అవున్సార్!" అన్నాడతడు సెల్యూట్ చేస్తూ.

అంతే!

ఆకలిగొన్న సింహం లేడి పిల్లను తినేసినట్లు, హెడ్డును తినేయటం ప్రారంభించాడు సర్కిల్ ఉమాపతి.

అత్తమీద కోపం దుత్తమీద చూపించటం అంటే.... ఇదే! అనుకున్నాడు హెడ్డు....మౌనంగా ఆ చీవాట్లను భరిస్తూ....

* * *

సుమారు రెండు గంటల తరువాత....

టేబిల్ పై నున్న ఫోన్ మ్రోగేసరికి, ఆత్రంగా తీసాడు సర్కిల్ ఉమాపతి.

"థాంక్యూ సి.ఐ. గారూ! మీ దయవలన మేం క్షేమంగా ఇంటికి చేరుకున్నాం!" తీయగా వినిపించిందొక అమ్మాయి గొంతు.

ఫోన్ చేస్తున్నది ఎవరో అర్థం అవగానే అతనిలో ఆత్రం బయలుదేరింది మళ్ళీ.

"డాడీకి....అదే డి.ఎస్.పి. గారికి, జరిగిన విషయం చెప్పలేదుగదమ్మా!" అడిగాడతడు ఆత్రంగా.

ఆమె కిలకిలా నవ్వింది.

"మీరు అనుకుంటున్నట్లుగా నేను డి.యస్.పి. గారి అమ్మాయిని కాదు సర్.

మీ కానిస్టేబిల్ అనుమానించినట్లుగా....మేమే ఆ ఘరానా దొంగలం!"

ప్రక్కలో బాంబు పడ్డట్లు ఉలిక్కిపడ్డాడతడు. ఏమీ చేయలేని ఉక్రోషంతో, ఉద్రేకంతో అతని చేయి రిసీవర్ పై బిగుసుకుంటూంది.

"కాని....డి.యస్.పి. గారి అమ్మాయి అచ్చంగా."

ఆమె మరోసారి నవ్వింది తీయగా.

"ఆమెకూ, నాకూ దగ్గర పోలికలుండటం మా అదృష్టం! ఆ విషయం మాకు కూడా తెలుసు.

మీలాంటివారు మమ్మల్ని హెల్ద్ చేయడానికి ప్రయత్నించినప్పుడు....ఆ అస్త్రాన్ని ప్రయోగిస్తాం. చక్కగా తప్పించుకొని వస్తాం.

అన్నట్లు....మీకో గుడ్ న్యూస్!

మేం ఈ జిల్లానుండి మకాం ఎత్తేస్తున్నాం. మీరు ఇక నిశ్చింతగా ఉండవచ్చు."

చేతిలో చిక్కిన దొంగలను చేజేతులారా వదలిపెట్టి నందుకు విచారించాలో, తను సర్కిల్ ను వదలి ఆ దొంగలు దూరంగా వెళ్ళిపోతున్నందుకు సంతోషించాలో, అర్థం గాక తెల్లముఖం వేసాడతడు.

"బై దిబై ....మీ రిచ్చిన జీడిపప్పు చాలా బాగుంది. థాంక్స్ ఎలాట్:"

చిన్నగా నవ్వింది ఆమె.

అంతే!

అవమానంతో అతని ముఖం నల్లగా తారు డబ్బాలా తయారయ్యింది.

"ఇట్స్ షేమ్! షేమ్! షేమ్!"

అనుకున్నాడతడు.... తనను తానే కసిగా తిట్టుకుంటూ. □

అవసరానికో వేషం



అగ్నిప్రవత

సి. వి. నరసింహదాసు

'ట్రిక్ ....టక్ ....'

'.... ....'

'టక్ ....టక్ ....టక్ ....'

మగత నిద్రలో బద్ధకంగా అటు తిరిగి పడుకున్న తులసి చెవులకి తలుపు తడుతున్న శబ్దం లీలగా సోకింది.

"టక్ ....టక్ ...."

శబ్దం స్పష్టంగా వినిపిస్తుందిప్పుడు....ఉలిక్కిపడి లేచి కూర్చుంది తులసి. నిద్రమత్తు పూర్తిగా వదిలిపో యింది. గోడగడియారం పన్నెండున్నర గంటలు సూచిస్తూ ఠంగున మ్రోగింది.

ఇంతరాత్రి ఎవరు? తమ తలుపేనా తట్టేది? ఏవేవో ఆలోచనలు ఆమె మదిలో మబ్బుల్లా ముసురుకుంటు న్నాయి. మనసు కీడు సూచిస్తూంది. శరీరం చిన్నగా కంపించసాగింది....

శబ్దం మళ్ళీ వినిపించింది.

తులసి లేచి బెడ్రూంలోంచి డ్రాయింగ్ రూంలోకి వచ్చింది. లైటు వేయకుండానే....చీకటిలో నిలబడి ఓరగా కిటికీ తలుపులు తెరచి బైటకు చూసింది....బయట అంతా చీకటి. ఎవరూ కనిపించలేదు.

ఆమెకు క్యాంప్‌కువెళ్తూ భర్తచేసిన హెచ్చరిక గుర్తు కొచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి ఎవరైనా తలుపు తడితే తీయవద్దని, అప్రమత్తంగా వుండమని మరీ మరీ జాగ్రత్తలు చెప్పివెళ్ళాడు.

"ఎవరూ?" కేకేసింది. ఆమె గొంతు విచిత్రంగా, అందులో వణుకు ఆమెకే తెలుస్తున్నది. గుండె వింతగా కొట్టుకుంటోంది.

"నేనే శ్రీరామ్‌ని."

నూతిలోంచి వస్తున్న శబ్దంలా, బలహీనంగా వినిపించిం దవతలనుండి. ఆ మాటలు గాయపడ్డ మనిషి, కొన వూపి రితో కొట్టుకుంటూ పలికినట్లున్నాయి.

ఏమైంది తన భర్తకు? క్యాంప్‌కు వెళ్ళలేదా? ఆ గొంతు

తన భర్తదే. ఏక్సిడెంట్‌గాని జరుగలేదుకదా!' రక రకాల ఆలోచనలతో ఆమె సతమతమైపోతోంది.

ఆందోళనగా హాల్లో లైటువేసి, తలుపు గడియ తీసింది. అదే ఆరాత్రి ఓ సరికొత్త సంఘటనకు దారి దాటితీస్తుందని, ఆమెకు తెలీదు.

అదే క్షణంలో లోనికి దూసుకువచ్చాడో ఆగంతకుడు. చేతిలో తుప్పుపట్టిన ఓ పాతకాలపు కత్తి వుంది....జీబురు జుత్తు, పెరిగిపోయిన గడ్డం....నలిగిన బట్టలు....కాళ్ళకు చెప్పులు లేవు....పళ్ళంతా మురికిగా....కొత్త వాసన వేస్తోంది. కళ్ళు లోతుకుపోయి, దేగ చూపుల్లా అనిపి స్తుంది. చితికిపోయిన నవనాగరికతకు ప్రతినిధిలా వున్నాడు.

అనుకోని హఠాత్పరిణామానికి బెదిరి ఆమె కెవ్వన కేకేయబోయింది. అతడు మెరుపులా కదిలి, వెనుక నుండి ఒడిసి పట్టుకుని, కుడిచేత్తో నోరు మూసేశాడు.

"అరవకు...అరిస్తే చంపేస్తాను" కటువుగా అన్నాడు ఎడమచేత్తో గడియ పెడుతూ.

తులసికి పెనుగులాడటం నిష్ప్రయోజనమని తెలిసి పోయింది. నిస్సహాయంగా చూసిం దతనివైపు.

అతడామెను, సోఫా దగ్గరకు తీసుకువెళ్ళాడు.... ఆమెను సోఫాలో కూలేసి, ఎదురుగా కూర్చున్నాడు.

అతడు దొంగతనానికే వచ్చాడని స్పష్టంగా తెలిసి పోతోంది. ఇలాంటి సంఘటనల గురించి కథల్లో చద వడం, సినిమాల్లో చూడడం తప్ప అనుభవంలోనికి రాలే దింతవరకు.

తులసికి ముచ్చెమటలు పోస్తున్నాయి....చెమటతో శరీరం తడిసిపోతోంది. అత డామెను పరిశీలనగా

పైనుండి క్రిందివరకు చూశాడు.

పాతికేళ్ళలోపే వుంటుంది వయసు. నిండు యవ్వనంతో మిసమిసలాడుతోంది. నారింజపండు దేహచ్ఛాయ, బల్బుకాంతిలో నిగనిగ మెరుస్తూంది. వంచిన విల్లులా కనుబొమలు. వాటి నడుమ కాస్త చెదిరిన బొట్టు.... కోటేరు నాశిక....కోమలమైన పెదవులు....కెంపులు పొదిగిన చెంపలు....సొంపైన కంఠం....ఆ క్రిందుగా కొద్దిగా జారిన పైటలోంచి పైకి పొంగుతున్న యవ్వన సంపద. జాకెట్‌కు చీరకు నడుమ క్షీరసాగరంలా పొంగుతున్న ఉదరభాగం.

అతడు తల విదిలించాడు.

తులసికి అతడి చూపులు తేళ్ళు, జెర్రులు ప్రాకుతున్నట్టనిపిస్తున్నాయ్. లేడిని చూసే వ్యాఘ్రం చూపుల్లా వున్నాయవి.

ఆమె నిండుగా పైట సర్దుకుంది. భయంతో శరీరం గజగజ వణుకుతోంది.

అతడు నింపాదిగా నలుదిశల పరికించి చూస్తున్నాడు. బహుశా దొంగిలించాల్సిన వస్తువుల్ని అంచనా వేస్తున్నాడు గాబోలు....

"ఏం చేస్తాడు వీడు?" తను ఒంటరిగా వున్నట్టు వీడికి ముందే తెలుసా? కేవలం దొంగతనంతోనే సరిబెడతాడా? తన కేమీ హాని చేయడుగదా?

ఆ ఆలోచన రాగానే ఆమె గుండెల్లో పిడుగులు రాలుతున్నట్టనిపించింది....నో....నగలు, డబ్బు పోయినా ఫర్వాలేదు....తన శరీరాన్ని మాత్రం మలినం చేయకూడదు.

అసలు తనదే బుద్ధి తక్కువ....ఎంత ఫూలిష్‌గా

తలుపు తీసింది: గట్టిగా అరిచినా వినబడనంత దూరంలో వున్నాయి చుట్టుపక్కల ఇళ్ళు....విన్నా ఒకరి నొకరు పట్టించుకోని ఫోష్ ఏరియా అది....ఆమె తనను తానే నిందించుకుంటోంది.

అతడు లేచి తులసిదగ్గరి కొచ్చాడు.

ఆమె బెదిరిపోయింది.

"నో....నో....నన్నేం చేయకు...." భయంగా అరిచింది. ఆమె పెదవులు కంపిస్తున్నాయి.

"ష్" చిరాగ్గా చూశాడతను.

"ప్లీజ్. నీకు కావల్సినంత డబ్బు పట్టుకుపో....నన్ను మాత్రం విడిచిపెట్టు ..." హిస్టీరికల్‌గా అరుస్తోంది.... ఆమెకు అతడో కిరాతకుడిలా, మగువల మాన ప్రాణాలతో ఆడుకునే నరరూప రాక్షసుడిలా కనిపిస్తున్నాడు.

మోచేయి బిగించి బలంగా ఆమె దవడపై గుద్దాడు.... ఆ విసురుకి ఆమె తూలి సోఫాకి అడ్డంగా పడింది. అతడే ఆమెను లేవనెత్తి సరిగ్గా కూర్చోబెట్టాడు. పెదవి చిట్లి భగ్గున మండింది. రక్తం జివ్వున పొంగింది.... చేతుల్లో మొహం దాచుకుని ఏడవసాగిందామె.

"సారీ...." అన్నాడతడు గిల్టీగా....ఆమె అతడికేసి వితంగా చూసింది....అర్ధరాత్రి దొంగలా ప్రవేశించి, చేయి చేసుకున్నందుకు క్షమాపణలు చెబుతున్న అతడి తీరు విస్మయాన్ని కలిగించింది.

'నీకేం భయంలేదు....నే నలాంటివాడ్నికాను' తల వంచుకుని అన్నాడు..ఆమె మనసు కొద్దిగా స్థిమితపడింది.

'నాకు అర్జంటుగా తిండి కేదైనా కావాలి....చాలా ఆకలిగా వుంది' దీనంగా ఆమెకేసి చూశాడు....

'వుండు బీరువాలో బిస్కట్లున్నాయి తెస్తాను.'

ఆమెలో కంగారు తగ్గింది. కొద్దికొద్దిగా ధైర్యం కలుగుతోంది. తీసుకు రమ్మన్నట్టు తలాడించాడు.

"నన్ను పట్టివ్వడానికి పిచ్చి పిచ్చి ప్రయత్నాలు చేయకు....నాకు అనుమానం కలిగిన మరుక్షణం ఈ కత్తి నీ కడుపులో దిగుతుంది...." హెచ్చరిస్తూ ఆమె వెనుకే నీడలా కదిలాడు.

తులసి బిస్కట్లు తీసిచ్చింది..ఆబగా వాటిని తినేశాడు.

"మరి లేవా?"

"ఊహుఁ."

"వంట చేయలేదా?"

"నా ఒక్క దానికోసం చేసుకోవడానికి బద్ధకమేసి, టిఫిన్ మాత్రం చేసుకున్నాను."

"నా కింకా ఆకలి తీరలేదు....నువ్వు అన్నం వండాలి. అన్నీ సిద్ధంగా వున్నాయా?"

అర్ధరాత్రి ఇంట్లోదూరి, తీరిగ్గా తిండి సంగతి చూస్తున్న అతడి పరిస్థితి తులసికి ఆశ్చర్యం కలిగిస్తూంది. చిరాకునూ కలిగిస్తూంది.

ఆమె కదిలి వంటింట్లోకి నడిచింది. గేస్టవ్ వెలిగించి అన్నానికి పెట్టింది. అతడు వంటింటి తలుపు దగ్గరే నిల్చున్నాడు.

అతడు తననుకున్నంత ప్రమాదకారి కాదని తెలియగానే ఆమె తలపైనుండి కొండంత బరువు దింపుకున్న ఆనందం కలిగింది. అతడు చెప్పినట్లు వినడంకన్నా తనకు గత్యంతరం లేదు. అతడిని మెల్లగా కబుర్లలోకి దింపింది.

"నీ పేరు?"

"అవసరమా?"

"చెప్పడం, చెప్పకపోవడం నీ యిష్టం."

"కృష్ణారావు."

"నేను ఒంటరిగా వున్నట్టు నీ కెలా తెల్సు...."

"సాయంత్రం నువ్ నీ భర్తకు సెండాఫ్ ఇస్తున్నప్పుడు నీ సంభాషణ విన్నాను."

"దొంగతనం నీ వుద్యోగమా?"

"కాదు."

ఆమె వెనుతిరిగి అతడి వయిపు చూసింది. అతడి గొంతులో సిన్సియారిటీ ఆమెను అబ్బుర పరుస్తోంది.

అరగంటలో వంట పూర్తయింది. వంకాయ వేపుడు కొద్దిగా చారు కాచింది. చేతులు కడుక్కు వచ్చి, పీటవేసు కూర్చున్నాడు కృష్ణారావు.

ఆమె ప్లేట్‌లో అన్నం వడ్డించింది.

"నువ్వు కూడా నా కెదురుగా కూర్చో" అన్నాడు. తను భోంచేస్తున్న సమయంలో ఆమె ఎవరికయినా ఇన్‌ఫార్మ్ చేస్తుందేమోనని అతడి భయం.

ఆమె నవ్వుతూ అతడి కెదురుగా కూర్చుంది. ఇందాకటి బెదురు పూర్తిగా తగ్గిపోయింది. అతడు ఆ భోజనమే పరమావధి అన్నట్టుగా, ఎన్నాళ్ళ నుండో తిండి మోహం ఎరుగనివాడిలా ఆబగా తింటున్నాడు.

"నీ గురించి చెప్పు" అడిగింది తులసి.

"చెబుతానమ్మా! ఆకలితో చచ్చిపోతున్న వాడికింత అన్నం పెట్టావు. నువ్వు నాకు అమ్మకన్న ఎక్కువే. నీ చేతి వంట అమృతమమ్మా....అమృతం...." అతడి కళ్ళల్లో కన్నీరు ఆమెను కలచివేసింది.

"మాది మధ్యతరగతి కుటుంబం....చిన్ననాడే అమ్మను పోగొట్టుకున్నాను. అప్పటినుండి నాన్నే నాకు తల్లీతండ్రీ అయ్యాడు....ఎలాగో బి. ఎ. పూర్తిచేసి ఉద్యోగాన్వేష

జిలో పడ్డాను. ఎన్నో ఇంటర్వ్యూల కెళ్లాను. ఎన్నెన్నో చేదు అనుభవాలు చవి చూసాను. నాకు రికమండేషన్ లేదు. రిజర్వేషన్ లేదు. డబ్బు లేదు....అగ్రకులంవాడి నని పనికిరావన్నారు కొందరు. అధికారుల ధన దాహం తీర్చలేవు పొమ్మన్నారు మరికొందరు. ఈలోగా నాన్న మంచానపడి కన్ను మూసాడు. నేను ఒంటరి పక్షినయి, బికారిగా రోడ్డున పడ్డాను

ఉద్యోగం సంపాదించే వయోపరిమితి దాటిపోయింది. ఇరవయి ఏళ్ళు కష్టపడి సంపాదించుకున్న సర్టిఫికేట్లు నాకు తిండి పెట్టలేకపోయాయి. ఆకలి మనిషిచేత ఎన్ని ఘోరాలనయినా చేయిస్తుంది. అప్పటికీ మనసు చాపక బస్టాండులో మూటలు మోసాను. అద్దెకు రిక్షా లాగాను. చేయని నేరాలు నెత్తిన రుద్ది తరిమి కొట్టిం దీ సమాజం.

చివరికిలా....నేను భోంచేసి నాలుగు రోజులయిం దమ్మా....ఆకలి తట్టుకోలేక వచ్చాను. ఇదే మొదటి సారమ్మా ఇలా రావడం....నావల్ల ఎవరికీ అపకారం జరగదమ్మా....జరగదు...." బుగ్గలపయికి జారిన కన్నీ ళ్ళని ఎడమచేతితో తుడుచుకున్నాడు.

అతడి కథ వింటుంటే తులసి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి కడుపులో దేవినట్టయింది.

ఆమె ఏదో అడగబోయింది. అంతలో ముందు గదిలో దబ్బున ఏదో శబ్దం. ఆమె కంగారుగా లేచింది. అతడు అడ్డగించలేదు....ఒకరిపై ఒకరికి నమ్మకం కలిగింది. అతడు మౌనంగా తింటూనే వున్నాడు.

తులసి ముందు గదిలోకి వచ్చింది. అంతే! రెండు బలమైన చేతులు వెనుక నుండి ఆమె నోరు గట్టిగా అదిమి పట్టేశాయి.

ఆమె అరవడానికి ప్రయత్నించింది గానీ, ఆమె ప్రతి ఘటన నిరర్థకమై పోతోంది. ఆ ఉక్కు పిడికిళ్ళ నుండి తప్పించుకోలేకపోతోంది....నీరసంగా, నిస్సహాయంగా ఆ ఆకారం కేసి చూసింది.

నల్లగా, దృఢంగా వున్నాడా వ్యక్తి.... ముఖానికి నల్లనిగుడ్డ అడ్డం పెట్టుకున్నాడు.

"నీలాంటి అందాలభరిణను స్వంతం చేసుకోవడం కోసమే వచ్చాను. మీ ఆయన కేంప్ కెళ్ళాడని తెలిసి, వెంటిలేటర్‌లోంచి దూకి వచ్చాను. మర్యాదగా లొంగిపో. ఈ రహస్యం మనిద్దరి మధ్యనే సమాధి అయిపోతుంది.... పెనుగులాడావో నా చేతిలోని కత్తి నీ కుత్తుకని సొర కాయలా చెక్కేస్తుంది. నే నిప్పటివరకు దొంగనే.... హంతకుడ్ని కాదు. హంతకుడ్ని చేయకు అనవ సరంగా...." కటువుగా చెవిలో చెప్పి, చేతులతో ఎత్తి బెడ్రూంలో కి తీసుకుపోయాడు.

"ఈరోజు కోసం ఎన్ని రోజులుగా ఎదురు చూస్తు న్నానో తెల్సా....అర్ధరాత్రివరకూ లైట్లు వేసుకుని ఏం చేస్తున్నావు మేడమ్!" వెకిలిగా నవ్వి, పశువులా పైన బడ్డాడు....వాడి చేతులు ఆమె శరీరంపై ఎక్కడెక్కడో కదులుతున్నాయి.

ఆమె నిస్సహాయంగా ఏడుస్తోంది. నోట్లో కుక్కిన గుడ్డలు, వెనక్కి విరిచి కట్టిన చేతులు సహరించడం లేదు....ఈ విషయం వంటింట్లోని కృష్ణారావుకి తెలియ జెప్పడం ఎలా! ఎలా? దొంగ ముఖాన్ని ఆమె గుండెల కేసి రుద్దుతున్నాడు.

ఆమెకుకొద్దిగా అవకాశం చిక్కింది. మోకాలితో అతడి రెండు కాళ్ళ మధ్య విసురుగా తన్నింది. నిజానికది అంత

బలమైన దెబ్బ కాదు. అయినా బాధగా 'అబ్బా' అన్నాడు. అదే అతడు చేసిన పొరపాటు!

వంటింటిలో అప్పుడే భోజనం ముగించిన కృష్ణారావుకి ఆ మూలుగు అనుమానం కలిగించింది, ఏదో జరుగుతోందని సిక్స్త్‌సెన్స్ చెబుతోంది. పరుగులాంటి నడకతో బెడ్రూంలోకి వచ్చాడు. అక్కడ దృశ్యం చూడగానే అతడి మనసు కుతకుతలాడి పోయింది. అన్నపూర్ణలాంటి తులసి. వాడి చేతుల్లో అర్ధనగ్నంగా....కృష్ణారావ్ దవడ కండరం బిగుసుకుంది.

అదే సమయానికి దొంగ కూడా వెనుదిరిగి చూసాడు. ఇద్దరి చూపుల్లో ఏదో తెలియని కసి. ఒకరితో ఒకరు కలియబడ్డారు. మాన రక్షణ కోసం ఒకరు, ప్రాణ రక్షణ కోసం మరొకరు ఆవేశంతో పోరాడుతున్నారు.

కృష్ణారావు పిడికిలి బిగించి దొంగ నెత్తిపై మోదాడు ఒడుపుగా. అతడి కళ్ళు బైర్లుకమ్మి, చుక్కలు కనిపించసాగాయి. పట్టరాని ఆవేశంతో కృష్ణారావుని ఓ పోటు పొడిచి, వింటినుండి వెలువడ్డ శరంలా బయటకు దూసుకుపోయాడు.

గురి తప్పి భుజంలో అంగుళం లోతుకు దిగబడింది కత్తి. ఈలోగా తులసి కట్లు విదిలించుకుని లేచి నిల్చుంది.

"అన్నయ్యా...." ఆమె కనులు ఆర్ద్రమయ్యాయి. "ఈ రోజు నీవు నా మానం కాపాడావన్నయ్యా....ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోను...." ఆమె అతడి చేతులు పట్టుకుని బావురుమంది.

"లేదమ్మా నువ్వు చూపిన ప్రేమకు, అభిమానానికి బదులు తీర్చుకోమని దేవుడే కల్పించాడమ్మా ఈ అవకాశాన్ని...." అతడు బాధతో పళ్ళు బిగబట్టి అన్నాడు.

ఆమె ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తెచ్చి, అతడి గాయంపై కట్టు కట్టింది.

"ఇక వెళ్ళొస్తానమ్మా....ఈ అన్నయ్యను మర్చిపోవు గదూ?" అతడు లేచి నిల్చుంటూ అన్నాడు. అతడిగొంతు గాద్గదికమైంది.

"అదేంటన్నయ్యా....ఈ గాయంతో....ఈ రూపంతో ఎక్కడికని వెళతావు? ఇక్కడే వుండిపో.... ఆయన వచ్చాక ఏదయినా వుద్యోగం...." ఆమె మాటలు పూర్తి కాకముందే అతడందుకున్నాడు.

"వద్దమ్మా....వద్దు. ఈ రాత్రి సంఘటన ఇలాగే సమసిపోనీ. మనలోనే మిగిలిపోనీ....అగ్ని పునీతలాంటి నీపై నా నీడ కూడా పడకూడదు...." అతడు వడి వడిగా నడచుకుంటూ చీకటిలో కలిసిపోయాడు. తులసి చాలాసేపు అతడు వెళ్ళిన వయిపే కృతజ్ఞత నిండిన కళ్ళతో చూస్తూండిపోయింది. □

నిషా ా మండుం!



కిడ్నాపర్ అంకుల్

జొన్నలగడ్డ రామలక్ష్మి

భీమారావు ఎమ్మే ప్యాసయ్యాడు. నిరుద్యోగి. కట్నానికాశపడి తలిదండ్రులు పెళ్ళికూడా చేశారు. భార్య నతడికి వదలి కట్నం డబ్బులు తలిదండ్రులు తీసుకున్నారు.

ఏ ఉద్యోగమూ లేకుండా భీమారావు భార్యతో ఏడాది కాపురం చేశాడు. ఓ కూతురు పుట్టింది.

అలాగే యింకో ఏడాది కాపురం చేస్తే ఓ కొడుకు పుట్టాడు.

సుఖ సంసారానికి ఆపరేషన్ చేయించుకోవాలను కున్నా డతడు. కానీ ఏ గవర్న మెంటుద్యోగమో వస్తే— అప్పుడాపరేషన్ చేయించుకున్నవారికి జీతంలో ఇంక్రి మెంటు వస్తుంది. ముందుగా ఆపరేషన్ చేయించుకొనడం వల్ల ఆ అవకాశం పోతుందని కొందరు స్నేహితులు వారించారు.

భీమారావింకా తలిదండ్రులమీదే ఆధారపడ్డాడు. పెళ్ళికి ముందు ఒక్కడు—ఇప్పుడు నలుగురయ్యారు. అందువల్ల యింట్లో అతడంటే చిన్నచూపు. తలిదండ్రులు కాబట్టి అతడది భరించాడు. భార్య భరించనంది. ఆమె అత్తమామ లకు అణగిమణగి ఉండడానికి బదులు—తనే యింటి యజమానురాలిలా ప్రవర్తించి భంగపడేది. ఆ కోపాన్ని భర్తపై చూపి సంపాదనలేని మగడని అతణ్ణి చిన్న బుచ్చేది.

భీమారావు కేం చేయాలో తెలియడంలేదు. ఉద్యోగం గురించి అతడు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వ్యాపారం చేసే చొరవలేదు.

అతడికి బ్రతుకంటే విరక్తి పుట్టింది.

అందరూ అతణ్ణి చిన్నచూపు చూసేవారే!

అందుకే అతడు తెగించి యిల్లు వదిలిపెట్టి పెదపట్నం చేరుకున్నాడు.

పెదపట్నం జనాభా పదిలక్షలు.

భీమారావు కక్కడో స్నేహితుడున్నాడు. అతడి పేరు గోపీనాధ్.

గోపీనాధ్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు.

అతడికో పెద్ద యిల్లుంది. ఆ యింట్లో అతడుండేది చాలా తక్కువ. ఎప్పుడూ టూర్లమీద ఊర్లు తిరుగుతుంటా డతడు.

అతడికింకా పెళ్ళికాలేదు.

"ఆ అవసరం కనిపించలేదు-" అన్నా డతడు స్నేహితుడితో.

భీమారావు తనింట్లో ఉండవచ్చునని గోపీనాధ్ చెప్పాడు.

"నీ కంపెనీలో నాకూ ఓ ఉద్యోగం దొరుకుతుందేమో చూడు--" అన్నాడు భీమారావు.

"ఇలాంటుద్యోగం నీ వల్లకాదు. దీనికి చొరవకావాలి. లక్షల్లో వ్యాపారం చూపించాలి...." అన్నాడు గోపీనాధ్.

"నా వల్ల ఏమీకాదా?"

"నువ్వొప్పుకుంటే ఒక ఉపాయముంది-" అన్నాడు గోపీనాధ్.

"ఏమిటది?"

"కిడ్నాపింగ్!" అన్నాడు గోపీనాధ్.

"అంటే—నేరమా?" అన్నాడు భీమారావు భయంగా.

"లోతుగా ఆలోచిస్తే అన్నీ నేరాలే—ఏమీ నేరాలూ కావు!"

"ఎలా?"

"మన సమాజంలో అందరికీ సరిపడ డబ్బుంది. అందరికీ డబ్బులేదు. అంటే కొంతమంది కెక్కువయింది. కొందరికి లేకపోయింది. డబ్బున్నవాళ్ళందరూ ఫల వృక్షల్లాంటి వాళ్ళు. తమచుట్టూ కంచెలు కట్టుకుని తోటలో వృక్షల్లా ఉంటారు వాళ్ళు....వాళ్ళని మనం రోడ్డుపక్క చెట్లనుకోవాలి. ఆలోచిస్తే అది నేరం. నేరం కాదు

కూడా!"

భీమారావు మాట్లాడలేదు.

"నీ సంపాదన నెలకు పదివే లుంటుంది. అందులో నా కో మూడువేలు వాటా యివ్వు. వచ్చినడబ్బు జల్సాచేసి తగలేసుకోకుండా కూడబెట్టు, ఓ లక్ష రూపాయలు పోగయ్యాక వేరే భవిష్యత్తు చూసుకో...." అన్నాడు గోపీనాధ్.

"ఈలోగా జైలు పాలైతే!"

"జైలు భయం లేకపోతే నువ్విందు కొప్పుకుంటావా?" అన్నాడు గోపీనాధ్.

భీమారావు ఆలోచనలో పడ్డాడు.

"నువ్వు తప్పు చేయడానికి జంకడంలేదు. పట్టుబడ తానని జంకుతున్నావు—" అన్నాడు గోపీనాధ్.

ఒప్పుకుందుకు భీమారావు మొహమాటపడ్డాడు.

"నేను నీకు హామీ ఉంటాను. కిడ్నాపింగ్ చేస్తావా?"

ఒక్క నిముషం తటపటాయించి—"నీ నెలజీతం ఎంత?" అన్నాడు భీమారావు.

"మూడువేలు—ఎందుకు నువ్వీప్రశ్న వేశావు?"

"కిడ్నాపింగ్‌తో నెలకు పదివేలు సంపాదించ గలిగి నపుడు నువ్వెందుకీ ఉద్యోగం చేస్తున్నావు?" అనుమా నంగా అడిగాడు భీమారావు.

"ఎందుకంటే—నే నీ ఉద్యోగంలో రాణిస్తున్నాను. ఇంకా పైకిపోతాను. కిడ్నాపింగ్ తాత్కాలికం. అదే జీవ నాధారం చేసుకోను కాబట్టి మంచి నమ్మకస్థుడైన పార్ట్నర్ కోసం చూస్తున్నాను...." అన్నాడు గోపీనాధ్.

"నే నీ ఊరు వస్తాననగానే రమ్మన్నదందుకేనా?" అన్నాడు భీమారావు.

"అవును—అందుకే!"

"నీ మాట నమ్ముతాను. ఒప్పుకుంటాను. కానీ నువ్వెలా నన్ను నమ్ముతున్నావు? నాకు కిడ్నాపింగ్ చేసేటంత చొరవ ఉందా?"

"కిడ్నాపింగ్‌కు చొరవ అక్కర్లేదు...." అన్నాడు గోపీనాథ్.

"అదెలా సాధ్యం?"

"ఆధునిక యాంత్రిక జీవితంలో అన్నీ సాధ్యాలే అవుతాయి...."

"ఎలాగో చెప్పు...."

"పథకం నాది. అన్నీ వివరంగా చెబుతాను. అలాగే అమలు చేయి...." అన్నాడు గోపీనాథ్.

"నాకు భయంగా ఉంది—"అన్నాడు భీమారావు.

"భయపడేవాడిని లోకం భయపెడుతుంది. తెగించిన వాడికి లోకం భయపడుతుంది—" అన్నాడు గోపీనాథ్.

"సరే—నీ పథకం చెప్పు—" అన్నాడు భీమారావు.

గోపీనాథ్ చెప్పడం ప్రారంభించాడు.

2

అప్పుడే కాన్వెంట్ వదిలిపెట్టారు.

తెల్లటి జుబ్బాపై నీలిరంగు స్లీవ్‌లెస్ ఫ్రాక్ వేసుకుని లలిత గేట్లోంచీ బయటకు వచ్చింది.

గుంపులు గుంపులుగా చిన్నపిల్లలు బయటకు వస్తున్నారు.

లలిత మాత్రం ఒంటరిగా బయటకు వచ్చి రోడ్డుకు పక్కగా ఉన్న దీపస్థంభం దగ్గర ఆగింది,

చక్రాల్లాంటి కళ్ళు. అమాయకమైన ముఖం.

ఆమె ఏదో ఆలోచిస్తూంది.

ఆలోచనలతో మరింత ముద్దుగా ఉంది లలిత.

లలితకు పదేళ్ళుంటాయి.

దూరంగా భీమారావు తననే గమనిస్తున్నట్లాపెకు తెలియదు.

భీమారావామెను — మందలోంచి విడివడిన లేడిని వేటాడబోయే పులిలా చూస్తున్నాడు. కానీ అతడి చూపుల్లో క్రూరత్వంలేదు.

అతడి చూపుల్లో ఉన్నవి ఆశ, భయం.

ఆ పాపను తను కిడ్నాప్‌చేయాలి.

అది సాధ్యపడుతుందా?

గోపీనాథ్ పథకం చెప్పాడు. కానీ తనకు భయంగా వుంది.

తటపటాయిస్తూనే అతడామెను సమీపించి—"ఒక్కత్తివీ నుంచున్నావేం—పాపా!" అన్నాడు.

లలిత అతడివంక తలెత్తి చూసింది—"నాపేరు పాప కాదు. లలిత!" అంది. అమాయకమైన ఆమె ముఖంలో కళ్ళు చక్రాల్లా తిరిగాయి.

పాపనెత్తుకుని నుదుటిమీద ముద్దుపెట్టుకోవాలనిపించింది భీమారావుకి. అతడా కోరికను బలవంతంమీద నిగ్రహించుకున్నాడు.

"నీపేరు లలితా! కానీ యింట్లో నిన్నందరూ లల్లీ అని పిలుస్తారేమో" అన్నాడు.

లలిత తల అడ్డంగా ఊపి — "మా యింట్లో ఎవరికీ అలాంటి సరదాలు లేవు. ఏయ్, ఏమే. ఒసే అంటారు. ఇంటికెవరైనా బంధువులొచ్చినా వాళ్ళెదురుగా మాత్రం లలితా అంటారు" అంది.

"పోనీ—నేను నిన్ను లల్లీ అని పిలవనా?"

లలిత కళ్ళు మెరిశాయి—"ఊఁ" అంది.

"లల్లీ—ఇక్కడ నిలబడ్డావేం?"

"కారుకోసం" అంది లలిత.

"మీక్కారుందా? అదృష్టవంతురాలివి లల్లీ!" అన్నాడు భీమారావు.

"ఏమదృష్టమో—ఎప్పుడూ టైముకి రాదు. బస్సులో అయితే ఈపాటికి సగం దూరం వెళ్ళిపోయుండేదాన్ని" అంది లలిత.

"పోనీ—బస్సెక్కొచ్చుగా."

"బస్సెక్కితే నాన్న ప్రిస్టేజి దెబ్బతింటుందిట...."

"మరి కారు టైముకి రాదేం?"

"అమ్మ డ్రైవరుతో పెద్ద లిస్టిచ్చి పనులు పురమాయిస్తుంది. వాడవన్నీ పనిలో పనిగా చేసుకుని వస్తాడు. ఇలా నిలబడ్డం నాకెంత విసుగో వాళ్ళెవరికీ అర్థంకాదు."

"ఇంటికెళ్ళాలని అంత తొందరేం? అమ్మను చూడకుండా వుండలేవా?" అన్నాడు భీమారావు.

"అమ్మను చూడ్డం అప్పుడే ఎక్కడ? సాయంత్రం అయిదున్నరకి వస్తుంది" అంది లలిత.

భీమారావు వాచీ చూసుకున్నాడు. టైము మూడుంపావయింది.

"మరైతే ఇంటికెళ్ళి ఏం చేస్తావు?"

"ఇక్కడ నుంచుని మాత్రం ఏం చేస్తాను?" అంది లలిత.

భీమారావు నవ్వి "అయితే మా యింటికి రాకూడదూ! సరదాగా ఆడుకోవచ్చు" అన్నాడు.

లలిత కళ్ళు మెరిశాయి—"మీ యిల్లెక్కడ?" అంది.

"నేను తీసుకుని వెడతాగా—అయిమున్నరకల్లా మళ్ళీ మీ యింటిదగ్గర దిగబెట్టేస్తా" అన్నాడు భీమారావు.

లలిత ఒప్పుకుంది.

అప్పటికీ యింకా కారు రాలేదు.

భీమారావో ఆటోని పిలిచాడు.

లలిత, అతడు ఆటోలో ఎక్కారు. తర్వాత గోపీనాథ్ చెప్పిన పథకాన్ని దృష్టిలో ఉంచుకుని అతడు ఆటోని సందుగొందులమ్మట తిప్పి చివరకు తన యింటి వెనుక ఆపుచేయించాడు. ఆటోకి డబ్బుఇచ్చి దొడ్డిదారిన యింట్లో ప్రవేశించాడు.

"మనం యింటి ముందు నుంచి వెళ్ళడంలేదు...." అంది లలిత.

"ఈ యిల్లు నాది కాదు. నా స్నేహితుడిది....అతడేమో వీధిగుమ్మంలోంచి వస్తాడు. నేనేమో దొడ్డిగుమ్మంలోంచి వస్తాను" అన్నాడు భీమారావు. లలిత తలూపింది అర్థమైనట్లు.

ఇద్దరూ ఓ గదిలో లోపల ప్రవేశించారు.

గదినిండా రకరకాల బొమ్మలున్నాయి.

"చూశావా - ఎన్ని రకాల బొమ్మలో—" అన్నాడు భీమారావు.

లలిత ముఖం చిట్లించింది - "బొమ్మలు నాకు బోలెడున్నాయి. అవంటే నాకు చిరాకు" అంది.

"బొమ్మలంటే చిరాకుపడే పిల్ల లుంటారా - ఎక్కడయినా?"

"ఏమో - నాకు తెలియదు. బొమ్మలు పెద్దాళ్ళు పిల్లల్ని వదుల్చుకుందుకు కొంటారు. అవి నా ముందు పడేసి ఆడుకొమ్మంటారు. బొమ్మలు నన్ను ఒంటరిదాన్ని

చేస్తాయి. నేను వాటితో ఆడుకోను" అంది లలిత.

"మరేం చేస్తావు?" అనడిగాడు భీమారావు.

"ఈ యింటిలో క్యారమ్సు బోర్డులేదా?" అంది లలిత.

"ఉంది."

"అయితే అది తీసుకునిరా—"

"ఎందుకు?"

"మనమిద్దరం క్యారమ్సు ఆడుకుందాం."

భీమారావు పక్కగదిలోంచీ క్యారమ్సుబోర్డు తెచ్చాడు.

"నీకు బాగా ఆటవచ్చా?"

"ఓ—" అంది లలిత.

ఇద్దరూ క్యారమ్సు ఆడారు. లలిత తుక్కుగా ఓడిపోయింది.

"నీకు బొత్తిగా ఆటరాదు" అన్నాడు భీమారావు.

"నాకు బాగానే వచ్చు. ఎప్పుడూ చిన్నపిల్లలతోనే ఆడుతూంటాను గదా—ఇంప్రూవవడం లేదు. పెద్దాళ్ళతో ఆడందే ఆట ఇంప్రూవు కాదుగా" అంది లలిత ఆరిందాలా.

"మరో ఆట ఆడదామా?" అన్నాడు భీమారావు.

"ఆటవద్దు. నీకు కథలు వచ్చా?" అంది లలిత.

"రాకేం—చాలా వచ్చు."

"ఓ కథ చెప్పవూ?"

"కథల పుస్తకాలున్నాయి—ఇవ్వనా?"

"వద్దు. కథలు వింటే ఎంతో బాగుంటాయి. క్లాసులో బోలెడు పాఠాలు చదవాలి. ఇంటిదగ్గిర బోలెడు హోంవర్కు చేయాలి. కథలుకూడా చదువుకోవాలంటే బోరు కదూ!" అంది లలిత.

"ఇంటిదగ్గిర నీ కెవరు కథలు చెబుతారు?"

"ఎవరూ చెప్పరు....అందుకే ఇంటిదగ్గిరకూడా బోరే

నాకు...." అంది లలిత అదోలా.

భీమారావు లలితకు ఓపికగా కథ చెప్పాడు.

ఆమె కతడు కథ చెప్పిన తీరు నచ్చింది.

"ఇంకో కథ చెప్పవూ?" అంది లలిత.

భీమారావామెకు మరో కథ చెప్పాడు.

"నువ్వు కథలు బాగా చెబుతావు" అంది లలిత.

"నేను నీకు నచ్చానా?" అన్నాడు భీమారావు.

"చాలా—"

"అయితే ఈరోజుకిక్కడుండిపోతావా?"

లలిత ఓ క్షణం ఆలోచించి—"ఇంట్లో చెప్పాలి" - అంది.

"ఇంట్లో నేను చెబుతాన్లే—"

"అప్పుడిక్కడెవ్వరుంటారు?"

"ఇక్కడెవ్వరో ఎందుకు —నువ్వు నిద్రపోతావుగా."

"నేను నిద్రపోను. నిద్రపోయినా ఒంటరిగా నాకు భయం" అంది లలిత భయంగా.

భీమారావేమీ మాట్లాడలేదు. అతడామెను కబుర్లలో పెట్టి నిద్రమాత్ర కలిపిన మంచినీళ్ళిచ్చాడు. లలిత అవి తాగి నిద్రపోయింది.

తర్వాత అతడు బయటకు వెళ్ళాడు. ఓ నంబరుకు ఫోన్ చేశాడు.

లలిత తండ్రి ఫోన్ ఎత్తాడు.

"మీ అమ్మాయి లలిత నా దగ్గిర భద్రంగా వుంది. అయిదు వేలు నాకిస్తే ఆమె మీకు క్షేమంగా అప్పజెప్పబడుతుంది" అన్నాడు భీమారావు ఫోన్ తీసింది లలిత తండ్రేనని ధృవపర్చుకున్నాక.

లలిత తండ్రి కంగారుపడ్డాడు. ఎవరునువ్వన్నాడు.

ఎక్కణ్నించి మాటాడుతున్నావన్నాడు.

"పబ్లిక్ టెలిఫోన్ బూత్ నించి....డబ్బెప్పు డివ్వగలి గిందీ చెప్పు...." అన్నాడు భీమారావు శాంతంగా.

కానీ అతడికాళ్ళు, చేతులు, శరీరం వణుకుతున్నాయి.

"డబ్బు నీకెలా అందజేయాలి!" అన్నాడు లలిత తండ్రి.

"సంగీతా పార్కులో మందార చెట్టు మొదట్లో కవరు పెట్టాలి. కవర్లో అయిదువేలూ ఉండాలి. ఈ విషయం పోలీసులకు తెలియకూడదు."

లలిత తండ్రి మాటాడలేదు.

"పోలీసులకు చెబితే మీ పాప మీకు దక్కదు—" అన్నాడు భీమారావు.

"హలో! నే నిప్పుడాఫీసులో వున్నాను. డబ్బు వెంటనే సర్దుబాటు కాదు. రేపుదయం బ్యాంకులు తీశాక డబ్బుతీసి నువ్వు చెప్పినట్లు చేస్తాను" అన్నాడు లలిత తండ్రి.

"సరే—అయితే రేపుదయం పదకొండు గంటలకు నేను చెప్పినచోట కవర్‌లో డబ్బుపెట్టి ఉంచు. సరిగ్గా పదకొండు గంటలకు....ఒకనిముషం ముందుకాదు....ఒక నిముషం వెనుకా కాదు....కవరక్కడ పెట్టేసి వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళిపోవాలి. ఒంటిగంటకల్లా నీ కూతురు ఇంటికి చేరుకుంటుంది...." అన్నాడు భీమా రావు.

"ఈలోగా నా కూతుర్ని కష్టపెట్టకు...." అన్నాడు లలిత తండ్రి ఆవేదనతో.

"పాపను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను" అన్నాడు భీమారావు.

అతడు ఫోన్ పెట్టేసి యిల్లు చేరుకున్నాడు.

అప్పటికింకా లలిత నిద్రలేవలేదు.

అతడామెను డిస్టర్బ్ చేయలేదు. ఆమెకోసం రకరకాల తినుబండారాలు కొనితెచ్చాడు.

సాయంత్రం ఆరున్నరకు లలిత నిద్రలేచింది. పరిస రాలు గమనించి గతం గుర్తుచేసుకుంది.

"నువ్వీరోజు కిక్కడే వుండిపోతావు. మీ యింటిలో ఒప్పుకున్నారు" అన్నాడు భీమారావు.

లలిత దిగులుగా—"నేను వెళ్ళిపోతాను" అంది.

"నీకు కథలు చెబుతాను. కబుర్లు చెబుతాను. మంచి మంచి ఆటలాడుకుందాం. ఇంకా...." అని ఆగేడతడు.

"ఇంకా...." అంది లలిత కుతూహలంగా.

"రాత్రికి వంట మనిద్దరం కలిసి చేద్దాం—"

"నిజంగా...." అంది లలిత ఉత్సాహంగా.

"ఊఁ"

"కానీ నాకు వంటరాదు—" అంది లలిత నిరుత్సా హంగా.

"నేను నేర్పుతానుగా...."

ఇద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకున్నారు. భీమారావు పాపతో చాలా ఆటలాడాడు. అన్నమాటప్రకారం రాత్రి వంటలో పాపనతడూ సాయం చేయనిచ్చాడు.

పాప బియ్యమేరింది. బియ్యం కడిగింది.

తరిగిన ముక్కల్ని తనే నూనెలో వేసింది.

చారులో చింతపండు, ఉప్పు వేసింది.

ఆమెకు చాలా ఉత్సాహంగా వుంది.

రాత్రి భోజనాలయ్యాక భీమారావు, లలిత ఒకే మంచం మీద పడుకున్నారు. ఆమె అతణ్ణి కరిచిపెట్టుకుని పడు

కుంది. భీమారావామెకు మరో రెండు కథలు చెప్పి నిద్ర పుచ్చాడు.

లలిత అతడికి ఆత్మీయురాలిగా తోచింది.

మర్నాడు లలిత లేచేసరికి అతడు హోటల్నుంచి పని మనిషిద్వారా టిఫిను, పాలు తెప్పించాడు.

లలిత స్కూలుగురించి గాబరాపడింది.

"ఈరోజుకు స్కూలువద్దు" అన్నాడు భీమారావు.

"ఏం?" అంది లలిత.

"నేను కిడ్నాపర్ని. నిన్ను వదిలిపెడితే డబ్బురాదు" అంటూ భీమారావామెకు తన కథ చెప్పాడు.

"నువ్వు దొంగాడివా?" అంది లలిత భయంగా.

"దొంగణ్ణి కాదు. కిడ్నాపర్ని."

"మా నాన్న డబ్బివ్వకపోతే!" అంది లలిత మరింత భయంగా.

"ఇస్తాడు...."

"ఇవ్వకపోతే...." లలిత గొంతులో ఏడుపు ధ్వనించింది.

"ఇస్తాడని చెప్పానుగా...."

"ఇవ్వకపోతే నన్ను చంపేస్తావా?"

భీమారావామెను దగ్గరగా తీసుకుని — "నా బంగారు పాపవి నువ్వు. నీ వంటిమీద ఈగనుకూడా వాలనివ్వను. మీ నాన్నను బెదిరించడానికి నిన్నిక్కడకు తెచ్చాను. అంతే! మీ నాన్న డబ్బివ్వకపోయినా నిన్ను వదిలిపెట్టేస్తాను...."

"నువ్వు మంచివాడివనుకున్నాను. దొంగాడి వెందుకయ్యావు?" అంది లలిత బాధగా.

"దొంగణ్ని కాదు. కిడ్నాపర్ని...."

"కిడ్నాపర్లూ మంచివాళ్ళు కారు" అంది లలిత.

"నాకు డబ్బుకావాలి. అందుకింకో మార్గం దొరక లేదు" అంటూ భీమారావు కిడ్నాపింగ్‌లో తప్పులేదని లలితకు నచ్చజెప్పాడు.

"నిజమే—మా నాన్నదగ్గర, అమ్మదగ్గర చాలా డబ్బు వుంది. కానీ—వాళ్ళు నీకు డబ్బివ్వరు....పోలీసులకు నిన్ను పట్టించేస్తారు" అంది లలిత.

"అలా జరిగితే—నీకు ప్రమాదమని భయపెట్టానుగా"

"ఆఁ నాకు ప్రమాదమంటే వాళ్ళు భయపడరు. నీకు డబ్బులు రావు. అయినా నువ్వు నన్నేమీ చేయవు కదూ!"

అమాయకమైన ముఖంలో గుండ్రంగా తిరిగే చక్రాల్లాంటి కళ్ళు.

భీమారావు చటుక్కున లలిత నుదుటిపై ముద్దుపెట్టు కున్నాడు.

అయితే పదిగంటల ప్రాంతాల అతడామెను తిరిగి నిద్రమాత్రతో నిద్రపుచ్చేశాడు.

పదకొండు గంటల ప్రాంతాల సంగీతాపార్కు దగ్గర మాటు వేశాడు.

లలిత తండ్రి కవరు పార్కులో పెట్టివెళ్ళి కాసేపటికి తా నది తీసుకున్నాడు.

కవరులో యాభయి వందరూపాయల నోట్లున్నాయి.

భీమారావు కాళ్ళు చేతులు వణికాయి.

త్వరగా అక్కణ్ణించి యిల్లు చేరాడు.

అతడు మామూలు మనిషి కావడానికో గంట పట్టింది. వడి వడిగా పాపను లేపాడు.

లలితకు మెలకువ రాగానే "నాన్న నీకు డబ్బిచ్చాడా?" అనడిగింది.

"ఊఁ"

"అయితే నన్ను వదిలిపెట్టేస్తావా?"

"ఊఁ"

లలిత సంతోషం యింతా అంతా కాదు....

భీమారావామెను తీసుకుని ఇంటిలోంచి బయటకు వచ్చి సందులూ గొందులూ తిప్పి ఓ ఆటో ఎక్కాడు. ఆటోలో ఆమె యింటి సందు దగ్గిర దింపి_"ఇంటి దగ్గర మీ అమ్మా, నాన్నా నీ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తూంటారు. పరుగున వెళ్ళు" అన్నాడు.

చేతిలో పుస్తకాల బ్యాగు బరువును కూడా మరిచి పరుగున దూసుకుపోయింది లలిత.

భీమారావు వెంటనే ఆటోలో యింటికి తిరిగి వెళ్ళాడు.

జరిగింది కలో నిజమో అతడికి తెలియడం లేదు.

అతడి దగ్గిర అయిదు వేలున్నాయి.

అతడి శరీరం ఆగకుండా వణుకుతోంది.

3

ఆ తర్వాత భీమారావు చాలా కిడ్నాపింగ్స్ చేశాడు.

మళ్ళీ అతడి శరీరం వణకలేదు.

ఒక సంవత్సరంలో అతడి వాటాకు మిగిలిన డబ్బు లక్షా యాభయివేల రూపాయలు.

గోపీనాథ్ అతడితో_"ఈ డబ్బుతో నీవు తృప్తి పడాలి. ఇంక నీ ఊరు వెళ్ళిపో" అన్నాడు.

"కొత్త జీవితం రుచి చూపించావు. ఇది నాకు బాగుంది" అన్నాడు భీమారావు.

"ఇది ప్రమాదకరమైన పని. వచ్చింది చాలనుకుని తృప్తి చెందకపోతే_ఏవొక రోజున కటకటాలు లెక్కపెట్టవలసి వస్తుంది" అన్నాడు గోపీనాథ్.

"నేను కటకటాలు లెక్కపెడితే ఆ తప్పు, పాపం నీది. నువ్వే నన్నిందుకు ప్రోత్సహించావు" అన్నాడు భీమారావు.

"ఒప్పుకుంటాను. కానీ ఎల్లకాలమూ ఈ విషయంలో నీవే ప్రయోజనం పొందాలనుకోవడం అన్యాయం. నీకులా దారిలేని నిరుద్యోగులు మరెందరో ఉన్నారు. వారికి సాయ పడనీ...." అన్నాడు గోపీనాథ్.

"అంటే నువ్వు కొత్త పార్టీని పట్టేవా?"

"అవును...."

"నేనేం తప్పు చేశాను?"

"నువ్వేమీ తప్పు చేయలేదు. నిన్నిక తప్పు చేయ నివ్వను...."

"నీకు కమీష నెక్కువ కావాలా?"

"భీమారావ్ - కమీషన్ గురించి నే నీ పని చేయ లేదు. కొన్నాళ్ళపాటు నీకు ఉపాధి కల్పించాను ఇప్పుడు నీ కాళ్ళమీద నువ్వు నిలబడగలగాలి. అలా నిలబడక పోతే నేను నీకు సహకరించను" అన్నాడు గోపీనాథ్.

భీమారావు నవ్వి - "బహుశా నా కిప్పుడు నీ సహ కారం అవసరం లేదనుకుంటాను. నేను స్వయంగా కిడ్నాపింగ్ చేయగలను" అన్నాడు.

"ఆ ధైర్యమే నీ పతనానికి హేతువవుతుంది" అన్నాడు గోపీనాథ్.

"చూద్దాం" అన్నాడు భీమారావు.

"చూసే ముందు నేను చెప్పే కథ విను...."అన్నాడు గోపీనాథ్.

"ఏమిటది?"

"నా పథకం నాకు తప్ప వేరెవ్వరికీ పనిచేయదు...."

భీమారావు మాట్లాడకుండా కుతూహలంగా చూసాడు స్నేహితుడి వంక. గోపీనాథ్ చెప్పుకుపోసాగాడు.

"నా పథకం ఎంతో సులభంగా కనబడుతోంది నీకు. పిల్ల వివరాలు, పిల్ల తలిదండ్రుల అడ్రసులు నేను నీకు వివరంగా చెబుతున్నాను. ఆ పిల్లను నువ్వు నీ తెలివితో యింటిదాకా తీసుకుని వస్తున్నావు. ఆపిల్ల నాకట్టుకుంటు న్నావు. వాళ్ళు నిన్నభిమానించేలా చేసుకుంటున్నావు. ఆ తర్వాత ఆ పిల్ల తలిదండ్రులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నావు. వాళ్ళు నీవు కోరిన డబ్బిస్తున్నారు. పోలీసులను రంగం లోకి దిగనివ్వడం లేదు. ఇదంతా ఏర్పాటు చేసుకోవడం నీవల్ల అవుతుందా? ఆలోచించి చూడు. పార్కులో డబ్బున్న కవరు తీస్తూండగా పోలీసులు నిన్ను పట్టుకుంటే ఏం చేస్తావు? ఏమయిపోతావు? ఆలోచించావా?"

"పిల్లలపయి ప్రేమాభిమానాలున్న ఏ తలిదండ్రులూ అలా చేయరు - చేయలేరు...." అన్నాడు భీమారావు.

"అందరూ ఒక్కలాగుండరు. కొందరిలో తెగింపు ఉంటుంది. అంతమాత్రాన వారికి ప్రేమాభిమానాలు లేవన లేము...."

"తలిదండ్రులు పిల్లల విషయంలో తెగింపు చూపలేరు. అందుకు నా అనుభవమే సాక్ష్యం" అన్నాడు భీమారావు.

"నీ అనుభవానికి కారణం వేరు."

"ఏమిటది?"

"ఇది ఆధునిక యుగం. ఈ యుగాన్ని అన్నింటికీ మించి నడిపిస్తున్నది డబ్బు. డబ్బులోనే సకల సౌఖ్యాలు ఉన్నాయనుకునే కొందరది సంపాదించడం కోసం అహ

ర్నిశలూ శ్రమిస్తుంటారు. బాగా డబ్బున్న మరికొందరు డబ్బును నిలబెట్టుకొనేందుకు పరిచయాలు పెంచుకుంటారు. ఆ పరిచయాల కోసం అహర్నిశలూ బైట తిరుగుతూంటారు.

ఈ విధంగా ప్రతీ యింటా దంపతులు డబ్బు సంపాదించాలనో, డబ్బును నిలబెట్టుకోవాలనో యింటికి దూరంగా ఉండటం జరుగుతుంది. వారు కూడా తమ సంతానాన్నభిమానిస్తారు. కానీ ఆ అభిమానం డబ్బు రూపంలోనే తప్ప చేతల్లో చూపించలేరు. వారి పిల్లలు తలిదండ్రులకు తమపైన ప్రేమ లేదనుకునుకుంటారు. అలాంటి జంట ఒకటి నాకు తెలుసు. వారికి నేనే ఈ కిడ్నాపింగ్ సలహా యిచ్చాను.

కిడ్నాపింగ్ పేరు చెప్పి తలిదండ్రులెంతగానో కలవరపడ్డారనీ - కిడ్నాపర్‌కెంత డబ్బయినా యిచ్చి విడిపించుకున్నారనీ తెలిసి ఆ పిల్లలు పొందే ఆనందం వర్ణనాతీతం. తల్లిదండ్రులకు తమకంటే డబ్బెక్కువ కాదనీ - డబ్బును తమ కోసం వదులుకుందుకు సిద్ధమనీ పిల్లలు గుర్తించి వారిని అపార్థం చేసుకొనటం తగ్గిస్తారు. తమ పిల్లలపై ప్రేమను నిరూపించుకొనడానిక్కూడా తలిదండ్రులు సమయాన్ని వినియోగించలేక - ఇలా డబ్బును వినియోగిస్తున్నారు. నా ఉపాయం ఆ జంట కుపయోగపడింది. అది వారు మరో జంటకు సూచించారు. ఇలా ఎందరో నాకు పరిచితులయ్యారు. ఈ ఆధునికయుగంలో పిల్లలపై ప్రేమను చూపించుకునేందు కిదో కొత్త పద్ధతి."

భీమారావు తెల్లబోయి - "అంటే ఇదంతా అరేంజ్‌డ్ కిడ్నాపింగా? ఇదంతా ముందే నాకెందుకు చెప్పలేదు?" అన్నాడు.

"నువ్వు కిడ్నాపింగ్ చేస్తున్నావన్న భావం నీలో ఉన్నప్పుడే - కిడ్నాప్ చేయబడ్డ పిల్ల కూడా నీ మాటలు, చేష్టలు నమ్ముతుంది. ఒంటరితనం కారణంగా ఆ పిల్లల ఆలోచనాశక్తి మరింత ఎక్కువగా ఉంటుంది" అన్నాడు గోపీనాధ్.

"అయితే యిప్పుడు మాత్రం నాకీ విషయ మెందుకు చెప్పావ్?" అన్నాడు భీమారావింకా ఆశ్చర్యం నుండి తేరుకుంటూ.

"ఎందుకంటే నువ్వు నిజంగా కిడ్నాపింగ్‌లో ఆరి తేరినవాడివనుకుని కొత్తగా మళ్ళీ వేరే కిడ్నాపింగ్స్ మొదలుపెట్టి భంగపెడతావేమోనని భయపడ్డాను."

"థాంక్యూ గోపీనాధ్! ఇంకెప్పుడూ కిడ్నాపింగ్స్ చేయను....ఇంతవరకూ జరిగినదానికే నాకు రవంత బాధగా ఉంది డబ్బు కోసం మనిషెంతయినా దిగజారి పోగలడని నేను ఋజువు చేసాను...."

"నువ్వలా బాధ పడకు. నీవల్ల కిడ్నాపయిన పిల్లలందరూ నిన్నెంతగానో అభిమానిస్తున్నారు నీతో ఆ ఒక్కరోజు అనుభవాన్ని పదే పదే తల్చుకుంటున్నారు. ఆవిధంగా నీవు తీసుకున్న డబ్బుకి కొంత ప్రతిఫలం యిచ్చినట్లే లెక్క...." అన్నాడు గోపీనాధ్.

"థాంక్యూ - ఇది నువ్వు నాలో గిల్టీకాన్షస్‌ని తొలగించే ప్రయత్నమని నాకు అర్థమవుతోంది" అన్నాడు భీమారావు.

గోపీనాథ్ బదులు చెప్పలేదు....

మర్నాడు భీమారావు రైల్వేప్లాట్‌ఫారం మీదుండగా ఒక్కసారిగా పది పన్నెండేళ్ళ పిల్లలు బోలెడుమంది వచ్చారు.

వారందరూ అతణ్ణి చుట్టుముట్టారు.

"నువ్వు ఊరెళ్ళిపోతున్నట్టు వీళ్ళకు నా ద్వారా సమాచార మందింది" అన్నాడు గోపీనాధ్ భీమారావుతో.

"నే నెవరో మీకు తెలుసా?" అన్నాడు భీమారావు బాధగా. అంతమంది పిల్లల మధ్య నేరస్థుడిలా నిలబడటం అతడికి బాధగా వుంది.

"తెలుసు - కిడ్నాపర్ అంకుల్!" అంది లలిత. ఆ వెంటనే ఎన్నో గొంతులు-"కిడ్నాపర్ అంకుల్" అంటూ కలిశాయి.

"కిడ్నాపర్ అంకుల్!" అన్న మాట భీమారావు మనసులోని బాధను మటుమాయం చేసింది.

ఆ తర్వాత ట్రయినెక్కినా, వారందరూ వీడ్కోలిచ్చినా. ట్రయిన్ కదిలి దూరం వెళ్ళిపోయినా "కిడ్నాపర్ అంకుల్!" అన్న మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వున్నాయతడికి. □

తెహాకం-?



ధన్వంతరి వారసుడు

— కె.బి.యస్.కుమార్ —

"డా॥ ఎ. సి. వజ్రమ్మ. యం. బి. బి. యస్"

బోర్డుచూసి తృప్తిగా తల పంకించి లోపలికి అడుగు వేశాను.

పేషంట్లు నలుగురో అయిదుగురో వున్నారు. కూర్చున్నాను. రెండు చేతుల్నీ పూర్తిగా కవర్ చేస్తూ పయ్యెదని

భుజాలనిండా కప్పుకున్నాను.

దాదాపు మూడు మాసాల క్రితం నాకీ జబ్బు వచ్చింది.

మొదటిలో వళ్ళంతా కాస్త జిలగా వుండేది. 'అలర్జీ' అనుకొని 'అవిల్' టాబ్లెట్స్ తెప్పించుకొని వాడాను. తగ్గిపోయింది. తృప్తిపడ్డాను.

తర్వాత వారం రోజులకి భుజాలనుండి చేతులవరకు, వీపు మధ్యభాగంనుండి నడుం చివరి భాగంవరకు, తొడలపైనుండి చీల మండలవరకూ ఎర్రటి దద్దుర్లు పుట్టుకొచ్చాయి.

ఒకటే జిల! గోకుతూంటే హాయిగా వుండేది. మంట పుట్టేవరకూ గోకువా మన్పించేది. ఆ మంటలో కూడా ఒక విధమైన హాయి!

మా వారికి విలేజ్ అసిస్టెంటుగా వుద్యోగం రాక ముందు ఓ ప్రయివేట్ డాక్టరువద్ద నెలకి రెండొందలు జీతమ్మీద కంపౌండర్‌గా చేసేవారు. ఆ అనుభవంతో ఆయన నా దద్దుర్లుచూసి 'స్కాబీస్' అన్నారు. అంతే కాదు. అప్పటికప్పుడు మందులషాపుకి వెళ్ళి స్కాబియాల్ బాటిల్ తెచ్చారు.

దాదాపు నెలరోజులు క్రమం తప్పకుండా వాడాను. తగ్గుముఖం పట్టినట్టేపట్టి మళ్ళీ విజృంభిస్తున్నాయి. తగ్గిన చోట్ల నల్లని మచ్చలు మిగిలిపోతున్నాయి.

వళ్ళంతా మచ్చలతో అసహ్యంగా తయారైంది. నన్ను నేను చూసుకుంటే నాకే ఏడుపొచ్చేది.

తెల్లని సన్నని అందమైన శరీరం నాది. పాలరాతి శిల్పంగా అభివర్ణిస్తూ మావారప్పుడప్పుడూ ఆశుకవిత్వం కూడ చెప్పేవారు. అది తల్చుకుంటేనే ఏడుపొస్తోంది.

డాక్టర్ ఆదినారాయణవద్దకి పిల్చుకుపోయారు నన్ను

మావారు.

మావారు అన్నీ వివరించి చెప్పారు. వెళ్ళిపోయారు.

"ఎప్పట్నుండి యిలా వుందమ్మా?" మృదువుగా అడిగాడు డాక్టరు.

"దాదాపు నెలన్నరనుండీ" అన్నాను.

"వేడి పదార్థాలు తిన్నప్పుడుకాని, గోంగూర, వంకాయ లాంటి నంజు వస్తువులు ఆహారంలో వాడినప్పుడుకాని జిల, మంట అధికంగా వుంటాయా?"

"అబ్బే - లేదండీ!" అన్నాను బాగా గుర్తుకు తెచ్చుకొని.

"ఇదేదో వైటమిన్ డెఫిషియన్సీ లాగుంది. బ్లడ్, మోషన్, యూరిన్ పరీక్ష చెయ్యాలి. ఆ యేర్పాట్లు రేపు చూద్దాం. ప్రస్తుతానికి ఈ పిల్స్ వాడు...." అంటూ కొన్ని పిల్స్ యిచ్చారు.

మర్రోజు సాయంత్రానికి రిపోర్ట్సు వచ్చాయి.

"యిది చర్మవ్యాధి కాదమ్మా! వైటమిన్ 'ఎ' డెఫిషియన్సీవల్ల నీకీ జబ్బొచ్చింది. కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇంజక్షన్సు వ్రాసియిస్తాను. తెప్పించుకో. చేస్తాను." అన్నారు ఆదినారాయణ.

డాక్టర్ ఆదినారాయణకి మాపై అభిమానం అధికం. కారణం వుంది.

వివాహం కాకముందు మాకూ మావారికీ ఆయనే డాక్టరు ఏ చిన్నజబ్బు వచ్చినా ఆయన వద్దకే పరిగెత్తే వాళ్ళం. మాది ప్రేమవివాహం కాదు గాని దాదాపు అలాంటిదే!

మా అత్తయ్యా మావయ్యా నన్ను ఈ డాక్టరు క్లినిక్

లోనే చూశారు. 'వారికి' చూపించారు. వారికి నచ్చటంతో మా వివరాలు డాక్టరుగారినుండే తెల్సుకున్నారు. మా తల్లిదండ్రులతో మాట్లాడారు.

కులగోత్రాలూ సంప్రదాయాలూ ఉభయపక్షాలవారికీ నచ్చాయి. నాకూ వారు నచ్చారు. వివాహం జరిగిపోయింది.

ఆ తర్వాత ఆర్నెల్లకి మావారు డాక్టర్ మురళీ మోహన్ వద్ద కంపౌండర్‌గా చేరారు. అయినా కూడా మా ఆరోగ్యంలో ఏ చిన్న లోపం జరిగినా ఆదినారాయణ గారే మా వైద్యులు.

మమ్మల్ని డాక్టర్ అభిమానించటానికి యివన్నీ కారణాలే! అంచేత వారు మావద్ద ఇంజెక్షన్లకి లాభం పుచ్చుకోరు. ప్రిస్క్రైబ్ చేస్తారు. వయల్ తెచ్చుకుంటే ఉచితంగా చేస్తారు....

2

డాక్టరమ్మ గట్టిగా పిల్చేసరికి గతంనుంచి బయట పడ్డాను.

"నిద్రపోతున్నావా?" నవ్వుతూ అంది డాక్టరు.

"అబ్బే - లేదండీ" అన్నాను సిగ్గుపడుతూ.

"జబ్బేమిటి?" అందామె స్టెత్ చెవుల్లో పెట్టుకుంటూ:

"డెఫిషియన్సీ ఆఫ్ వైటమిన్ ఎ" అన్నాను. మోచేతులవరకూ పమిట తొలగించి చూపించాను.

"ఎప్పట్నుంచి వుంది ఇలా?" అంది.

"దాదాపు మూడు మాసాలైంది" అన్నాను.

"ఇంతకుముందు ఎక్కడ వైద్యం చేయించుకున్నావు?"

"డాక్టర్ ఆదినారాయణ."

"అక్కడ ఎందుకు మానేశావు? బిల్ ఎక్కువగా ఛార్జి చేసేవారా? జబ్బు తగ్గని మందులిచ్చేవారా? లేక...."

"అవేవీ కాదండీ! 'ఆరోవిట్' ఇంజక్షన్సు రాసిచ్చారు. ఒకటో రెండో దొరికాయి. చేశారు. ఆ తర్వాత ఆంపూల్స్ లేవన్నారు. యిప్పుడు రావటం లేదన్నారు. సరేనని ఆరోవిట్ పిల్స్ వాడుతూ వచ్చాను. వాటితో బాటు వాడమని తను కూడా కొన్ని పిల్స్ ఇచ్చేవారు. వాటిలో సన్నగావుండే మాత్రలు (బహుశ 'జీట్' అనుకుంటాను) వేసుకుంటే అదొకలాంటి మత్తు ఆవరించేది. నిద్ర వచ్చేది.

మా వారు 'ఓర్వకల్లు' గ్రామంలో విలేజి అసిస్టెంటుగా చేస్తున్నారు. ఉదయం వెళితే సాయంత్రానిగ్గాని రాలేరు. అయిదేళ్ళ బాబుతోబాటు పనంతా నేనే చేసుకోవాలి. నిద్రమత్తుతో అన్నిపనులూ చేసుకోవటం కష్టంగావుంది.

వాటితోబాటు మా వారు 'వైటమిన్ ఎ-డి' కాప్స్యూల్స్ కూడ తెచ్చిచ్చారు. అవన్నీ వాడుతోంటే కాస్త తగ్గుముఖం పట్టాయి. కాని నాకు తృప్తికరంగా అన్పించలేదు. పెచ్చులూడిన పాత గోడలా మారుతోన్న నా శరీరాన్ని చూసుకుంటే బాధ కలుగుతోంది. మందు మారిస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. మందు మార్చాలంటే డాక్టర్ని మార్చాలి. మీరు సునీత సిస్టరని తెల్సి వచ్చాము...." అన్నాను.

"మా సునీత నీకు తెల్సా!?"

"ఇంటర్‌లో క్లాసుమేటు. కాని మీరు దాని సిస్టరని మొన్ననే తెల్సింది."

"అదే చెప్పిందా?"

"ఆఁ....మిమ్మల్ని కలవమని సజెషన్ కూడ ఇచ్చింది.

ఏవో కారణాలవల్ల తను రాలేక పోతున్నాననీ మరోలా అనుకోవద్దనీ చెప్పింది."

"యిక్కడే వుందా?" అడిగింది వజ్రమ్మ.

"లేదు, నిన్ననే హైదరాబాదు వెళ్ళిపోయింది."

"నేను ఇంటర్ కేస్ట్ మేరేజి చేసుకున్నాను. మా వాళ్ళందరూ నన్ను దాదాపు వెలివేశారు...."

"అలాగా" అన్నాను.

"నీకు పెన్సిలిన్ సూటవుతుందా?"

"అవుతుంది."

"సరే. పెన్సిలిన్ ఇంజక్షన్స్ చేస్తాను. లోషన్ వ్రాసిస్తాను. ప్రతిరోజూ మూడు పూటలా బాగా వంటికి పట్టించు. మొదటి మూడు రోజులూ స్నానం చెయ్యకు. ఆ తర్వాత రెండు పూటలూ పెట్మోసాల్ సోప్‌తో స్నానంచెయ్యి ప్రతిరోజూ. ముప్ఫయ్ కాప్సూల్స్ వ్రాసి యిస్తాను. ప్రతి రోజూ ఉదయం ఒకటీ రాత్రికి ఒకటీ వేసుకో. ఆహారంలో తరచూ క్యాబేజీ తీసుకుంటూ వుండు." అది డాక్టర్ వజ్రమ్మ.

ఇంజక్షన్ చేసింది.

"మీ ఫీజు ...." అడిగాను.

"యాభై"

ఫీజు చెల్లించి బయటపడ్డాను.

3

"యివాళ మీకు తెలీకుండా ఓ పని చేశాను." అన్నాను మా శ్రీవారితో సంజాయిషీగా.

"ఏమిటి?" అడిగారాయన.

డాక్టర్ వజ్రమ్మ వద్దకి వెళ్ళి పరిచయం చేసుకోవటం, ట్రీట్‌మెంట్ మొదలుపెట్టడం అంతా చెప్పి "ఆ డాక్టర్

కూడ ఎవరో కాదు. మన సునీత సిస్టరేనండీ" అన్నాను.

శ్రీవారు చేదుమాత్ర మింగినవాడిలా మొహంపెట్టారు.

"సారీ....మన డాక్టరుగారిపై నమ్మకంలేక కాదు. చిన్న మాత్రలు యిచ్చి ముప్పూటలా వేసుకోమంటారు. నిద్రతో కనురెప్పలు పగలు కూడ మూసుకుపోతూనే వుంటాయి. పనులు చేసుకోవటం కష్టంగావుంది. మొన్ని లాగే స్టవ్‌మీద కాఫీ గిన్నెపెట్టి వంటింట్లోనే నడుం వాల్చాను. మొద్దునిద్ర పట్టేసింది. వులిక్కిపడి లేచి చూస్తే యింకేముందీ!? కాఫీ అంతా ఆవిరైపోయి అందు లోని సారమంతా మాడిపోయి గిన్నె లోపలి భాగంతో సహా ఎర్రగా నిప్పులా మారిపోయింది. గుక్కెడు కాఫీ కోసం అర్థలీటరు కిరోసిన్ వృధాగా తగలబడిపోయింది" అన్నాను.

"పిచ్చిదానా! దేనికైనా నమ్మకం కావాలి. రోగికి నమ్మకం సగంమందు. డాక్టరుమీదా వైద్యంమీదా నమ్మ కాన్ని కోల్పోతే ఎంత ఖరీదైన మందులైనా పనిచెయ్యవు. డాక్టర్ ఆదినారాయణ దాదాపు పదిహేను సంవత్సరాలుగా మనకి వైద్యం చేస్తున్నారు. యిది వ్యాపారయుగం. విద్యని, కళని, వైద్యాన్ని సైతం వ్యాపారంగా మారు స్తూన్న ఈ రోజుల్లో నారాయణగారు అభిమానానికి కట్టు బడి దాదాపు ఉచితంగా మనకి వైద్యం చేస్తున్నారు ..."

"సారీ చెప్పానుకదండీ! మన డాక్టరు వైద్యం చెయ్య లేరని నేనటంలేదు...."

"నిద్రమాత్రలవల్ల ఇబ్బంది మొదటి కారణమైతే నీ ఫ్రెండు రెకమెండేషను రెండో కారణం అంతే కదూ!?"

జవాబివ్వలేక పోయాను.

"సరే. నీ ముచ్చట ఎందుక్కాదనాలి? అలాగే కానీ"

అన్నారు శ్రీవారు.

క్రమంగా నా వంటిపైని దద్దుర్లు కొత్త వాడుపట్టాయి. జిలకూడ చాలావరకు తగ్గింది.

పెన్సిలిన్ కోర్సు పూర్తయింది అయిదు ఇంజక్షన్లతో. ఇంజక్షన్‌కి అయిదేసి రూపాయలు ఛార్జి చేసింది వజ్రమ్మ. 'వైటమిన్-ఎ' గల ఆయింట్‌మెంట్ రాసిచ్చింది.

నా కాశ్చర్యం వేసింది. ఆమె నాకు వేసిన పెన్సిలిన్ ఇంజక్షన్స్ (వయల్) ఖరీదు కేవలం అయిదురూపాయలు. అందులోంచి అయిదు డోసులు విత్‌డ్రా చేసింది. అంటే ఒక్కోడోసు ఖరీదు రూపాయన్నమాట, కాని....అయిదేసి రూపాయలు ఖరీదు వేసింది.

మా శ్రీవారన్నమాటలు గుర్తొచ్చాయి.

డాక్టరమ్మ చెయ్యి నా భుజంపై పడ్డంతో ఆమెకేసి చూశాను.

"ఇక ఇంజక్షన్సు అవసరంలేదు. పుళ్ళు క్రమంగా అదృశ్యమైపోతాయి. 'వైటమిన్-ఎ' అధికంగా వుండే అయిటమ్సుని ఆహారంలో వాడుతూండు. డెట్మాసాల్ సోపు మరికొంతకాలం వాడు. బైదిబై-నువ్వు 'ఎగ్' తిననని చెప్పావుకదూ!"

అవునన్నట్టు తలూపాను.

"ఇవిగో-పవర్‌ఫుల్ కాప్సూల్స్. హైదరాబాదు నుండి తెప్పించాను. ఒక్కో కాప్సూల్ ఒక్కో గ్రుడ్డుతో సమానం. రోజుకి రెండు చొప్పున యాభై రోజులు వుపయోగించు. ఎవ్రీథింగ్ విల్‌బి ఆల్‌రైట్...." అంది డాక్టర్ వజ్రమ్మ.

"కాప్సూల్స్ ఖరీదు...."

"నలభై అయిదు రూపాయలు"

"థాంక్స్...."

4

కాప్సూల్సుని గాజు సీసాలో పోస్తున్న నేను ఓ కాప్సూల్ జారి క్రిందపడటంతో వులిక్కిపడ్డాను. సీసాని జాగ్రత్త చేసి వంగి నెమ్మదిగా దాన్ని అందుకున్నాను. కాప్ వూడి దానికి మూరెడు దూరంలో పడుంది. దాన్ని అందుకొని - యథాప్రకారం అమర్చబోతూ కాప్సూల్ గొట్టంలోకి అప్రయత్నంగా చూసి అదిరిపడ్డాను.

అందులో ఎర్రని ద్రవం వున్న గోళీవుంది.

నాకు విషయం అర్థం కావటానికి మూడు నిముషాలు పట్టింది. కోపం, ఆవేశంతో నా ముక్కుపుటాలు అదర నారంభించాయి. డా॥ వజ్రమ్మ యింటిపై దాడిచేసి బాగా చీవాట్లు పెట్టాలన్పించింది. మా శ్రీవారి రాకకోసం అసహనంగా ఎదురుచూడ నారంభించాను.

సాయంత్రం వచ్చారు. నా సహనాన్ని పరీక్షిస్తూ ఇవాళ ఓ గంట ఆలస్యంగా వచ్చారు.

"నన్ను క్షమించండి...." అన్నాను కాఫీగ్లాసు అందిస్తూ.

ప్రశ్నార్థకంగా చూశారు.

డా॥ వజ్రమ్మ యిచ్చిన కాప్సూల్స్ తెచ్చి వారి ముందు గుట్టగా పోశాను. ఓదాన్ని తీసి దాని కాప్‌తీసి చూపించాను.

"వీటి ఖరీదు నలభై అయిదు రూపాయలు" చెప్పాను.

వారు ఆశ్చర్యపడకపోవటం నా కాశ్చర్యాన్ని కల్గించింది.

"అదేమిటండీ! మీరు నాకోసం తెచ్చిన 'వైటమిన్-ఎ'

ట్రాన్స్‌పరెంట్ గోలీలు యిందులో వున్నాయి. అయిదు పైసల ఖరీదు చేసే గోలీకి అందమైన దుస్తులు వేసి నన్ను నమ్మించి నాకు తగలగట్టిందావిడ. యిది, మోసంకాదా!?"

"రజనీ! నేను మొన్ననే చెప్పాను. వైద్యం కూడ వ్యాపారమైందని. అయినా యిందులో ఆమె చేసిన నేరం ఏముందని?"

"అదేమిటండీ!? యిందులో మీకు క్రయిమ్ కనపట్టం లేదా? ఎమ్టీ కాప్సూల్సు బజార్లో చవగ్గా అమ్ముతారని మీ భార్యగా నాకు తెల్సు. మీ భార్యగా నన్ను గుర్తించని ఆ డాక్టరు అందంగా నన్ను మోసంచేసింది. ధన్వంతరి వారసులమని గర్వంగా చెప్పుకుంటూ వీళ్ళు చేస్తూన్న నిర్వాకం ఏమిటి?"

చిరునవ్వు నవ్వారు శ్రీవారు.

"నవ్వకండి. ఒళ్ళుమండుతోంది. ఒక వ్యాపారి కక్కుర్తి పడొచ్చు. అందువల్ల వినియోగదారుడికి నాలుగు డబ్బులు అదనంగా వూడతాయి. కాని ఒక వైద్యుడు స్వార్థపరుడైతే ఎందరు అమాయకులు ప్రాణాలు కోల్పోతారు? ప్రాణాలతో చెలగాటమా వ్యాపార లక్షణం? ప్రాణాలతో చెలగాటమా? వైద్యలక్షణం?"

"యిలాంటిది జరుగుతుందని నాకు తెల్సు. సాధారణంగా రోగికి ఏదో ఒకటి యిచ్చి పంపాలి. తనవద్ద దానికి సరైన టాబ్లెట్ లేకున్నా ప్రిస్క్రైబ్ చేసినా తన చేతుల మీదుగా ఏదో ఒకటి ఇవ్వాలి. లేకపోతే రోగి తృప్తి చెందడు.

అందుకోసం జీట్, బీకాంప్లెక్స్, ఎ.పి.సి (ఆల్ పెయిన్స్ క్యూర్ అని ముద్దుగా పిలుస్తుంటారు కాని ఆస్ప్రిన్, ఫినాసిటిన్, కెఫీన్ కలిగిన మాత్రలు) వగైరా

ఉన్నాయి. షుగర్ కోట్ చేసిన బి. కాంప్లెక్స్ పిల్స్ మార్కెట్లో వున్నాయి. యివన్నీ ఆయా రోగాలకి పని చెయ్యటంలో తమ విద్యుక్త ధర్మం నెరవేరుస్తాయి...."

"కావచ్చండీ!" అసహనంగా అన్నాను. 'వైటమిన్ ఎ-డి' కాప్సూల్సు మనవద్ద మూల్గుతున్నాయి. హైదరాబాదు నుండి తెప్పించాననీ ఒక్కోటీ ఒక్కో కోడి గ్రుడ్డుతో సమానమనీ అబద్ధం ఎందుకు చెప్పాలి? అంత ఖరీదైన కాప్సూల్సు వాడుతున్నాము కదాని మనం అవి తప్ప యింకేం వుపయోగించం. నష్టం ఎవరికి?"

"మనకే!"

"అయితే పదండి"

"ఎక్కడికి?"

"ఆమె వద్దకే!"

"ఎందుకు?"

"అనాల్సినవన్నీ అనేసి ఆ కాప్సూల్సు ఆమె మొహానే పారేసి వద్దాం...."

"నీకేమైనా మతిపోయిందా? యిచ్చినప్పుడు చిరునవ్వుతో తీసుకొచ్చి యిప్పుడు వద్దంటే ఎలా?"

"అప్పుడు తెలీదు నిజం. యిప్పుడు తెల్సింది"

"ఎందుకులెద్దూ—ఎలాగో ఖర్చుచేశా మనుకుందాం." అన్నారు శ్రీవారు.

అవాక్కైపోయాను. ఎందుకిలా అంటీముట్టనట్టు ప్రవర్తిస్తున్నారు??

కాసేపయ్యాక స్ఫురించింది. వారు కూడ ఓ డాక్టరు వద్ద కొంతకాలం పనిజేశారుగా! బహుశ ఆ డాక్టరు కూడ....

నో!

ఈ సంఘటనని నేను జీర్ణించుకోలేకున్నాను. ఏదో ఒకలా ఖర్చుచేశామనుకొని సర్దుకోలేక పోతున్నాను.

ఎలా సర్దుకోగలను? బాబుకి రెండ్రూపాయలు ఖర్చు పెట్టి 'కోవా' కొనుక్కోవాలనుకుంటే అరగంట ఆలోచిస్తాం, యింకోచోట ఖర్చు ఎలా తగ్గించుకోవాలా అని. అలాంటిది — ఎక్స్ట్రా కాప్సూల్స్‌తో సహా మొత్తం పది రూపాయలు కూడ చెయ్యని మందులకి అంత డబ్బు తగలేసి 'సర్దుకు'పోవటం అసాధ్య మన్పించింది.

సునీత నా ఫ్రెండని తెల్సికూడ యింత ధైర్యంగా నన్ను వంచించ గల్గిందీ అంటే—హౌ డేర్ షీ ఈజ్!? ముఖ్యులెవ్వరూ పరిచయం చెయ్యకుండా తమంత తాముగా పరిచయమై ట్రీట్‌మెంట్ తీసుకునే అమాయకుల్ని ఎంతగా వంచిస్తూ వుండాలి?

వైద్యం కూడ వ్యాపారం కావచ్చు. కాని కొన్ని పరిమితులకి లోబడి వుండాలి. ప్రాణం పోసేవాడు దేవుడైతే ప్రాణం నిలిపేవాడు వైద్యుడు.

వీరా వైద్యులు!?

వీరా ధన్వంతరి వారసులు??

డాక్టర్ ఆదినారాయణగారు నా మనసులో మెదిలారు. చేతులెత్తి దణ్ణంపెట్టాను మనసులోనే! సంవత్సరానికి తగ్గిపోసీ! ఆయన వైద్యమే కంటిన్యూ చెయ్యాలనుకున్నాను.

కాని యిలాంటివాళ్ళ భరతం పట్టాలి. ఏదో చెయ్యాలి.

ఇకమీదట అమాయకుల్ని ఆమె వంచించకుండా చూడాలి.

కాని ఎలా? నేను అబలని. శ్రీవారి కోఆపరేషన్ నాకు లేదు. రిపోర్టు చెయ్యగలను పోలీసులకి. కాని నాకు న్యాయం లభిస్తుందన్న ఆశలేదు.

కనీసం ఆమె నన్ను వంచించిన సంగతైనా ఆమెకి తెలియాలి. ఇకపై ఎవరినైనా ఫ్రాడ్ చేసేముందు 'ఈ మోసం వాళ్ళకి తెల్సిపోతుందేమో' అన్న అనుమానం పుట్టించాలి.

లేచాను. మా యింట్లో మా వారు తెచ్చిన 'వైటమిన్ ఎ-డి' రెడ్ ట్రాన్స్‌పరెంట్ గోలీలు కొన్ని పొట్లం కట్టుకున్నాను. చెప్పులు వేసుకున్నాను.

నేను వెళ్ళేసరికి ఎవరికో ఇంజక్షన్ చేస్తూందామె.

"డబ్బు తెచ్చావా?" నవ్వుతూ అంది.

తలూపుతూ డబ్బుతోబాటు పొట్లంకూడ టేబుల్‌పై ఉంచాను.

"ఆ పొట్లం ఏమిటి? ఏదైనా ప్రసాదమా?"

"చూడండి. మీకే తెలుస్తుంది"

విప్పి చూసింది. ఆమె మొహంలో మొదటి క్షణం అయోమయం, రెండో క్షణం ఆశ్చర్యం, మూడో క్షణం కలవరం....

"యివి మా యింట్లో చాల వున్నాయి. మీరు ఖాళీ కాప్సూల్సులో వేసి 'అమ్ముకోటానికి పనికొస్తాయని— తెచ్చాను. ఉంచండి." గిరుక్కున వెనుదిరిగాను.

ఆమె మొహం తెల్లగా పాలిపోయి వుంటుంది. నేను చూడలేదు. చూడాలనుకోలేదు కూడ! □

శాపగ్రస్తులు

– వి.పద్మప్రియ



బైట ఆటో కదిలిన చప్పుడు వినపడిన ఐదు నిమిషాల తర్వాత బీరువా చాటునుండి యివతలికి వచ్చాను. మరో ఐదు నిముషాలు ఆగిన తర్వాత గోడమీద తడిమి లైటు వేశాను. క్షణంలో గదంతా ప్రకాశం అయింది. ఒక్కసారి గుండెల్నిండా వూపిరి పీల్చుకున్నాను. ఈ గది యింటి మధ్యలో వుండటంవల్ల వెలుతురు బైట వాళ్ళకి కనపడే అవకాశం లేదు.

బీరువాకి ఎదురుగావున్న పెద్ద నిలువుటద్దంలో నా రూపం స్పష్టంగా కనిపిస్తూంది. పీచులా రేగిపోయివున్న క్రాపు, దుమ్ము కొట్టుకుపోయివున్న బట్టలు, అలసట

నిండిన కళ్ళు, పీక్కుపోయివున్న మొహం. ఇప్పుడు విశ్రాంతి ఎంతో అవసరం నాకు.

పోలీసులకి టోకరా యిచ్చి యింతదూరం పరిగెత్తుకు రావటం అంటే మాటలు కాదు. దాదాపు రెండు కిలో మీటర్లయినా పరిగెత్తి వుంటాను. మోచేతులు, మోకాళ్ళు గీరుకుపోయి • రక్తం స్రవిస్తున్నాయి. ఇందాకటిదాకా టెన్షన్లో తెలియలేదుగానీ యిప్పుడు తెలుస్తూంది బాధ. ఈ గదిలో వెలుతురు డైనింగ్‌హాల్లో పడుతూండటంతో అక్కడ వాష్‌బేసిన్ వున్నట్టు కనిపెట్టాను.

పంపు తిప్పగానే నీళ్ళు బొళబొళమంటూ కార సాగాయి. ముందు నీటితో గాయాల్ని శుభ్రం చేసు కున్నాను. తర్వాత మొహం అక్కడేవున్న సబ్బుతో కడుక్కున్నాను. దుమ్ము, ధూళితో నిండివున్న మొహా నికి చల్లటి నీరు తగలగానే ప్రాణం హాయిగా అని పించింది.

చాలా నీరసంగా అనిపించటంలో కాసేపు అక్కడే డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చున్నాను. గోడ గడియారం టిక్కుటిక్కుమంటూ శబ్దం చేస్తూంది. అంతకుమించి యిల్లంతా నిశ్శబ్దం:

ఈ యింటివాళ్ళు మరో వారం దాకా తిరిగిరారు. అందాకా యీ యింటిలో నేను నిశ్చింతగా వుండచ్చు. ఉండచ్చు అనకూడదేమో, దాక్కోవచ్చు!

కడుపులో ఆకలి సుళ్ళు తిరుగుతోంది. ఈ యింటి యిల్లాలు తినడానికేమయినా ఈ యింటిలో మిగిల్చి వుంటుందా? వారం రోజులు వూరు వెళ్తున్నవాళ్ళు తినే పదార్థాలు ఎందుకు మిగిల్చిపోతారు? అయినా ప్రయత్నించి చూద్దాం. ఏమయినా దొరక్కపోతుందా?

తడుముకుంటూ వంటింటిలోకి వెళ్ళి అక్కడ కూడా లైటు వేశాను. ఒక ఎలుక చటుక్కున కాళ్ళమీంచి దూకి పారిపోయింది.

గోడమీద ఒకదాని కళ్ళలోకి మరోటి చూసుకుంటూ తన్మయత్వంలో వున్న బల్లుల జంట కిటికీ రెక్కచాటుకి తప్పుకున్నాయి. వంటింటిలోంచి వెలుతురు బైటికి కన పడే ప్రమాదం వుందని గ్రహించి చప్పున కిటికీ తలుపు మూసేశాను.

వంటింటిలో ఓ మూల ఫ్రిజ్ వుంది. ఆన్ చేసేవుంది. తలుపు తీసి చూశాను. నేను అదృష్టవంతుణ్ణే పర్వాలేదు లోపల రెండు యాపిల్‌పళ్ళున్నాయి. నాలుగు సీసాల నిండా చల్లటి నీళ్ళున్నాయి. ఇంకా అదృష్టం ఏమిటంటే మూడు పాల ప్యాకెట్లు కూడా వున్నాయి. ఇలాంటి పరి స్థితుల్లో ఓ కప్పు కాఫీ ఎంత రిలీఫ్ యిస్తుందో నాకు తెలుసు.

గడ్డకట్టివున్న పాల ప్యాకెట్టుతీసి విడిగా నీళ్ళల్లో పడేసి, యాపిల్‌పళ్ళు ముక్కలుచేసి ప్లేటులో పెట్టుకుని డైనింగ్ హాల్లోని కుర్చీలో కూర్చుని ఒక్కొక్క ముక్క తినసాగాను.

ఆకలిగావున్న నోటికి చల్లటి, తియ్యటి యాపిల్ ముక్కలు అమృతంలా వున్నాయి. కడుపు పూర్తిగా నిండలేదింకా. అయినా పర్వాలేదు. ఈరాత్రికి ఎలాగో కళ్ళుమూసుకు పడుకుంటే రేపు చూసుకోవచ్చు. పాలు కరిగిన తర్వాత, ఇన్‌స్టెంట్ కాఫీ పొడి వెతుక్కుని వేడి వేడిగా కాఫీ తయారుచేసుకున్నాను. ఒక్కొక్క గుక్క తాగుతుంటే ఎంతో హాయిగావుంది. తలలో బిగపట్టిన

నరాలన్నీ మామూలుగా అవుతున్న భావన....

నన్ను వెదుకుతున్న పోలీసులుగానీ, పూరు వెళ్ళిన యీ యింటివాళ్ళుగానీ నేనిలా యిక్కడ కూర్చుని యింత హాయిగా కాఫీ తాగుతున్నానని అసలు పూహించ గలరా? నో!

యావజ్జీవ ఖైదు శిక్ష పడ్డ ఖైదీ తప్పించుకు పారి పోయాడంటే అదంత తేలికకాదు. పేపర్లల్ రేపీ వార్త మారుమోగిపోతుంది. పోలీసు బలగాలు బహుశా ఈ నగర మంతా నాకోసం కళ్ళల్లో వొత్తులేసుకుని గాలిస్తూవుంటా రీపాటికి. బస్టాపులు. రైల్వేస్టేషన్లు గట్టి కాపలాలో వుండుంటాయి. తను ఇంత తక్కువ వ్యవధిలో నగరం ఒదిలి పారిపోలేడని పోలీసులకి తెలుసు. అందుకే నగర మంతా జల్లెడ పట్టేస్తారు.

అదృష్టంకొద్దీ దాక్కోవటానికి ఈ యిల్లు దొరికింది తనకి. లేకపోతే ఈ వూళ్ళో ఎక్కడ దాక్కున్నా ఈ పాటికి మళ్ళీ వాళ్ళకి పట్టుబడక తప్పేదికాదు. అందులోను తను మామూలు ఖైదీకాదు. ధనవంతుల ప్రాణాలతో ఆడుకునే అభినవ రాబిన్‌హుడ్. ఎన్నో దోపిడీలు, రెండు హత్యలూ చేసిన ఓ ప్రమాదకరమయిన బందిపోటు.

అయితే సినిమాల్లో చూపించే లైపు బందిపోటు కాదు తను. గుర్రాలు, తుపాకీలు, పక్కన అనుచరులూ యివేమీ లేవు తనకి. అయినా చాలామంది ధనవంతులు తనంటే భయపడి ఒణికి చస్తూవుంటారు. తనకి జైలుశిక్ష పడిం దనగానే వాళ్ళకి ఎంతో సంతోషం కలిగివుంటుంది. తీరా యిప్పుడు మళ్ళీ తప్పించుకున్నాడని తెలిస్తే గుండెలు ఆగి చస్తారు.

వెలుగుతున్న లైట్లు ఆర్పేసి బెడ్‌రూంలోకి వెళ్ళాను.

ప్రయాణం హడావిడిలో ఎక్కడిబట్టలక్కడ చిందర వందరగా మంచంమీద పడేసిపోయినట్టుంది ఇంటావిడ. ఆ బట్టల్లోంచి ఓ లుంగీ, జుబ్బా తీసుకున్నాను. నా దుమ్ము బట్టలు విడిచి అవి ధరించాను. మంచంమీదున్న బట్టలన్నీ కలిపి ఓపిగ్గా మూటగట్టి ఓమూల పడేశాను.

టేబుల్ మీద నాకోసమే అన్నట్టుగా లక్కీగా పెన్సిలిన్ ఆయింట్ మెంటు కనిపించింది. దాన్ని గాయాలనిండా పట్టించి, ఫ్యాను వేసుకుని మంచంమీద పడుకున్నాను. మనసంతా ప్రశాంతంగా అనిపించింది.

నా చేతికి అందుబాటులో పోర్టబుల్ టి. వి. వుంది. కుతూహలం కొద్దీ ఆన్ చేశాను. సౌండ్ చిన్నగా పెట్టాను. ఎవరో ఒక బట్టతలాయన సితార్ వాయిస్తున్నాడు. రెండు నిమిషాల తర్వాత హఠాత్తుగా సితార్ వాదన ఆగిపోయింది. ఆయన బొమ్మ మాయమయి టి. వి. మీద నా ఫొటో ప్రత్యక్షం అయింది.

"నగర పౌరులకు హెచ్చరిక. ఈ ఫొటోలో వ్యక్తి యావజ్జీవ శిక్ష విధింపబడిన ప్రమాదకరమైన ఖైదీ ప్రసన్నకుమార్: ఇతడు ఈరోజు సాయంత్రం పోలీసులు జైలుమార్చడానికి తీసుకువెళ్తుండగా తప్పించుకుని నగరంలోకి పారిపోయాడు. ఇతడు ఈ నగరంలోనే వుండి వుంటాడని పోలీసు వర్గాలు బలంగా విశ్వసిస్తున్నాయి. కాబట్టి పౌరులందరూ యితడి విషయంలో జాగ్రత్తగా వుండవలసిందిగా నగర పోలీసు కమిషనర్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంకో గమనిక: ఈ ఖైదీ ఆచూకీ తెల్పినా, లేక యితణ్ణి పట్టిచ్చినా పెద్దమొత్తంలో బహుమతి కూడా అందజేయబడుతుందని తెలియజేస్తున్నారు.

నేను వూహించిందే కరెక్టయింది. పోలీసులు అన్ని వైపుల్నించీ వలలు పన్నుతున్నారు నాకోసం. బహుమతి ఆశ పెట్టేసరికి యిక ప్రతివాడూ నేనెక్కడయినా కనిపిస్తానా అని చూస్తూనే వుంటాడు. ఇలాంటి పరిస్థితుల్లో బైటికెళ్ళటం ఆత్మహత్యా సదృశం. ఓ వారం తర్వాత ఈ వేడి చాలావరకు చల్లారుతుంది అప్పుడు యింకోదారి వెతుక్కోవటం నాకు చాలా తేలిక.

కళ్ళమీదకు నిద్ర భారంగా ముంచుకొస్తోంది.

ఆలోచన లన్నింటినీ బలంగా ఒక పక్కకు నెట్టి పక్కకు తిరిగి కళ్ళు మూసుకున్నాను.

2

వేసవికాలపు ఉదయం ఎండ కిటికీ అద్దాల్లోంచి వేడిగా తాకగానే మెలకువ వచ్చింది నాకు. ముందు కాసేపు ఎక్కడున్నానో అర్థం కాలేదు. కళ్ళు తెరవగానే ఎదురుగా ఇనపచువ్వలే కనపడేవి. కొన్నాళ్ళనుండీ అవి అలవాటయిపోయి ఇప్పుడీ వాతావరణం కొత్తగా అనిపించింది.

ఐదు నిముషాలు బద్ధకంగా అలాగే పడుకుని లేచాను ఆవలిస్తూ. మొహం కడుక్కున్న తర్వాత వంటగదిలోనే స్నానం చేశాను. బాత్‌రూమ్ బైట వుంది కాబట్టి.

ఫ్రిజ్‌లో దొరికిన ఎగ్‌తో ఆమ్లెట్ వేసుకుని కాఫీ తాగాను. కడుపు కొంత శాంతించింది. ఇంకో గంటదాకా ఫర్వాలేదు. ఒక గజదొంగకి వంట బాగా చెయ్యటం వస్తుంది అంటే చప్పున ఎవరూ నమ్మరు.

కానీ నేను వంట బాగా చేస్తాను. అది మా అమ్మనుండి నాకు సంక్రమించిన విద్య. సాధ్యమైనంతవరకు చప్పుళ్ళు చేయకుండా నిశ్శబ్దంగా ముగించాను. ఆవకాయ పచ్చడితో

సుష్టుగా అన్నం తిన్నాను. ఇలా కడుపునిండా తిని ఎన్నాళ్ళయిందో అనిపించింది.

భోజనం పూర్తికాగానే ఎక్కడి సామాను అక్కడ సర్ది మళ్ళీ మంచంమీద వాలాను.

ఒక వారం రోజులు ఈ యింటిలో గడపాలని నిన్నేదో అనుకున్నాను గానీ ఒక్కరోజుకే చాలా బోర్‌గా వుంది. అసలు జైలుకన్నా యిది మరీ యిబ్బందిగా వుంది నాకు. వేసవికాలమేమో ఒకటే వుక్కగా వుంది. కిటికీలు తెరవటానికి లేదు. ప్రతి పనీ చప్పుడు కాకుండా నిశ్శబ్దంగా చేయాల్సి వస్తోంది. పోలీసుల దృష్టిపథం నుండి తప్పుకోవాలంటే యీ బాధంతా కొన్నిరోజులు తప్పదు మరి.

కాలక్షేపం కొసం టేప్‌రికార్డర్ చిన్నగా ఆన్ చేశాను. "ధనమేరా అన్నిటికీ మూలం" అంటూ పాడుతున్నాడు ఘంటసాల.

నిజమే! ధనమే అన్నింటికీ ప్రధానం. దాని చుట్టూనే ప్రపంచం తిరుగుతోంది. ధనవంతులు అన్నింటా బలవంతులుగా పేరు గడిస్తారు. పేదరికం ఎన్ని అర్హతల్నయినా కాలరాస్తుంది. ఇది తిరుగులేని సత్యం.

ధనవంతులంటే నాకు అసూయలేదు. డబ్బులో పుట్టి డబ్బులో పెరగటం అనేది పూర్వజన్మ సుకృతమనే నేను నమ్ముతాను. కానీ ఆ డబ్బుందన్న అహంకారంతో కన్నూ మిన్నూ కానక అమాయకులు నిరుపేదలు అయిన నిర్భాగ్యుల జీవితాలతో ఆడుకునే ధనవంతులంటే నాకు పరమ అసహ్యం.

ఏ ధనవంతుడయినా ఏ పేదవాణ్ణి అయినా హింసిస్తూనో లేక అవమానిస్తూనో నా కంట పడ్డాడంటే ఇక వాడికి మూడినట్టే.

ప్రాణం తీయకపోయినా కాలో చెయ్యో ఏదో ఒకటి విరిచేస్తాను. జీవితాంతం అవిటి బతుకు బతికేట్టుగా తయారు చేస్తాను. వాడు జన్మలో మళ్ళీ ఏ పేదవాణ్ణీ అవమానించడు, బాధించడు. నేనంటే ఎందరో శ్రీమతులకి టెర్రర్!

నేనిలా తయారవటానికి కారణం నా పేదరికం కాదు. నా పేదరికాన్ని ఎక్స్ప్లాయిట్ చేసిన భాగ్యవంతుల దుర్నీతి!

బాల్యంలో మా అమ్మా, నేను తినటానికి తిండి కూడా లేక ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాం. కష్టాలను, కన్నీళ్ళను పళ్ళ బిగువున అణచుకుని రోజులు ఈడ్చాం.

మా అమ్మ నిజాయితీ గల మనిషి. ఓ ధనవంతులింట్లో పంటమనిషిగా పని చేసేది. అందంగా వుండే మా అమ్మ మీద అసూయతో ఆ ఇంటి యజమానురాలు ఓసారి మా అమ్మమీద వెండి కంచాల దొంగతనం అంటగట్టి మా యిద్దర్నీ నిర్దాక్షిణ్యంగా బయటకు తరిమింది.

ఆ క్షణమే నాలో ధనవంతులపట్ల పగకి, ద్వేషానికీ బీజం వేసింది. ఆ తర్వాత ఎదుర్కొన్న ఎన్నో దుర్భర అనుభవాలు ఆకలితో పస్తులున్న రోజులు, ఆ అవమానాలు.... అబ్బ! పగవాళ్ళకు కూడా వద్దనిపిస్తాయి.

మా అమ్మ విపరీతమైన జబ్బుతో మంచం మీద వున్నప్పుడు మందులకోసం ఆవిడ చేతికున్న ఒకే ఒక్క బంగారపు గాజు అమ్మటానికి మార్వాడీ షాపుకి వెళ్ళాను. ఆ మార్వాడీ కిషన్‌చంద్ ఆ గాజు కాజేసి నీవేమీ యివ్వలేదు పొమ్మని బుకాయించాడు. ఆవేశంతో నా రక్తం రగిలిపోయింది. పక్కనే వున్న కుర్చీ ఎత్తి వాడి నెత్తి పగలగొట్టాను.

పోలీసులు నన్ను కొన్నాళ్ళు చిన్నపిల్లల జైలులో వుంచారు. ఆ సమయంలోనే మా అమ్మ మరణించింది. నాకు ఈ లోకంపట్లే విరక్తి కలిగింది. నేను కూడా చచ్చిపోదామనుకున్నాను. కానీ నాలో రగులుతున్న పగ, ద్వేషం నన్ను బ్రతికించాయి. నా కో లక్ష్యాన్ని నిర్దేశించాయి.

ఐదు నెలల క్రితం పోలీసులకి పట్టుబడేవరకూ నేను దుర్మార్గులయిన ధనవంతుల్ని పీడించటం ద్వారా నా లక్ష్యాన్ని సాధిస్తూనే వచ్చాను. వాళ్ళనుంచి దోచిందంతా మురికివాడల్లో జనాలకి దానంచేసేవాణ్ణి. నాది అంతంలేని ఆశయం. ఈ లోకంలో ధనం అనేది వున్నంతవరకూ నా ఆశయం కూడా వుంటుంది. ధనవంతుల్లో అహంకారం బ్రతికున్నంతవరకూ వారికి నా అవసరం వుంటూనే వుంటుంది. అందుకే పోలీసులకి పట్టుబడటానికి నేను సుతరామూ ఇష్టపడటం లేదు.

టేపరికార్డర్ పాటలు అయిపోవటంతో మౌనం వహించింది.

నా ఆలోచనాస్రవంతికి ఆనకట్ట పడింది. అయితే అందుకు కారణం పాటలు ఆగిపోవటం కాదు. బయట నుంచి వినిపిస్తున్న చప్పుడు!

ఎవరో తాళం తీస్తున్నారు. నేను చెవులు రిక్కబొడుచుకుని వూపిరి బిగబట్టి విన్నాను. నిజమే. ఎవరో తలుపు తీసుకుని లోపలికి వస్తున్నారు.

నేను ఒక్కసారిగా ఎలర్ట్ అయ్యాను. కన్ను మూసి తెరిచేంతలో మెరుపులా మంచం క్రిందకి దూరిపోయాను.

క్రీక్ మన్న చప్పుడుతో తలుపు బార్లా తెరుచుకుంది.

కొంపదీసి యీ యింటివాళ్ళు తిరిగి వచ్చేశారా? నా గుండె వేగంగా కొట్టుకోసాగింది. క్రిందకి జీరాడుతున్న దుప్పటి కొద్దిగా తొలగించి ముందు గదిలోకి చూశాను. ఓ ఇరవయి రెండేళ్ళ లోపు యువకుడు చేతిలో పుస్తకాలతో లోపలికి వచ్చాడు. సన్నగా పొడుగ్గా కొద్దిగా పెరిగిన గడ్డంతో పీక్కుపోయిన మొహంతో బలహీనంగా కనిపిస్తున్నాడు.

అతని వెంటే ఓ స్థూలకాయురాలు లోపలికి వచ్చింది. ఆవిణ్ణి పక్కింటావిడగా గుర్తించాను. నిన్న సాయంత్రం యీ యింటి ముందు చెట్లగుబుర్లలో దాక్కున్నప్పుడు వూరికి వెళ్ళబోతున్న యీ యింటి యజమానురాలు ఆవిడతో పావుగంటసేపు పిట్టగోడ దగ్గర నుంచుని మాట్లాడటంవల్ల అప్పుడు బాగానే గమనించాను ఆవిణ్ణి.

"ఇదుగో, గది దొరికింది కదా అని చదువు చదువు అంటూ గంటలతరబడి ఇక్కడే కూర్చోకు. ఇంటిలో నువ్వు చెయ్యాల్సిన పనులు చాలా వున్నాయి. మధ్యాహ్నం కిరాణా సరుకులు తీసుకురావాలి. గుర్తుందిగా" ఉరిమినట్లు మాట్లాడింది ఆవిడ.

"అలాగే పిన్నీ" వినయంగా అంటున్నాడా అబ్బాయి. ఆవిడ వెళ్ళిపోయింది. ఆ అబ్బాయి కుర్చీలో కూర్చుని చాలా శ్రద్ధగా పుస్తకాలు ముందేసుకుని చదవటం ప్రారంభించాడు.

మంచం క్రింద పడుకుని వున్న నాకు వూపిరాడక చాలా అసహనంగా వుంది. ఎప్పుడు వెళతాడితను? పరీక్షలకి చదువుకుంటున్నాడేమో కొంపదీసి రోజూ యిక్కడే చదువుకోడు కదా?

అలా అయితే నా పని యిరకాటంలో పడ్డట్టే!

అతను చదువుకుంటున్న తీరునుబట్టి యిప్పుడిప్పుడే కదిలేట్టు లేడు. ఎంతసేపో నాకు ఈ మంచం కింద అజ్ఞాత వాసం?

చిరాగ్గా అతనివయిపే చూస్తూ పడుకున్న నాకు వున్నట్టుండి అతనిలో నాకు బాగా తెలిసిన పోలికలేవో కనపట్టం ప్రారంభించాయి.

ఎవరితను? ఎప్పుడో నాకు బాగా తెలిసిన వ్యక్తిలానే అనిపిస్తున్నాడే? ఆలోచించగా ఆలోచించగా చప్పున గుర్తుకొచ్చేసింది. సుధాకర్!

అవును. ఈ అబ్బాయి సుధాకరే! అప్పటిలో బొద్దుగా వుండేవాడు. ఇప్పుడు చిక్కి వుండటంవల్ల వెంటనే గుర్తించలేకపోయాను.

నా చిన్నతనంలో మా యింటి పక్కనే వుండేవాళ్ళు యితని కుటుంబం. నేనంటే ఎంతో ప్రేమ, అభిమానం చూపించేవాడు సుధాకర్. వాళ్ళమ్మ ఏది పెట్టినా నా కివ్వకుండా తినేవాడు కాదు. ఎన్నోసార్లు నా పరీక్ష ఫీజులు కట్టాడు. ఆకలితో చావకుండా ఎన్నోసార్లు వాళ్ళింటిలో అన్నం పెట్టించి కాపాడాడు. నాకన్నా రెండు మూడేళ్ళు చిన్నవాడే అయినా నాతోటివాడిలా స్నేహంగా వుండేవాడు. నాకెంతో యిష్టమైన చిన్నారి సుధాకరే యితను.

ఎంత పెద్దవాడయ్యాడు? చప్పున మంచం క్రింద నుంచి యివతలకి వచ్చి వాణ్ణి ప్రేమగా కౌగలించుకుని ఏడవాలనిపించేసింది.

కానీ ఆ ఉద్వేగాన్ని బలవంతాన అణచుకున్నాను. హఠాత్తుగా నన్ను చూస్తే వాడు బెదిరిపోయి అరవటం ఖాయం. అది నాకే ముప్పు. కాస్త నిదానంగా వ్యవహ

రించాలి నేను.

సుమారు ఓ రెండు గంటల తర్వాత సుధాకర్ పుస్త కాలు బల్లమీద పెట్టేసి. లేచి బైటికి వెళ్ళిపోయాడు. తిరిగి తలుపు తాళం వేసేసిన చప్పుడయ్యింది.

నేను బిగబట్టిన కీళ్ళు సవరదీసుకుంటూ బైటకి పాకి వచ్చాను. వాడి నోటు పుస్తకం చూడగానే నాకో ఐడియా వచ్చింది. వాడు రాసుకుంటూ ఆపేసిన చోట యిలా రాశాను.

"సుధాకర్! నేను ప్రసన్నకుమార్‌ని! ఎనిమిదేళ్ళ క్రితం నీ నేస్తాన్ని! ప్రస్తుతం ఈ యింట్లోనే దాక్కుని వున్నాను. ఈ ఉత్తరం చదవగానే నువ్వు ఖంగారు పడకు. నువ్వు యిది చదివిన తర్వాత నేను నీకు కని పిస్తాను"

నా ఊహ సరయినదే. సాయంత్రం మళ్ళీ చదువు కోవటానికి వచ్చిన సుధాకర్ నోటుబుక్కులో నేను రాసింది చదివి ఆశ్చర్యంగాను, సంభ్రమంగాను ఇల్లంతా కలియజూస్తూ,

"ప్రసన్నా" అన్నాడు బెరుగ్గా.

ఆ గదిలోనే పుస్తకాల రేక్ వెనుకాల నుంచున్న నేను వాడికి వినపడేట్టుగా "ముందు గది తలుపు వేసెయ్యి సుధాకర్. ఎవరయినా చూస్తారు" అన్నాను మెల్లగా.

వాడు లేచి గది తలుపులు వేసేశాడు. నేను రేక్ వెనకనుండి యివతలకి వచ్చాను. పెరిగిన గెడ్డంతో, మొరటుగా, భారీగా వున్న శరీరంతో స్థంభంలా తనెదుటకి వచ్చిన నన్ను సుధాకర్ కళ్ళు పెద్దవిచేసి విభ్రమంగా చూశాడు.

"ఒరేయ్ సుధా; ఎలా వున్నావురా? నన్ను గుర్తుపట్ట

లేకపోతున్నావా? అంత మారిపోయానా?'' అన్నాను తడిసిన కళ్ళతో, చిరునవ్వుతో మరుక్షణం సుధాకర్ ఒక్క ఉదుటున వచ్చి నన్ను చుట్టేశాడు.

"ప్రసన్నా! నువ్వేనా నిజంగా? ఎంత మారిపోయావు? ఇన్నాళ్ళూ ఎక్కడున్నావ్? ఏం చేస్తున్నావ్?'' ప్రశ్నల వర్షంతో ఉక్కిరి బిక్కిరి చేశాడు.

"ఉష్ నెమ్మది! రా, అలా కూర్చుందాం అంతా చెబుతాను'' అంటూ వాణ్ణి మధ్యగదిలోకి తీసుకు వెళ్ళాను.

3

నాదే దురదృష్ట జీవితం అనుకుంటే సుధాకర్‌ది మరీ దౌర్భాగ్య జీవితం అయిందని తెలిసింది నాకు, వాడు చెప్పిన కథ వినగానే.

గారాబంగా పెంచుకున్న వాడి తల్లీతండ్రీ ఏడేళ్ళక్రితం, ఇద్దరూ ఒకేసారి రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. దిక్కులేని పక్షిలాగా పినతల్లి పంచన చేరాడు. ఆవిడ పెట్టే కష్టాలన్నీ భరిస్తూ, అడ్డమయిన చాకిరీ చేస్తూ బి.ఏ. దాకా నెట్టుకొచ్చాడు. ఈ చదువు అయి ఏదయినా ఉద్యోగం దొరికితే కష్టాలు గట్టెక్కుతాయన్న ఆశతో వున్నాడు.

"నాలాంటివాళ్ళ కష్టాలు చూసి చలించిపోయే నీకు స్వయంగా అలాంటి కష్టాలే ప్రాప్తించటం నిజంగా ఎంత శాపంరా సుధా'' అన్నాను బరువుగా.

"శాపం కాదురా పాపం. ఏనాడో చేసుకున్న పాపం. లేకపోతే ఏదో ఓలా బ్రతుకీడుస్తున్నవాణ్ణి నాకు గుండెజబ్బు కూడా దాపురించటం ఏమిటి చెప్పు?'' అన్నాడు సుధాకర్ బాధగా.

నేను అదిరిపడ్డాను. "ఏమిట్రా! గుండెజబ్బేమిటీ?''

అప్పుడు చెప్పాడు సుధాకర్. రెండేళ్ళనుంచీ వాడు గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. మరో నాలుగయిదు నెల్లలో ఆపరేషన్ చేయించుకోకపోతే ప్రాణానికే ప్రమాదం అన్నారట డాక్టర్లు. ఆపరేషన్‌కి ఐదువేలదాకా అవుతుందట. అన్నం పెట్టడమే దండగనుకునే వాడి పిన్ని ఐదువేలిస్తుందా?

సుధాకర్ ప్రాణాపాయంలో వున్నాడని తెలియగానే నేను కంపించిపోయాను.

"ఒరేయ్ యిక ఆలస్యం చెయ్యకు. రేపే వెళ్ళి ఈ వూళ్ళోనే వున్నాడు సులేమాన్ అని నా ఫ్రెండు. వాణ్ని కలుసుకో. వాడి దగ్గిర నా డబ్బు పదివేలదాకా వుంది. అది తీసుకో. వెంటనే ఆపరేషను చేయించుకో" అన్నాను ఆత్రుతగా.

సుధాకర్ తల ఎత్తి నావంక చూసి అదోలా నవ్వి అన్నాడు.

"క్షమించు ప్రసన్నా: అన్యాయార్జితంతో ప్రాణాలు నిలబెట్టుకోవాలని నాకులేదు."

నేను పిడుగుపడ్డట్టు చూశాను. "ఏమన్నావురా? నాది అన్యాయార్జితమా? నాకథంతా వినికూడా ఇంకా ఆ మాటే అంటున్నావా?"

"నువ్వుపడ్డ బాధలు నీ మార్గం మంచిదే అని నీకు బోధించవచ్చు. కానీ నా దృష్టికది మహాపాతకం అనే అనిపిస్తుందిరా. పోతేపోనీ వెధవప్రాణం. దానికోసం నేను నీడబ్బు మాత్రం ఖర్చుచేయటానికి యిష్టపడను. ఐయామ్ సారీ!" ఖచ్చితంగా అన్నాడు.

అమాయకంగా నాతో ఆడుకున్న ఆ సుధాకరేనా వీడు?

ఎంత హుందాగా, ఎంత వ్యక్తిత్వంతో ఆలోచిస్తున్నాడు? దీర్ఘంగా వాడికేసే చూస్తూ చాలాసేపు అలాగే వుండిపోయిన నేను తర్వాత అన్నాను.

"సరే. అన్యాయార్జితం కానట్లయితే నా డబ్బు తీసుకోవటానికి నీకు అభ్యంతరం వుండదన్నమాటేగా? అయితే న్యాయార్జితమే యిస్తాను నీకు"

"అంటే?" అన్నాడు సుధాకర్ ఆశ్చర్యంగా.

4

ముందు నేను చెప్పిన దానికి వాడు ససేమిరా ఒప్పుకోలేదు. వాణ్ని ఒప్పించడానికి మూడురోజులు పట్టింది నాకు.

"నీ అంతట నువ్వు పోలీసులకి లొంగిపోతే లొంగిపో. నాకేమీ అభ్యంతరంలేదు. కానీ నా చేత్తో నేను నిన్ను పట్టించి, పోలీసులిచ్చే బహుమతితో నా ప్రాణాలు కాపాడుకోనా? నో....నో... నెవ్వర్! నువ్వెంత దొంగవయినా, హంతకుడివయినా నువ్వు నా ప్రాణ స్నేహితుడివి కూడా! అంత ఘోరం నాచేత చేయించకు దయచేసి" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"ఇందులో ఘోరమేమీలేదు. నేను చేసిన నేరాలకి నాకెలాగూ శిక్ష పడటం న్యాయమే. అదేదో కాస్త నీకు కలిసివచ్చేట్టుగా నేను పోలీసులకి లొంగిపోతే నాకు తృప్తి. ఒరేయ్ సుధా! నామాట కాదనకురా ప్లీజ్! నీ ప్రాణాలు నీకు అక్కర్లేకపోయినా నాకు కావాలిరా! నువ్వు పదికాలాలపాటు చల్లగా వుండాలి" దీనంగా అర్థించాను.

నా ప్రయత్నం ఫలించింది. నా మనసు నొప్పించలేక, నాబాధ చూడలేక చివరికి నిస్సహాయంగా అంగీకరించాడు

సుధాకర్. వాడి చేత్తో వాడు నన్ను పోలీసులకి అప్పగిస్తున్నప్పుడు వాడి కళ్ళల్లో కనిపించిన వేదన వర్ణనాతీతం. ఒక మంచి చేస్తున్నాననీ, ఋణం తీర్చుకుంటున్నాననీ నాకుమాత్రం ఎంతో సంతృప్తిగా వుంది.

5

ఆ తర్వాత నన్ను వేరే జైలుకు మార్చారు. సుధాకర్ వివరాలేమీ తెలియలేదు. కానీ బహుమతి డబ్బుతో ఆపరేషన్ చేయించుకుని ఆరోగ్యంగానే వుండివుంటాడని ఆశపడ్డాను.

కానీ కొత్తగా వచ్చిన ఓ ఖైదీ చెప్పిన పిడుగులాంటి నిజం నన్ను దిగ్భ్రాంతుణ్ని చేసింది.

"ఆ సుధాకర్ బాబా? పాపం నెలక్రితమే గుండెజబ్బుతో పోయాడుగా? ఎవరో దొంగని పట్టిస్తే పోలీసోళ్లు ఏడు వేలు బహుమతికూడా ఇచ్చారంట. కానీ ఆ బాబు పింతల్లి మా పెద్దముండ. ఆ డబ్బంతా లాక్కుని, పాపం సుధాకరు బాబుని సావుదేవతకి నైవేజ్జం యెట్టేసింది. సీ.సీ. మనమే దొంగలమనుకుంటే మనకంటే యొదవబతుకు బతికే దొంగలు బైట యింకా సానామంది వున్నారన్నా."

అతడి మాటలు పూర్తికాకముందే కుప్పకూలిపోయాను. అమాయకంగా నవ్వుతూ సుధాకర్ నా కళ్ళలో కదులుతూ వుంటే బాధ ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చాను.

ఎంత దుర్మార్గమయిన దీ ప్రపంచం! సాటిమనిషి ప్రాణాలను స్వార్థానికి బలితీసుకునే ప్రపంచం!

ఇన్నాళ్ళూ ఈ ధనం ధనవంతుల్నే దుర్మార్గుల్ని చేస్తుందనుకునే వాణ్ని. కానీ యిప్పుడు తెలుస్తోంది. అంతస్తుతో

ప్రమేయం లేకుండా అది ఎవర్నయినా పిశాచాల్ని చెయ్య గలదని!

ఒక కాలు నరికితే మరో వందకాళ్ళు మొలిపించుకుని వికృత నాట్యం వేసే ఈ స్వార్ధ పిశాచిని నేను ఎన్నేళ్ళు శ్రమపడితే మాత్రం అంతం చేయగలను? విషవాయువు అలుముకున్న ఆకాశాన్ని కత్తితో శుభ్రం చెయ్యాలని భ్రమించిన వెఱ్ఱివాణ్ణి నేను! ప్రాణాలుతీసి, ధనాన్ని దోచేస్తే మనుషుల్లో స్వార్థం నశిస్తుందని ఆశించిన అవివేకిని! నావన్నీ భ్రమలని యిప్పుడు అర్థమవుతోంది.

ఈ సృష్టిలాగే స్వార్ధానికి కూడా ఆదీ, అంతమూ లేవు. అది అజరామరమైనది! ఈ సత్యం తెలుసుకోలేక అన్యాయ నిర్మూలన అనే పూనకంతో వూగిపోయి, తాము రగుల్చుకున్న ఆవేశంలో తామే ఆహుతయిపోయే నాలాంటి అభిశాపగ్రస్తు లెందరో ఈ లోకంలో!





క్యాంప్‌మీద ఊరుకెళ్ళి అప్పుడే తిరిగొచ్చిన దొరస్వామికి తమ ఇంటికి తాళంవేసి ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు.

అహల్య ఇంత పొద్దున్నే ఎక్కడికి వెళ్ళింది?

ఆ విషయమే కనుక్కోవడానికి పక్కింటిలో ఉంటున్న నారాయణ దగ్గరకు వెళ్ళాడు దొరస్వామి.

చేతిలో సూట్‌కేసుతో వస్తున్న దొరస్వామిని చూసి

పలకరింపుగా నవ్వి, "రండి. కాంప్‌నుంచేనా రావడం?" అన్నాడు నారాయణ.

అతని ప్రశ్నను పట్టించుకోకుండా, "అహల్య ఎక్కడకు వెళ్ళిందో కాస్త మీవాళ్ళని అడిగి చెబుతారా?" అనడిగాడు దొరస్వామి.

నారాయణ మొహంలో నవ్వు మాయమయింది.

"అదేమిటి, ఇంటిలో లేరా? రాత్రి కూడా ఇంటిలో ఉండగానే నేను చూశానే?" అన్నాడు.

ఆ మాటతో కంగారు మరింత ఎక్కువయింది దొరస్వామికి. రాత్రి ఇంటిలోనేవున్న అహల్య పొద్దున్నే ఎక్కడికి వెళ్ళివుంటుంది? తనకు తెలిసినంతవరకూ ఈ ఊళ్ళో ఆమెకు స్నేహితులు కూడా లేరే? మరి ఏమయినట్టు?

నారాయణ, దొరస్వామివంక అనుమానంగా చూస్తున్నాడు. ఆ చూపులనుంచి తప్పించుకుంటూ 'వస్తానండి' అని చెప్పి ఇంటికి తిరిగివచ్చాడు దొరస్వామి.

తనదగ్గరున్న డూప్లికేట్ కీతో తాళంతీసి లోపలికి వెళ్ళాడు. ఏమైనా లెటర్ రాసిపెట్టిందేమోనని ఇల్లంతా వెదికాడు. ఎక్కడా ఏమీలేదు. పైగా అహల్య చెప్పులు, బట్టలు ఎక్కడివక్కడే ఉన్నాయి. కానీ ఆమె జాడ మాత్రం లేదు.

ఇదంతా ఒక మిస్టరీలా అనిపించసాగింది దొరస్వామికి.

ఇంతలో ఇంటిముందు పోలీస్ జీప్ వచ్చి ఆగటంతో కంగారుగా బయటికి వచ్చాడు దొరస్వామి.

అహల్య ఇంట్లోంచి మాయమయిన సంగతి నారాయణ వల్ల అప్పుడే ఆ వీధిలోవారందరికీ తెలియడం, దొర

స్వామి ఇంటిముందు పోలీసు జీపువచ్చి ఆగడం చాలా మంధికి ఆసక్తిని రేకెత్తించాయి. దాంతో అందరూ ఇంటిలోనుంచి బయటికి వచ్చేసి వింతగా చూడసాగారు.

జీప్‌లోంచి దిగిన యస్. ఐ. దొరస్వామిపంక చూస్తూ "మీరేనా దొరస్వామి?" అనడిగాడు.

"అవును. నేనే" అన్నాడు దొరస్వామి యస్. ఐ. వంక అయోమయంగా చూస్తూ.

"మీ భార్యపేరు అహల్యేనా?"

"అవును."

"అయితే జీప్ ఎక్కండి."

"ఏమయింది? అహల్యకు ఏమయింది?" కంగారుగా అడిగాడు దొరస్వామి.

"ఆమె క్షేమంగానే ఉన్నారు. మిగతా విషయాలు స్టేషన్‌లో మాట్లాడుకోవచ్చు. మీరు ముందు పదండి" ఆజ్ఞాపిస్తున్నట్టు చెప్పాడు యస్. ఐ.

మారుమాటాడకుండా ఇంటికి తాళంవేసి, పోలీసు జీప్ ఎక్కాడు దొరస్వామి.

పోలీసు స్టేషన్‌లోకి అడుగు పెట్టేసరికి ఎదురుగా కుర్చీలో కూర్చున్న అహల్య కనిపించింది.

తనని చూడగానే సంతోషంతో ఆమె మొహం విప్పారుతుందనుకొన్నాడు దొరస్వామి. అయితే అత నెవరో తెలియదన్నట్టుగా చూసి తల తిప్పుకుంది అహల్య.

"మీరు రోజూ తననికొట్టి హింసిస్తున్నారనీ, పోలీసు రక్షణ కావాలనీ వచ్చారు అహల్యగారు. దానికి మీరేమి సంజాయిషీ యిస్తారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

అసలే అంతా అయోమయంగా ఉంది దొరస్వామికి. దానికితోడు ఇన్‌స్పెక్టర్ అలా ప్రశ్నించేసరికి మరింత

అయోమయంలోపడి భార్యవంక చూశాడు. అహల్య బుద్ధిగా తలవంచుకు కూర్చుంది.

"మీ రనేదేమిటో నా కర్థంకావడం లేదు. కాంప్‌మీద ఊళ్ళెళ్ళి ఇప్పుడే వస్తున్నాను. కావాలంటే మీరెవరన్నా ఎంక్వయిరీ చేసుకోవచ్చు" చెప్పాడు దొరస్వామి.

"కరెక్టే. మీరు కాంప్ వెళ్ళారని ఈమె కూడా చెప్పారు. మీరు ఈరోజు వస్తారని తెలిసి భయంతో పోలీస్ స్టేషనుకు వచ్చారు" అని చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"భయం ఎందుకూ? కొట్టి చంపేస్తాననా?" దొరస్వామికి తెలియకుండానే అతని కంఠంలో తీవ్రత తొంగి చూసింది.

తలూపాడు ఇన్‌స్పెక్టర్.

అహల్య కేమైనా పిచ్చి ఎక్కిందేమోనని అనుమానం కలిగి ఆమెవంక చూశాడు దొరస్వామి.

ఇనస్పెక్టర్ టేబుల్‌మీద వేలితోరాస్తూ తలవంచుకునే ఉంది అహల్య.

"మరి మీ సంజాయిషీ ఏమిటి!" అడిగాడు ఇనస్పెక్టర్.

ఒక్కక్షణం ఏం చెప్పాలో తోచలేదు దొరస్వామి. చెయ్యని నేరానికి సంజాయిషీ ఇచ్చుకోవాల్సిరావటం, తన భార్య కాకపోతే ఇంకేమిటి? అసలు అహల్యను గట్టిగా కోప్పడి ఎరుగడతను! మరి ఆమె అలా రిపోర్టు ఇవ్వడానికి కారణం ఏమిటి? ఎంత పొగరుమోతుతనం లేకపోతే ఇలా బరితెగించి ఒక్కతే పోలీస్ స్టేషన్‌కు వస్తుంది.

దొరస్వామి ఏం చెపుతాడా అని అతని మొహంలోకి చూస్తున్నాడు ఇనస్పెక్టర్.

అది గమనించి "ఓకే - ఇనస్పెక్టర్‌గారూ. తప్పు నాదే. ఇంకెప్పుడూ ఆమెను కొట్టను. ఇంకోసారి ఆమె రిపోర్టుచేస్తే నన్ను నేరస్థుడిగా పరిగణించవచ్చు. కావలిస్తే ఆ మేరకు కాగితం రాసి ఇస్తాను" అన్నాడు దొరస్వామి.

"అక్కర్లేదు లెండి. చూడండి, మీలాంటి చదువుకున్నవారే కట్టుకున్న భార్యను కొడుతుంటే ఇక చదువులేనివాళ్ళను ఏమనాలి. అసలు భార్యను కొట్టేవాళ్ళు నా దృష్టిలో ఉత్తవోగ్స్. ఈ నిజాన్ని గ్రహించి ఇకనుంచయినా బుద్ధిగా మెలగుతారని ఆశిస్తున్నాను" సన్న సన్నగా ఇనస్పెక్టర్ చీవాట్లు పెడుతుంటే తలవంచుకుని విన్నాడు దొరస్వామి.

అంతా అయ్యాక భార్యని తీసుకుని బయటకు వచ్చాడు దొరస్వామి.

స్టేషన్ దాటి పదడుగులు వేశాక అంతవరకూ అణచుకున్న కోపాన్నంతా వెళ్ళగక్కుతూ "నిన్ను ఎప్పుడన్నా కొట్టానా అహల్యా?" అనడిగాడు దొరస్వామి.

"ఊహు" అడ్డంగా తలూపింది అహల్య.

"మరయితే పోలీసుస్టేషన్‌కెందుకు తగలడ్డావ్? నా మీద కంప్లెయింట్ ఎందుకిచ్చావ్?" అది రోడ్డన్న సంగతి మరిచిపోయి బిగ్గరగా అరిచాడు దొరస్వామి.

ఆ దారిన పోయేవాళ్ళు ఆగి, అతనివంకా, ఆమె వంకా వింతగా చూశారు. దాంతో తన తప్పు తెలుసుకున్న దొరస్వామి ఇంటికి వచ్చేదాకా నోరెత్తలేదు.

ఇంటితాళం తీసి లోపలికి అడుగుపెట్టగానే, అహల్యను మళ్ళీ రెట్టించి అడిగాడు.

"మీరు నన్ను కొట్టినా, నరికినాసరే ఆ విషయం మాత్రం చెప్పను" అనేసి గదిలోకివెళ్ళి లోపల్నుంచి తలుపేసుకుంది అహల్య.

నివ్వెరపోయి అలా చూస్తుండిపోయాడు దొరస్వామి. అసలు ఈమె తన భార్య అహల్యేనా? లేక మరెవరన్నానా? అహల్యగొంతులా లేదు ఈమెది. అదీగాక ఈమె కట్టుకున్న చీర కూడా అనుమానం కలిగిస్తూంది. అహల్యకు ఇలాంటి చీర అసలు లేనేలేదు.

ఈమె నకిలీ అహల్య అయితే అసలు అహల్య ఏమయింది? అహల్యను మాయంచేసి ఆమె స్థానంలో అహల్య పోలికలున్న ఈ యువతి నాటక మాడటం లేదు కదా? ఇలా చేయడంవల్ల ఈమెకేం లాభం? ఈమె వెనుక మరేదైనా ముఠావున్నదా?

ఆలోచనలతో తల పగిలిపోతోంది దొరస్వామికి. తలుపుల బద్దలుకొట్టి ఆమెని బయటకు ఈడ్చుకొచ్చి ఎవరు నువ్వు? అహల్య ఏమయింది? అని అడగాలన్నంత ఆవేశం వచ్చినా తమాయించుకున్నాడు దొరస్వామి.

తను తొందరపడకూడదు. తొందరపడితే వాళ్ళు ఏం చెయ్యదలుచుకున్నదీ తెలియదు. అదీగాక దానివల్ల అహల్యకు ప్రాణాపాయం కలగవచ్చు. అందుకే తను తొందరపడకూడదు.

ఏదో ఆలోచనకి వచ్చినవాడిలా తల పంకించి, "అహల్యా! నేనలా బయటకు వెళ్ళొస్తాను. తలుపేసుకో" అని సమాధానం కోసం ఎదురు చూడకుండా ఇంట్లోంచి బయటపడ్డాడు దొరస్వామి. రెండు నిముషాల తరువాత తన ఇంటి తలుపులు మూతపడ్డాయని వెనక్కి తిరిగి చూడకుండానే గ్రహించాడు దొరస్వామి.

ఆలోచిస్తూ నడవసాగాడు.

అసలు ఇదంతా ఎవరు చేస్తున్నారు? దేనికోసం చేస్తున్నారు? ఏమిటీ మిస్టరీ? తనొక్కడే భేదించగలడా ఈ మిస్టరీని? ఎవరన్నా సాయం చేస్తే బావుణ్ణు.

అకస్మాత్తుగా డిటెక్టివ్ వినాయకరావు మెదిలాడు అతని మనసులో.

అవును. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయనొక్కడే తననీ గండంనుంచి బయట పడేయగలడు.

మరో ఆలోచన లేకుండా అప్పుడే వచ్చిన 9 వ నెంబరు బస్ఎక్కి సంజీవరెడ్డినగర్‌లో ఉంటున్న డిటెక్టివ్ వినాయకరావు ఇంటికి బయలుదేరాడు దొరస్వామి.

2

దొరస్వామి చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు డిటెక్టివ్ వినాయకరావు.

"మీరు నన్ను కలుసుకుంటున్నట్లు ఎవరికైనా తెలుసా?" అనడిగాడు వినాయకరావు.

"ఊహూ....ఎవరికీ తెలీదు." చెప్పాడు దొరస్వామి.

"అయితే రాత్రి 8 గంటలకు మీ బంధువులా మీ ఇంటికి వస్తాను. నేను డిటెక్టివ్‌నని ఎవరికీ తెలియనివ్వకండి. నేను మీ బంధువునో కానో నకిలీ అహల్యకు ఎలాగు తెలీదు" అన్నాడు వినాయకరావు.

"మీ ఇష్టం. మీరు ఎలా చేయమంటే అలా చేస్తాను. ఈ నకిలీ అహల్య బారినుండి నన్ను కాపాడి, అసలు అహల్య ఎక్కడుందో వెతికే పూచీ మీది" అన్నాడు దొరస్వామి.

"ఆ విషయం నాకు వదిలేసి మీరిక నిశ్చింతగా ఉండండి" అని చెప్పాడు వినాయకరావు.

అతనికి మరోసారి కృతజ్ఞతలు చెప్పుకుని వెళ్ళిపోయాడు ధొరస్వామి.

ఆ రోజు సాయంత్రం పీట్‌గా తయారయి చేతిలో ఒక బ్రీఫ్ కేసుతో దొరస్వామి ఇంటికి వెళ్ళాడు వినాయక రావు.

"ఓహో ఎన్నాళ్ళకి, ఎన్నాళ్ళకి. ఇప్పటికి మా మీద దయ కలిగిందా?" అంటూ ఆదరంగా దగ్గర బంధువుని ఆహ్వానించినట్టుగా ఆహ్వానించాడు దొరస్వామి.

"అదేం లేదు. చిన్న పనుండీ ఈ ఊరు వచ్చాను" అని చెప్పాడు వినాయకరావు.

"అంతేగానీ మమ్మల్ని చూడటానికి రాలేదన్న మాట" అని దొరస్వామి అంటుండగా లోపల్నుంచి అహల్య వచ్చింది.

"అహల్యా. ఇతనెవరో గుర్తున్నాడా?" అనడిగాడు.

వినాయకరావు వంక పరీక్షగా చూస్తూ గుర్తు తెచ్చు కోవటానికి ప్రయత్నించిందామె. వినాయకరావు కూడా ఆమె వంక చూడసాగాడు.

"ఉహూ గుర్తు రావటం లేదండి" అంది అహల్య.

"అదేమిటి మన పెళ్ళి అయిన తర్వాత రెండు మూడు సార్లు కూడా వచ్చాడు. రామకృష్ణ నీకు గుర్తులేకపోవడ మేమిటి?" అని దొరస్వామి అంటే.

"చూసి చాలా కాలం అయింది కదా మరిచిపోయి ఉంటారు" వెంటనే అన్నాడు వినాయకరావు.

"సరే సరే. చాలా కాలం తర్వాత వచ్చాడు. భోజనం ఏర్పాటు అవీ చూడు."

వినాయకరావు వంక మరోసారి పరీక్షగా చూస్తూ లోపలి కెళ్ళింది అహల్య.

కళ్ళతోనే ఏవో సైగలు చేసుకున్నారు వినాయకరావు దొరస్వామి.

ఓ అరగంట తర్వాత వంట సిద్ధంచేసి హాలులోకి అహల్య వచ్చేసరికి వినాయకరావు, దొరస్వామి కబుర్లలో మునిగి ఉన్నారు. తనూ వాళ్ళ పక్కనచేరి ఆ కబుర్లను వినసాగింది.

కొంతసేపయ్యాక బాత్‌రూమ్‌కు వెళ్ళి వస్తానంటూ లేచాడు వినాయకరావు. అతను వెళ్ళిన రెండు నిముషాల తర్వాత అహల్య కూడా లేచి అటు వెళ్ళబోయింది.

దొరస్వామి చప్పున ఆమె చెయ్యి పట్టుకుని ఆపాడు.

"వదలండి. చెయ్యి దేనికి పట్టుకున్నారు?" అంది అహల్య.

"రామకృష్ణ వచ్చిన దగ్గర్నుంచీ నిన్ను గమనిస్తున్నాను. నాకంటే అందగాడైన మాత్రాన అతనివంక అంత పరవశంగా చూడాలా?" అనడిగాడు దొరస్వామి.

"ఛీ. మొగుడానికి మొగవాడిననిపించుకున్నారు" అని విసుక్కుని "నేను వెళ్ళేది బాత్‌రూమ్‌వేపు కాదు, వంటగది వేపు. వెళ్ళనీయండి" అంది అహల్య.

అయినా దొరస్వామి అహల్య చేతిని వదల్లేదు. దూరం నుంచి వినాయకరావు రావడం చూసి చెయ్యి వదిలేశాడు.

మరి కాసేపటి తర్వాత భోజనాల ముందు కూర్చున్నారు ముగ్గురు.

అహల్య కంచంలోకి వడ్డించబోతున్న టమోటకూరను చూసి వినాయకరావు చెయ్యి అడ్డుపెట్టి.

"వద్దు, వద్దు వేయమాకండి. నేను టమోట కూర తిననన్న విషయం మరిచేపోయారా?" అన్నాడు.

అహల్య అతని మొహంలోకి ఒకసారి చూసింది. తరువాత ఏమనుకుందో ఏమో కొబ్బరి పచ్చడి వేసింది. దొరస్వామి మాత్రం టమోట కూర బావుందంటూ రెండు సార్లు వేయించుకున్నాడు.

భోజనాలయ్యాక వినాయకరావుకు అవతల గదిలో మంచం వేయించాడు దొరస్వామి.

"నాకు నిద్ర ముంచుకొస్తుందోయ్ రామకృష్ణా మిగతా విషయాలు రేపు మాట్లాడుకుందాం" అని చెప్పేసి వెళ్ళి పడుకున్నాడు దొరస్వామి.

గది తలుపులు బిడాయించి. లైటు ఆర్పేసి, చీకటిలో అలాగే మంచంమీద కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు వినాయకరావు.

పావుగంట గడిచింది.

ఉన్నట్టుండి లేచాడు వినాయకరావు. శబ్దం లేకుండా తలుపు తీసుకుని బయటకువచ్చి దొరస్వామి, అహల్య పడుకున్న గదివేపు నడిచాడు.

తను బాత్‌రూమ్‌కని చెప్పి వంటగదిలోకి వెళ్ళి మత్తు మందు కలిపిన టమోట కూర తిని వాళ్ళిద్దరూ గాఢ నిద్రలో మునిగివుండటం చూసి చిన్నగా నవ్వుకున్నాడు వినాయకరావు.

ఆ తరువాత గదిలో అహల్యకు సంబంధించిన వస్తువు లన్నింటినీ తాపీగా వెదకడం ప్రారంభించాడు. ఎంత వెదికినా ఏమీ దొరకకపోవడంతో అక్కడివి అక్కడ సర్దేసి ఏమీ ఎరగనట్టు వెళ్ళి గదిలో పడుకున్నాడు.

3

తెల్లారటంతో నిద్రలేచి గది బయటకు వచ్చాడు వినాయకరావు. దొరస్వామి అప్పటికే లేచి, హాల్లో

కూర్చుని పేపరు చదువుతున్నాడు.

వినాయకరావుని చూడటంతో "అహల్యా, రామకృష్ణ కూడా లేచాడు. కాఫీ తీసుకురా" అన్నాడు.

కాఫీ తాగి, స్నానం అదీ ముగించుకుని "ఇక నేను వెడతాను" అన్నాడు వినాయకరావు.

"అదేమిటి? రాత్రేగా వచ్చింది. అప్పుడే ఎక్కడికి?" అడిగాడు దొరస్వామి.

"వెళ్ళాలి. పనుంది. మళ్ళీ వస్తాను" అని అహల్యతో కూడా చెప్పి బయటకు వచ్చాడు.

అతన్ని సాగనంపడానికి వీధి చివరవరకూ వచ్చి "సార్ నాభార్య సంగతేమిటి?" అనడిగాడు దొరస్వామి.

"ఇంకా ఏమీ తెలీలేదు. మరో రెండు రోజులలో అసలు విషయం బయటపడుతుందని ఆశిద్దాం" అన్నాడు.

"ఈలోపల నేను చేయవలసిన పనులు ఏమన్నా ఉన్నాయా?"

"అంటే?"

"అదే....నకిలీ అహల్యను ఓ కంట కనిపెట్టి ఉండమంటారా?"

"అవసరం లేదు"

వినాయకరావు వెళ్ళిపోయాక దొరస్వామి ఇంటికి తిరిగి వచ్చాడు. అహల్య ఇంటిలో లేకపోవడం చూసి అనుమానంతో పెరటిలోకి వెళ్ళాడు.

అహల్య బావిగట్టుమీదకు ఎక్కి దొరస్వామి చూస్తుండగానే బావిలోకి దూకింది.

దొరస్వామి కేకలువేస్తూ బావివేపు పరిగెట్టాడు. అతని కేకలకు ఇరుగు పొరుగువాళ్ళు కూడా పరిగెత్తుకొచ్చారు. అందరూ కలిసి అహల్యను బయటికి తీశారు. ఆమె అప్ప

టికి పెద్దగా నీళ్ళు త్రాగలేదు.

దొరస్వామికి జాగ్రత్తలు చెబుతూ అందరూ వెళ్ళిపో యారు. వాళ్ళు అటు వెళ్ళగానే "నన్నెందు కిలా సాధి స్తున్నావు? అసలు ఎవరు నువ్వు?" అనడిగాడు దొర స్వామి.

"నేను మీ అహల్యనేనండి. కావలిస్తే చూడండి" అంటూ జాకెట్టు విప్పింది. ఆమె కుడి రొమ్ముమీద పెసరబద్దంత పుట్టుమచ్చ ఉంది. తన భార్యకూ అలాంటి పుట్టుమచ్చ ఉందని దొరస్వామికి తెలుసు.

అయినా అనుమానం తీరక తమ పెళ్ళినాటి ముచ్చట్లు, శోభనం గదిలో మాట్లాడుకున్న మాటల గురించి అడి గాడు. అన్నీ కరెక్ట్‌గా చెప్పింది అహల్య.

దొరస్వామి ఇంకా తనవంక అనుమానంగా చూస్తుండ టంతో - "ఇన్ని చెప్పినా మీకు నమ్మకం కలగడంలేదా, మన చుట్టాల పేర్లన్నీ చెప్పమంటారా?" అని ఆ పేర్లు చెప్పి "రామకృష్ణ అనే వ్యక్తి మన చుట్టాలలో ఎవరూ లేరు. బహుశా నామీద అపనమ్మకంతో మీరు తెచ్చిన డిటెక్టివ్ అయి ఉంటాడతను. ఇప్పుడు చెప్పండి నేను మీ భార్య అహల్యని అవునా కాదా?" సూటిగా చూస్తూ అడిగింది.

"అహల్యవే....కాని...." ఏదో అనబోయాడు దొర స్వామి.

"కానీలేదు, గీనీలేదు. ముందు ఆ డిటెక్టివ్ దగ్గరకు వెళ్ళి ఈ విషయం చెప్పిరండి. స్వంత భార్యపై డిటెక్టివ్ నిఘా ఉంచడానికి సిగ్గులేకపోతే సరి" అహల్య సన్న సన్నగా చీవాట్లు పెడుతుంటే దొరస్వామికి వినాయకరావు దగ్గరికి బయలుదేరక తప్పలేదు.

4

వినాయకరావు ఆఫీసులోకి అడుగుపెడుతూనే దొర స్వామి తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు.

అక్కడ....

వినాయకరావు ఎదురుగా మరో అహల్య కూర్చుని ఉంది. భుజం చుట్టూ పమిట కప్పుకుని ఏదో మాట్లాడు తోంది. దొరస్వామిని చూడగానే మాటలు ఆపేసి ముసి ముసిగా నవ్వి తలదించుకుంది. ఆమెను చూడగానే నిజ మైన అహల్య ఆమె అనిపించసాగింది దొరస్వామికి.

"సమయానికి వచ్చారు, కూర్చోండి" ఆహ్వానించాడు వినాయకరావు.

దొరస్వామి రెప్పవాల్చకుండా ఆమెవంక అలాగే చూస్తున్నాడు. ఆమె కూడా అతనివంక ఆరాధనగా చూస్తూంది.

తానక్కడ ఉన్నట్టు గుర్తుచేసేందుకు వినాయకరావు చిన్నగా దగ్గాడు. దాంతో వాళ్ళిద్దరూ ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చారు.

"మీ భార్య ఎవరో తేల్చుకోలేని సందిగ్ధంలో వున్నారు కదూ మీరు" అని అహల్యవేపు తిరిగి "మీవారు వూరికెళ్ళాక ఏం జరిగిందో చెప్పండి" అన్నాడు వినాయక రావు.

"ఆయన వూరు వెళ్ళగానే మా స్నేహితురాలు కనక సుందరి మా ఇంటికి వచ్చింది. కాసేపు కూర్చున్నాక సినిమాకు వెడదామని గొడవచేస్తే ఆమెవెంట బయలు దేరాను. అయితే మేమెక్కిన కారు థియేటర్ ముందు కాకుండా ఏదో ఇంటిముందు ఆగింది. అది తన ఇల్లనీ, ఒకసారి లోపలకు వెళ్ళివద్దామని అంటే లోపలకు

వేళ్ళాను.

మా వెనుక ఆ ఇంటి తలుపులు మూసుకున్నాయి. లోపల నలుగురు ధృఢకాయులు, అచ్చం నాలాగే ఉన్న ఒక యువతి ఉన్నారు. ఆ యువతి కేదో చెప్పి కనకసుందరి వెనుక పంపించారు.

నాకు రివాల్వర్ చూపించి "నాలుగురోజులు బుద్ధిగా మా ఆధీనంలో వుండు. నీమీద ఈగకూడా వాలనివ్వం. కాని పిచ్చివేషాలు వేస్తే మాత్రం పిట్టను కాల్చినట్టు కాల్చి వేస్తాం" అని బెదిరించారు.

వాళ్ళ మాటలనుబట్టి నా కర్థమయిందేమంటే నా స్థానములో మరో యువతిని మా ఇంటికి పంపించి, ఆయన డిఫెన్సులో పనిచేస్తున్నారు కాబట్టి డిఫెన్సు రహస్యాలు తెలుసుకోవాలని...."

ఆమె మాటలు పూర్తవకుండానే పకపక నవ్వడం మొదలుపెట్టాడు వినాయకరావు. అతనెందుకు నవ్వుతున్నాడో ఆమెకీ, దొరస్వామికీ అర్థంకాలేదు.

ఉన్నట్టుండి నవ్వడం ఆపి, "మిస్ కనకసుందరీ! చాలా బాగా నటిస్తున్నావు. నీ నటనకు నా జోహార్లు!" అన్నాడు వినాయకరావు.

"వినాయకరావుగారూ.... నేను...." అంటూ ఏదో చెప్పబోయింది కనకసుందరి.

"నువ్వెవరో నాకు బాగా తెలుసు. కాసేపు కదలకుండా కూర్చో" అన్నాడు.

కనకసుందరి అతని మాట లక్ష్యపెట్టకుండా లేచి నిలబడి, హాండ్‌బాగ్‌లో చెయ్యి పెట్టబోయింది.

వినాయకరావు అది గమనించి ఆమె చేతిమీద గట్టిగా కొట్టాడు.

కనకసుందరి కేకపెడుతూ కుర్చీలో పడిపోయింది. హాండ్‌బాగ్ ఎగిరి అంతదూరంలో పడింది.

సరిగ్గా అదే సమయంలో ఎస్.ఐ. ఏడుకొండలు తన బృందంతో లోపలికి అడుగుపెట్టాడు. అతను వచ్చే టప్పుడు దొరస్వామి ఇంటికివెళ్ళి అహల్యను తీసుకు వచ్చాడు. వారి వెనుక నలుగురు గూండాలు చేతులకు బేడీలతో తలవంచుకు నిలుచున్నారు.

"రండి ఎస్.ఐ.గారూ. ఈ మాయలాడిని కూడా అరెస్ట్ చేయండి" అన్నాడు. ఏడుకొండలు సైగతో కానిస్టేబుల్స్ కనకసుందరి చేతికి బేడీలు వేశారు.

దొరస్వామికి అంతా అయోమయంగా వుంది. తన భార్య అనుకుంటున్న ఆమెని మాయలాడి అంటున్నాడు వినాయకరావు. ఈ వ్యవహారం అంతా చూస్తుంటే తనకి పిచ్చి ఎక్కేలా వుంది—అనుకున్నాడు దొరస్వామి.

అతని మనసు గ్రహించినట్లుగా చిన్నగానవ్వి, "వర్రీ అవకండి. ఈమే మీ అసలు శ్రీమతి. మీద్వారా డిఫెన్సు కాగితాలు కాజెయ్యడానికి వాళ్ళు ఈ నాటకమంతా ఆడారు" అని, అహల్య వేపు తిరిగి "ఆరోజు ఏం జరిగిందో చెప్పమ్మా" అని అడిగాడు వినాయకరావు.

"ఆరోజు తెల్లవారకుండానే కనకసుందరి దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. ఒకసారి అర్జెంటుగా రమ్మంటే ఏమి అయిందోనని కంగారుపడుతూ వాళ్ళింటికి వెళ్ళాను. అక్కడ కనకసుందరే కాకుండా మరో నలుగురయిదుగురు ఉన్నారు. వాళ్ళు రివాల్వర్ చూపించి, నన్ను పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి మావారిమీద ఓ కంప్లయింట్ ఇవ్వమన్నారు. అలా యివ్వకపోతే అక్కడే నన్ను చంపేస్తామని బెదిరిం

వారు.

కంప్లయింట్ ఇచ్చాక మావారు నన్ను యింటికి తీసు కెళ్ళిన తరువాత మూడురోజులు పెడసరంగా ప్రవర్తించ మని ఆజ్ఞాపించారు. తాము చెప్పేవాటిల్లో ఏది చేయక పోయినా నా ప్రాణాలే కాకుండా ఆయన ప్రాణాలుకూడా తీస్తామని హెచ్చరించారు. మా దగ్గరనుంచి వాళ్ళు కోరు కునేది ఏమీ లేదనీ, కేవలం మూడురోజులు మాత్రం నేను అహల్యనేనా అనే అనుమానం కలిగేలా ప్రవర్తించా లని చెప్పారు'' అని చెప్పి ఆగింది అహల్య.

మళ్ళీ తన భార్య అసలు గొంతు వినగలుగుతున్నం దుకు దొరస్వామికి ఆనందంగానే వున్నా దుండగుల పన్నాగం ఏమిటో అతనికి అంతుబట్టలేదు.

ఆ విషయమే అడగబోతుంటే వినాయకరావు కలగ చేసుకుని చెప్పాడు.

"మీ భార్య ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చి, ఆమె మీద మీకు అనుమానం కలిగేలా చేసి. తరువాత ఆమె స్థానంలో నకిలీ అహల్యను ప్రవేశపెట్టాలన్నది వాళ్ళ ప్లాను'' అని చెప్పి సిగరెట్ వెలిగించాడు వినాయకరావు.

"సార్. నాకంతా అయోమయంగా వుంది. దయచేసి కాస్త వివరంగా చెప్పండి'' అని రిక్వెస్ట్ చేశాడు దొర స్వామి.

వినాయకరావు నవ్వి, చెప్పడం ప్రారంభించాడు:

"మీరు నా సహాయంకోసం వచ్చి, విషయం వివరించ గానే నాకో అనుమానం వచ్చింది. నిజంగా పరాయి ఆడది మీ భార్యలా నటించడానికి వస్తే, ఆ పాత్రలో జీవించ డానికి మీ భార్య వాడే చీరలూ, ఆమెలాగే మాటలాడటం చేసేది. కానీ ఈమె ఆ దిలోనే అనుమానం కలిగించేలా

ప్రవర్తించడం చూసిన తరువాత ఎవరో కావాలనే మీ భార్యపై మీకు అనుమానం కలిగించడానికి ప్రయత్నిస్తు న్నారనిపించింది.

అందుకే మీ ఇంటికి వచ్చి, నేను డిటెక్టివ్‌నని మీ భార్యకు అనుమానం కలిగేలా ప్రవర్తించాను. ఆమె నకిలీ మనిషయితే ఏదో టైంలో నా గురించి తన మనుష లకు ఫోన్ చేస్తుంది. మీ ఇంటినుంచి ఎవరికి ఫోన్‌కాల్ వెళ్ళినా నోట్ చేసి ఉంచవలసిందిగా పోలీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా టెలిఫోన్ ఎక్స్చేంజికి రిక్విజిషన్ పంపాను.

నేను డిటెక్టివ్‌నని ఆమె ఊహించినా ఎవరికీ ఫోన్ చేయలేదు. ఇక నేను మీ ఇంట్లోంచి బయటకు రాగానే ఒక వ్యక్తి నన్ను చూసి పరుగు తీయటం ప్రారంభించాడు. నేనతడ్ని అనుమానించాలని అతని ప్లానై వుంటుంది. అలాగే చేశాను. ఒక ఇంటిలో దూరాడా వ్యక్తి.

ఆ ఇంటిలోకి వెళ్ళిన నాకు అహల్య వేషంలో స్తంభా నికి కట్టివేసున్న కనకసుందరి, ఆమె ప్రక్కనే నలుగురు దృఢకాయులు కనిపించారు. నన్ను చూడగానే నామీదకు దూకారు వాళ్ళు. కొంచెంసేపు మా మధ్య ముష్టియుద్ధం జరిగిన తర్వాత ఆమెను వదిలేసి పారిపోయారు.

ఆమె కట్లు వూడదీసి యింటికి తీసుకువచ్చాను. ఎప్పు డైతే ఇంకో అహల్యను చూశానో అప్పుడే దుండగుల నాటకం నాకర్థమైంది. వాళ్ళు కావాలనే ఆమెను అక్కడ వదిలేసి పారిపోయారు. ఆ తరువాత ఏం చెయ్యబోతారో కూడా నేను ఊహించాను.

నకిలీ అహల్య మనకి దొరకడంతో ఆమె అసలు అహల్య అనే భావన కలిగించి, అసలు అహల్యను మాయంచేసి, నకిలీ దవటంవల్ల పారిపోయిందనే భావన

కలిగిస్తారనిపించింది. వెంటనే పోలీసులకు ఫోన్ చేసి 'మీ ఇంటిదగ్గర కాపు కాయమని చెప్పాను. సరిగ్గా అనుకున్నట్లు పిట్టలు వలలో పడ్డాయి'' అని చెప్పడం ముగించాడు వినాయకరావు.

దొరస్వామి, అహల్య కళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి. వినాయకరావుతో కరచాలనం చేసి ''మెనీ మెనీ థాంక్స్ సార్!'' అన్నాడు దొరస్వామి కృతజ్ఞతవల్ల పూడుకు పోయిన కంఠంతో.

''ఇంత చేసినా ఏమి ఆశించి దుండగులు యీ నాటకం ఆడుతున్నారో నాకు ముందు తెలియలేదు. డిపెన్స్ కాగితాల కోసమే అలా చేస్తున్నారని కనకసుందరి చెప్పడంతో అసలు విషయం బయటపడింది. అందుకే ఆమెను మాట్లాడించాను. అని చెప్పాడు వినాయకరావు ' గంభీర స్వరంతో. □

[ఒక ఆంగ్ల రచన ఆధారంగా]

సింగిల్ విండోస్!



రాత్రి తొమ్మిదిన్నరయింది.

అంతవరకూ కుడుతూన్న జోళ్ళ జతను పక్కన పెట్టి, బడ్డీ మూయడానికి సిద్ధమయ్యాడు ఓబులేశు.

ఆ సమయంలో అతని జోళ్ళ బడ్డీలోకి ఓ ఆగంతకుడు అడుగుపెట్టాడు.

వదులుగా వున్న తెల్లటి దుస్తులలో వుందా లేదా అనిపించేటంత సన్నగా వుందతని పర్సనాలిటీ! కనుగుడ్లు బాగా లోతుకు పీక్కుపోయి వున్నాయి. చెంపలు రక్తం లేనట్టు తెల్లగా పాలిపోయి వున్నాయి. ముగ్గుబుట్టలాంటి తల వెంట్రుకలు వెండితీగెల్లా మెరుస్తున్నాయి. చేతి

గోళ్ళు, కాలిగోళ్ళు అంగుళం మేరకు పెరిగివున్నాయి.

"ఏం కావాలి?" అడిగాడు ఓబులేశు.

"బూట్లు కుట్టాలి" చెప్పాడా ఆగంతకుడు.

ఆ మాట అంటున్నప్పుడు అతని గొంతు గరగర లాడింది.

ఓబులేశు ఆ ఆగంతకుడిని చిత్రంగా చూశాడు.

అతని రూపం, మాటతీరు ఓబులేశుకి కొంత భయం కూడా కలిగించక పోలేదు. అది ఓ క్షణ కాలం మాత్రమే.

"కుట్టడానికి వంద రూపాయ లవుద్ది. ముందు అడ్వాన్స్ యాభై రూపాయ లివ్వాలి" చెప్పాడు ఓబులేశు.

"ఇదుగో అడ్వాన్స్ యాభై! బూటు బాగా కుట్టాలి" జేబులోంచి యాభై రూపాయల నోటుతీసి అందించాడా శాల్తీ.

"నాను కుట్టావంటే మల్లీ ఏడాద్దాకా అసలు రిపేరేరాదు" ఆ యాభై రూపాయల నోటు అందుకుంటూ గర్వంగా చెప్పాడు ఓబులేశు.

పక్కనే వున్న పెద్ద అట్ట తీసుకుని, దానిమీద ఆ వ్యక్తికాళ్ళకి అది కొలిచి, పెన్సిల్‌తో మార్క్ చేసుకున్నాడు.

"ఎప్పు డిస్తావు బూట్లు?...." అడిగా డా ఆగంతకుడు.

"ఎల్లుండి యిదే టయానికి రండి. మీ బూట్లు రడీ సేస్తాను" చెప్పాడు ఓబులేశు.

"సరే! నేను ఎల్లుండి వస్తాను" అని చెప్పి, రివట లాంటి ఆ ఆకారం గిరుక్కున వెనుతిరిగింది.

పరుగులాంటి నడకతో ముందుకు అడుగులు తీసి

చిక్కటి చీకటిలో కలిసిపోయింది.

గాలికంటే వేగంగా అడుగులువేస్తూ, చీకట్లో మాయమయిపోయిన ఆ వ్యక్తిని చూసి ఓబులేశు మదిలో ఏదో అనుమానం మెదిలింది. భయం వేసింది.

ఆ ఆగంతకుడి రూపం అతడి కళ్ళముందు లీలగా కదిలింది.

ఓబులేశు ఆలోచనలు పరిపరి విధాలుగా దారితీయబోయాయి.

కాని—

అప్పటికే షాపు మూసే సమయం దాటిపోవడంవలన, ఆలోచనలకి తాత్కాలికంగా స్వస్తిచెప్పి, జోళ్ళబడ్డీ మూసి, ఇంటిముఖం పట్టాడు ఓబులేశు.

2

ఆ రోజు రాత్రి—

సమయం తొమ్మిదిన్నరయింది.

ఓబులేశు తన జోళ్ళబడ్డీ మూసే ప్రయత్నంలో వున్నాడు.

"నా బూట్లు కుట్టావా?" అన్న ప్రశ్న వినిపించి పక్కకి తిరిగిచూశాడు.

ఎండుటాకులా గరగరమనే అదే కంఠం....

వదులుగా వున్న అవే తెల్లటి దుస్తులు....

లోతుకు పీక్కుపోయిన అవే కనుగుడ్లు....

తెల్లగా పాలిపోయిన అవే చెంపలు....

వెండితీగెల్లా తెల్లగా మెరిసే అదే జుత్తు....

చేతులకు, కాళ్ళకు అంగుళం మేరకు పెరిగివున్న అదే వాడిగోళ్ళు ...

ఎదురుగా నిలబడివున్నా డా ఆగంతకుడు!

"ఓ! మీ బూట్లు నిన్న సాయంకాలానికే రడీ అయి పోయాయండీ! ఇదుగో సూడండి? ఎంతబాగా కుట్టానో!" అంటూ కొత్త బూట్లజత అతడి కాళ్ళముందుంచాడు ఓబులేశు.

ఆ ఆగంతకుడు బూట్లు తొడుక్కున్నాడు.

బడ్డీలో వెలుగుతున్న ఫ్లోరు సెంట్ దీపకాంతిలో అ నల్లని బూట్లు నిగనిగా మెరుస్తున్నాయి.

కొద్దిపాటి వైశాల్యం వున్న ఆ బడ్డీలో బూట్లతో అటూ ఇటూ తిరిగాడా ఆగంతకుడు—ఎంతో సంబరపడి పోతూ. అతడి కళ్ళలో సంతృప్తి కనిపించింది.

"బూట్లు చాలా బాగా కుట్టావ్. మళ్ళీ ఏడాది తరువాత నేను నీ దగ్గరకొచ్చి యిలాంటి బూట్లే మళ్ళీ కుట్టించుకుంటాను. ఇదిగో నీకు రావాల్సిన మిగతా యాభై రూపాయలు" అంటూ ఓబులేశు పనితనాన్ని మెచ్చుకుని, జేబులోంచి మరో యాభై రూపాయల నోటు తీసి అతనికి అందించాడు.

ఓబులేశు ఆ నోటుని ఆనందంగా అందుకున్నాడు.

తరువాత ఆ శాల్తీ గిరుక్కున వెనుదిరిగి వడివడిగా నడవసాగాడు.

అతని నడకని యాంత్రికంగా గమనించిన ఓబులేశు తుళ్ళిపడ్డాడు.

ఇంచుమించుగా ఆ ఆగంతకుని నడక గాలిలో తేలి పోతున్నట్టుగా వుంది.

ఆ నడక గాలి కంటే వేగంగా పరిగెడుతున్నట్టుగా వుంది.

ఓబులేశు మదిలో మళ్ళీ అనుమానం పొడ

చూపింది....

'ఈ దసలు మడిసేనా?'—అని అనుకున్నాడు తనలో తాను.

అనుమానానికి తోడు ఓబులేశులో కుతూహలం కూడా రేకెత్తింది.

'ఏమైనా సరే! ఈ డెవడో తేల్చేసుకోవాలీ రోజు'—' అని మనసులో ఓ నిర్ణయానికి వచ్చాడు.

నిర్ణయం తీసుకున్నదే తడవు....

ఓబులేశు గబగబా జోళ్ళబడ్డీ మూసేసి చీకట్లో వడి వడిగా ముందుకు పరిగెత్తాడు.

3

ఆ ఆగంతకుడు ముందుకు నడుస్తున్నాడు....

వడివడిగా....

గాలిలో తేలిపోతున్నట్టుగా!

ఓబులేశు వెనక నడుస్తున్నాడు....

వేగంగా....

ఆ ఆగంతకుడికి దూరంగా!!

అతడు ముందు....

ఓబులేశు వెనక....

ఆ ఆగంతకుడు కొత్త బూట్లతో పురవీధులన్నీ చాలా సేవు తిరిగాడు.

ఓబులేశు కూడ ఆ ఆగంతకుడిని ఫాలో అవుతూ అన్ని వీధులూ తిరిగాడు.

ఉన్నట్టుండి నిర్మానుష్యంగా వున్న ఓ వీధి ముందు ఆ ఆగంతకుడు ఆగిపోయాడు.

ఓబులేశు కూడ వెనక ఠక్కున ఆగి ఓ ఇంటి గోడ మాటున నక్కాడు.

అటూ యిటూ చూసి పక్కనే వున్న బంగళాలోకి అడుగు పెట్టాడా ఆగంతకుడు.

ఆ బంగళా అక్కడక్కడా సున్నంపెచ్చు లూడిపోయి వుంది. గోడలు పెద్ద పెద్ద పగుళ్ళిచ్చి వున్నాయి. లోపల ఖరీదయిన సామగ్రి వుంది కాని, బాగా పాతబడిపోయి వుందది. బంగళా అంతా బాగా బూజుపట్టి వుంది. లోపల గబ్బిలాలు కిచకిచమని భయంకరంగా రొద చేస్తూ అటూ ఇటూ తారాడుతున్నాయి.

"క్లారా!"

"క్లారా!!"

ఆ ఆగంతకుడి గుండె 'క్లారా' నామ జపంతో పదే పదే లయగా నాట్యం చేస్తూ కొట్టుకుంటోంది.

క్లారా!!

ఆమె యెవరో కాదు........

ఒకనాటి అతడి ప్రేయసి!!!

అతను అతని ప్రేయసి ఈ బంగళాలో ఎన్నో మధురమైన రాత్రులు గడిపారు.

ఆమె ఎంత మధురంగా పాడేదని!

ఆ పాట, ఆ కంఠ మాధుర్యం ఇప్పుడేవీ?

అవి ఇప్పుడు స్మశానభూముల సమాధుల్లో నిర్జీవంగా నిద్ర పోతున్నాయి. ఎవ్వరికీ వినిపించకుండా నిశ్శబ్ద గానాన్ని ఆలాపిస్తున్నాయి.

ఈ రోజు తన ప్రేయసి క్లారా పుట్టిన రోజు. ప్రతి పుట్టినరోజుకి ఆమె తనని షాపుకి తీసుకువెళ్ళి - తనకో కొత్త బూట్లజత కొని ప్రెజెంట్ చేసేది. తను ఆ బూట్లు తొడుక్కొని రోజంతా ఆమెతో గడిపేవాడు.

ఆ బంగళాలో....

ప్రతి వస్తువునీ....

చేత్తో తాకుతూ....

కళ్ళతో చూస్తూ........

అదో విధమైన అలౌకికానందానికి గురి అవుతున్నాడా ఆగంతకుడు.

ధూళితో నిండి వున్న సోఫాలో ఒంటరిగా కూర్చుని వున్న తన ప్రేయసిని ముద్దు పెట్టుకున్నాడు.

వుయ్యాల బల్లమీద ఒక్కడే కూర్చుని ఆమెతో వూయల లూగుతూ సరదాలాడాడు.

బెడ్ రూమ్‌లో ధూళి ధూసరితమై వున్న పాన్పుమీద ఒక్కడే పడుకుని దొర్లి ఆమెతో అమర సుఖం అనుభవించాడు.

తరువాత బంగళాలోంచి బయటకు వచ్చాడు.

కొంచెం దూరం నడిచి పక్కనే వున్న నిర్మానుష్యమయిన పార్కులోకి అడుగు పెట్టాడు.

ఈ పార్కులోనే తను, తన ప్రియురాలు క్లారా కలిసి ఎన్నో మధురమైన సాయంకాలపు పిల్లగాలులని పీల్చారు. ప్రేమ మైకంలో ఎన్నో పూలమొక్కల పరిమళాలని ఆస్వాదిస్తూ వాటి రసానుభూతిని అనుభవించారు.

ఓ సిమెంటు బెంచీ దగ్గరకు నడిచాడు.

ఆ బెంచీమీద కూర్చున్నాడు.

తను తన క్లారా ఎప్పుడూ ఆ బెంచీమీదే కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు.

ఇప్పుడూ అలాగే తన ప్రేయసితో ఏకాంతంగా కబుర్లాడాడు.

కొద్ది క్షణాల తరువాత బెంచీమీంచి లేచి నిలబడి,

పార్కులోంచి బయటకు వచ్చి, వూరి చివరివయిపుకు అడుగులు వేయసాగాడా ఆగంతకుడు.

అప్పటిదాకా ఆ శాస్త్రిని ఫాలో అవుతూ వచ్చిన ఓబులేశుకి భయంతో గుండెలు గుబగుబలాడాయి.

మనసు మారుమూలల్లో ఏదో శంక ....

దానికి తోడు వెన్నులోంచి వణుకు పుట్టుకు వస్తోంది.

అయినా లోలోపల ఏదో మొండి ధైర్యం ....

చివరిదాకా ఏం జరుగుతుందో తెలుసుకుందామనే తపన ....

ఓబులేశు వదిలేయకుండా ఆ ఆగంతకుడి వెనుక వూరి చివరి వయిపు అడుగులు వేశాడు.

అతడు ముందు ....

ఓబులేశు వెనక ....

ఇద్దరూ వూరి బయట స్మశానం వద్దకు వచ్చారు.

అప్పటికి సమయం సరిగ్గా రాత్రి పన్నెండు గంట లయ్యింది!

సమాధుల మధ్య నడుచుకుంటూ పోతున్నాడా ఆగంతకుడు.

ఓబులేశు ఓ మర్రిచెట్టు చాటున నక్కి చూస్తున్నాడు.

చూస్తూండగానే ఆ ఆగంతకుడు ఓ సమాధి మాటుకు వెళ్ళి హఠాత్తుగా మాయమైపోయాడు.

అంతే!

ఓబులేశు కంఠంలోంచి ఓ భయంకరమైన గావుకేక వెలువడింది - "దెయ్యం బాబోయ్" అని.

ఆ వెనువెంటనే ఓబులేశు వెనక్కి తిరిగి కాలికి సత్తువకొద్దీ బుద్ధి చెప్పాడు.

4

కల్లు పాకలోకి పరుగు పరుగున వచ్చి పడ్డాడు ఓబులేశు.

ఎదురుగా అతడి నేస్తాలు మల్లేశు, వెంకటేశు కల్లు కొడుతూ కనిపించారు.

పాకలో గుడ్డిదీపం మిణుకు మిణుకు మంటోంది.

పక్కనే కల్లుముంత పెట్టుకుని ఓ ముసలాడుకూర్చుని వున్నాడు. వాడే ఆ కల్లుపాక యజమాని. పేరు కోనారి.

"ఏరా ఓబులేశూ! అట్టా కంగారుగా వచ్చి పడి పోనావ్?" అడిగాడు మల్లేశు.

"నాను దెయ్యాన్ని సూశాన్రా!" వడ వడా వణికి పోతూ అన్నాడు ఓబులేశు.

ఆ మాటలకు వెంకటేశు కిసుక్కున నవ్వాడు.

"నీ నాటకాలు మాకు తెల్దనుకున్నావేట్రా!? జోల్లు, బూట్లు కుట్టి సంపాదించిం డబ్బంతా యినప్పెట్లో పెట్టుకుని, కల్లుకి కూడ కానీ కర్చుపెట్టుకోకుండా, రోజూ ఏదో ఓ వింత జెప్పి, మా డబ్బుతో కల్లు కొట్టేత్తున్నావు. ఈరోజు మాకాడ డబ్బు నేదు. నీ ఆటలు మా దగ్గర సాగవారేయ్. ఒల్లికో" అన్నాడు ఎగతాళిగా.

వెంకటేశు అన్న మాటలు నిజమే!

ఓబులేశు రోజూ కల్లుపాకలో వాళ్ళిద్దరికీ రోజుకో వింత చెబుతాడు. రోజుకో సినిమా కథ వినిపిస్తాడు. ఫలితంగా వాళ్ళ దగ్గర అతడు రోజూ కల్లుముంత ఫ్రీగా కొట్టేస్తాడు.

అది వాళ్ళ ముగ్గురి ఒప్పందం.

ఓబులేశు ఏడో తరగతిదాకా చదువుకున్నాడు.

అసలు అక్షరాభ్యాసమే చెయ్యని మల్లేశు, వెంకటేశు

లకు ఓబులేశు గురువు. వాళ్ళకి సినిమాలు, నాటకాలు చూసినా అర్థం కావు, చెబితే తప్ప. చదువురాని వాళ్ళు పేపరూ చదవలేరు. అందుచేత మిడిమిడి జ్ఞానంగల ఓబులేశు అవన్నీ చూసి - వింతలు, విశేషాలు వాళ్ళకి చెబుతాడు. లంచంగా వాళ్ళ దగ్గర కల్లు కుండలు తేరగా కొట్టేసి పబ్బం గడుపుకుంటూ వుంటాడు.

"లేదొరేయ్ వెంకటేశూ! సత్తెపెమానకంగా సెబుతున్నాను. నానీరోజు నిజంగానే దెయ్యాన్ని సూశాను. నిజం. నా మాట నమ్ము!" అన్నాడు ఓబులేశు గడగడా వణుకుతూ-

"పోరా బాడుకో! నువ్వేటి దెయ్యాన్ని సూడ్డమేటి? మాం నమ్మం ఇయ్యాల మల్లే మా దగ్గర కల్లు కొట్టేయాలని సూత్తన్నావ్! నీ దొంగ నాటకాలు మా దగ్గర కాదు" అన్నాడు వెంకటేశు మళ్ళీ.

"వురేయ్! మా అమ్మమీదొట్టు....మా అయ్య మీదొట్టు. నాను నిజమే సెబుతున్నాను. ఆ దెయ్యం నాచేత బూట్లు కూడ కుట్టించుకున్నాది" అన్నాడు ఓబులేశు.

"దెయ్యమేటి? బూట్లు కుట్టించుకోడమేమిటి? ....మాం నమ్మం. అంతే" అన్నాడు వెంకటేశు.

"అంతే! మాం నమ్మం అంటే నమ్మం. అంతే!" వెంకటేశుకి వంత పాడాడు మల్లేశు.

"వురేయ్! నా కొడకల్లారా! మీరు నా కీ రోజు కల్లిప్పించకపోయినా పరవానేదు. జరిగింది వినండి. సెబుతాను" కోపంగా అన్నాడు ఓబులేశు.

ఓబులేశు కల్లు వద్దనేసరికి ఇద్దరికీ కుతూహలం పెరిగింది.

"అయితే సెప్పు" అంటూ తల లాడించారు.

వాళ్ళ సంభాషణ ఆలకి స్తున్న కల్లుపాక ఓనరు ముసలి కోనారి కూడా "అదేమిటో తొందరగా చెప్పు ఓబులేశూ!" అన్నాడు కుతూహలంగా.

ఆ ఆగంతకుడు తన దగ్గరకు బూట్లు కుట్టించుకోవడానికి వచ్చినది మొదలు జరిగినదంతా పూస గుచ్చినట్టుగా వివరించి చెప్పాడు ఓబులేశు.

"ఆఁ" అలకించిన వాళ్ళు ముగ్గురూ నోళ్ళు వెళ్ళబెట్టి నిశ్చేష్టులై వుండిపోయారు.

ముందుగా మల్లేశు తేరుకుని అన్నాడు.

"ఈ ఇసయ మేమిటో యిప్పుడే తేల్చేసుకోవాల్సిందే. పదండి. ఈ షనమే ఆడకెల్లి సూద్దాం."

"అవును పద. ఆ దెయ్యం కతేంటో తెలుసుకుందాం. ఇప్పుడే ఆ శ్మశానానికి బయల్దేరుదాం" అన్నాడు వెంకటేశు కూడ.

"ఇప్పుడా?" జంకాడు ఓబులేశు

"అవును ఇప్పుడే!" అన్నారు వాళ్ళిద్దరూ.

ఆ ఇద్దరి మాటలకు ముసలి కోనారి కూడా జంకాడు.

"ఈ రోజు జరిగిపోనాది ఎలాగూ జరిగిపోనాది. ఈ రేతిరేళప్పుడు ఎళితే ఏదయినా పమాదం జరగొచ్చు! అందుకే రేపుదయమే ఆడకెళదాం" అంటూ సలహా ఇచ్చాడు ముసలి కోనారి.

ఆ సలహా వాళ్ళకి నచ్చింది.

నలుగురూ కలిసి మర్నాడు వుదయం ఆ దెయ్యం తిరిగిన ప్రదేశాలన్నీ పరిశీలిద్దామనుకున్నారు.

5

తెల్లగా తెల్లారింది.

దెయ్యం విషయమేమిటో తెలుసుకోవాలని ఆ నలు

గురూ బయల్దేరారు.

ముందుగా పాడుబడిన బంగళా దగ్గరకు వచ్చారు.

"ఈ బిల్డింగులోకే ఆ దెయ్యం వెళ్లింది" అంటూ ఆ బంగళా చూపించాడు ఓబులేశు.

ఆ ముగ్గురూ బంగళాని తేరిపార జూశారు.

"నిన్న రేతిరి నేను జూసినపుడు ఈ బంగళాకి తాళ మేసి నేదు. ఆ దెయ్యం తలుపులు తెరుచుకుని అలాగే బయటికి వచ్చేసినాది" చెప్పాడు ఓబులేశు.

"సరిగ్గా జూశావా నువ్వు?" అడిగాడు మల్లేశు.

"ఆ. సరిగానే జూసినా! ఆ దెయ్యం తలుపులు మాత్రం మూయకుండానే బయటకి పోనాది" చెప్పాడు ఓబులేశు.

"అయితే ఇది దెయ్యం పనేనని నా అనుమానం. ఈ బంగళా మడుసులు వుండే బంగళాలా లేదు" నిర్ధారించాడు ముసలి కోనారి.

"అవును. నాకూ అలాగే అనిపిత్తాంది. ఇది దెయ్యం పనే" వెంకటేశు కూడా తీర్మానించాడు.

మల్లేశు కూడ అలాగే అన్నాడు.

అక్కడి నుంచి కదిలి ఆ నలుగురూ పార్కులోకి ప్రవేశించారు

"ఆ దెయ్యం ఇక్కడే శానాసేపు కూర్చుంది" అంటూ సిమెంటుబెంచి చూపించాడు ఓబులేశు.

ఆ తరువాత శ్మశానం వయిపు నడక సాగించారు.

రుద్రభూమి చేరుకున్నారు.

ఓబులేశు తను దాక్కున్న మర్రిచెట్టు, ఆ దెయ్యం మాయమయిన సమాధి దూరం నుంచి చూపించాడు.

గబ గబా నలుగురూ సమాధి సమీపించారు.

అంతే!

అక్కడి దృశ్యం చూసి వాళ్ళంతా స్తంభీభూతు లయారు.

అక్కడ....

ఎత్తమున ఆ సమాధి మీద ఓ అస్తిపంజరం నిలువుగా - నిస్తేజంగా - వెల్లకిలా పడివుంది దాని కాళ్ళకి ఓబులేశు కుట్టిన కొత్త బూట్లజత తొడగబడి వుంది. నల్లని ఆ బూట్లా ఎండకి నిగ నిగా మెరుస్తున్నాయి.

"ఇ....ఇ....ఇ....ఇది ిజంగా దెయ్యమే!" వణికి పోతూ అన్నాడు ముసలి కోనారి.

"అవును. ఇది దెయ్యమే" అన్నాడు వెంకటేశు.

"అవును. ఇది ముమ్మాటికీ దెయ్యమే" అన్నాడు మల్లేశు.

"అయితే ఇప్పుడేటి సేద్దాం?" అన్నాడు ఓబులేశు భయంగా.

"ఈ దెయ్యానికి బుద్ధి నేక నీకు బూట్లకి సందిచ్చినాది. మల్లీ నువ్విప్పుడు దాని కాళ్ళకున్న బూట్లు దీసుకో! అమ్ముకుని వంద రూపాయల సొమ్ము జేసుకో!" సలహా ఇచ్చాడు వెంకటేశు.

"అదెట్టా? ఈ దెయ్యానికున్న బూట్లు నేను దీస్కుంటే ఇవి పగబట్టి నన్ను సంపెయ్యదూ!" అనుమానంగా అన్నాడు ఓబులేసు.

"ఇది నిన్నేటి పెయ్యదురా ఓబులేశూ! ముందా బూట్లు తీసేస్కో! అనక మనం బూతవైద్యుడు కాన్ సాయిబుకాడి కెడదాం. ఇసయం సెప్పి అడిసేత నీకు తాయిత్తు కట్టించుతాం. ఇక జూస్కో! అది నీ శాయలకే రాదు" చెప్పాడు మల్లేశు.

"అవును. మీ ఇద్దరూ చెప్పింది బావుంది. అలాగే చెయ్యి ఓబులేశూ!" అంటూ వంత పాడాడు ముసలి కోనారి.

"కాని దగ్గరి కెడితే ఇప్పుడే ఆ దెయ్యం లేసి, నా మీద పడి సంపేత్తదేమో!" తన మరో అనుమానాన్ని వ్యక్తం చేశాడు ఓబులేశు.

"శె.... శె....నీదంతా యదవనుమానం. పట్టపగలు దెయ్యాలకి అసలు శక్తి వుండదు. అయి రాత్రుల్లే నిద్ర లేస్తాయి" చెప్పాడు వెంకటేశు.

ఆ మాటలతో ఓబులేశుకి ధైర్యం వచ్చింది.

గబగబా ఆ అస్తిపంజరాన్ని సమీపించి, దాని కాళ్ళకి వున్న బూట్లు వూడదీసి చేత్తో పట్టుకున్నాడు.

ఆ తరువాత నలుగురూ వెనుదిరిగారు.

ఆ సాయంత్రం వాళ్ళు భూతవైద్యుడు ఖాన్ సాయిబుని కలుసుకున్నారు. విషయమంతా వివరించి చెప్పారు.

ఖాన్‌సాయిబు ఏవేవో మంత్రాలు చదివి ఓబులేశుకి తావీదు ఒకటి కట్టాడు.

"నీకేం భయంలేదు. ఇక ఆ దెయ్యం నీ ఛాయలకే రాదు" అని భరోసా ఇచ్చాడు.

6

మర్నాడు—

రాత్రి తొమ్మిదిన్నరయింది.

ఓబులేశు బడ్డీ మూసే ప్రయత్నంలో వున్నాడు.

ఆ సమయంలో....

"వురేయ్!" అనే భయంకరమైన అరుపు వినిపించింది

వెనుదిరిగి చూసి నిశ్చేష్టుడయాడు ఓబులేశు.

ఎదురుగా ఆ ఆగంతకుడు నిలిచి వున్నాడు!

అతడి కళ్ళు ఎఱ్ఱగా గోళాల్లా వున్నాయి.

తెల్లగా పాలివున్న అతడి చెంపలు వుద్రేకంతో రక్త వర్ణం దాల్చాయి.... రెండుచేతులూ పైకి ఎత్తాడు.

వాడిగా వున్న గోళ్ళు అటూ ఇటూ ఆడించాడు.

"వురేయ్" మళ్ళీ భయంకరంగా.... కీచుగా.... గరగరా అరిచాడు.

"నా ప్రేయసికోసం నేను ముచ్చటపడి కుట్టించుకున్న నా బూట్ల జత దొంగిలించుకుపోతావా? అందుకు నీమీద బదులు తీర్చుకోవాలని వచ్చాను. నిన్ను ప్రాణాలతో వద లను. చంపేస్తాను" అంటూ వికృతంగా నోరుతెరిచి మీది మీదికి రాసాగాడు ఆ ఆగంతకుడు.

ఓబులేశు కాళ్ళు, చేతులు విపరీతమైన భయంతో వణుకు తున్నాయి. ఒళ్ళంతా మంచులా గడ్డకట్టుకుపోతోంది.

రక్తనాళాలు స్తంభించిపోతున్నాయి.

కండరాలు పట్టు తప్పిపోతున్నాయి.

ఆ ఆగంతకుడు తన వాడి గోళ్ళను ఓబులేశు కంఠంలో దింపబోయాడు.

కాని—

అప్పటికే ఓబులేశు చలనరహితుడయాడు.

నిస్తేజంగా నేలకు వొరిగిపోయాడు.

తను చంపక ముందే అతడు ప్రాణాలు వదిలేయడంతో ఆ ఆగంతకుడిలో కోపం రెచ్చిపోయింది.

కచ్చగా తన వాడి కోళ్ళతో ఓబులేశు శవాన్ని రక్తం వచ్చేలా ఒళ్ళంతా చీరేశాడు.

తరువాత—

ఓబులేశు శవం పక్కనే వున్న తన కొత్తబూట్ల జత

మళ్ళీ తీసుకుని, వెనుదిరిగి గాలికంటే వేగంగా ఆ చీకటిలో మాయమైపోయాడు.

7

ఆ మర్నాడు—

పుదయమే మల్లేశు, వెంకటేశు భూతవైద్యుడు ఖాన్ సాయిబు దగ్గిరకు లబోదిబోమంటూ పరుగెత్తికొచ్చారు.

"నిన్న రేతిరి మా ఓబులేశుని ఆ దెయ్యం పొట్టన బెట్టుకున్నాది. ఆడిని సంపేసిందండీ!" గోడుగోడున చెప్పాడు మల్లేశు.

"అవునండీ సాయిబుగోరూ! మీ రాడికి కట్టిన తాయెత్తు పంజెయ్యలేదు" వెంకటేశుకూడా గోలుగోలున ఏడుస్తూ చెప్పాడు.

"ఆఁ" అంటూ ఖాన్ సాయిబు నిశ్చేష్టుడయాడు.

అతడి ముఖం క్రోధంతో ఎర్రబడింది.

కళ్ళు గోధుమవర్ణం దాల్చాయి.

"నేను కట్టిన తావీదు ఆ దెయ్యం ముందు పంజెయ్య లేదా!? ఇదే నా శపథం. ఓబులేశును చంపిన ఆ దెయ్యాన్ని ప్రాణాలతో వదలను. దాన్ని హతమారుస్తాను. పదండి శ్మశానానికి" అంటూ గబగబా తన మంత్రసామగ్రి— వెంట ఓ కిరోసిన్ డబ్బా తీసుకుని ముందుకు అడుగులు వేశాడు, మరోమాట లేకుండా.

మల్లేశు, వెంకటేశు మౌనంగా ఖాన్ సాయిబుని అనుస రించారు.

మరో అరగంటకల్లా ముగ్గురూ వూరి చివరి శ్మశానం చేరుకున్నారు.

"మీరు చూసిన ఆ అస్తిపంజరం వున్న సమాధి ఎక్కడ?" అడిగాడు ఖాన్ సాయిబు.

కొద్దిగా దూరంగా వున్న ఓ సమాధి చూపించారు వాళ్ళిద్దరూ.

గబగబా ఆ సమాధి సమీపించాడు ఖాన్ సాయిబు.

ఇద్దరూ ఆతడిని అనుసరించారు.

ఎత్తైన ఆ సమాధిమీద ఓ అస్థిపంజరం నిస్తేజంగా-నిలువుగా—వెల్లకిలా పడివుంది. దాని కాళ్ళకి నల్లని కొత్త బూట్లు తొడగబడి వున్నాయి. అవి ఎండవేడికి నిగనిగా మెరుస్తూన్నాయి.

"సాయిబుగోరూ! ఆరోజు ఓబులేశుగాడు పట్టుకు పోయిన బూట్లజత ఇదే! ఆడ్ని సంపి మల్లా తెచ్చేసుకున్నట్టుంది" గడగడా వణికిపోతూ చెప్పాడు వెంకటేశు.

"అవునండీ సాయిబుగోరూ! ఆ బూట్లజత ఇదే" మల్లేశుకూడా వజవజా వణికిపోతూ అన్నాడు.

"భయపడకండి. మీ ఓబులేశుని పొట్టన పెట్టుకున్న ఈ దెయ్యాన్ని వూరికే వదలను. దాన్ని సమూలాగ్రంగా నాశనం చేస్తాను. మీ ఎదురుగానే దీన్ని భస్మీపటలం గావిస్తాను. గాలిలో కలిపేస్తాను" అంటూ వాళ్ళిద్దరికి ధైర్యం చెప్పాడు ఖాన్ సాయిబు.

ఆ తరువాత వెంట తెచ్చిన సామగ్రితో ఆ సమాధి ముందు పెద్ద ముగ్గువేశాడు. ముగ్గుమధ్య ఓ పుర్రె, రెండు ఎముకలు వుంచాడు. రెండు నిమ్మకాయలు అడ్డుగా కోసి వాటి పక్కన పెట్టాడు,

తరువాత పెద్దపెద్ద మంత్రాలు భీకరంగా పఠించ సాగాడు.

వెంకటేశు, మల్లేశు ఏం జరుగుతుందో అని వుత్సుకతతో భయంభయంగా చూడసాగారు.

ఖాన్‌సాయిబు పెద్దగా మంత్రాలు చదువుతున్నాడు.

ఆ మంత్రాల అరుపులకు చుట్టుపక్కల చెట్లమీది పక్షులు బెదిరి భీతిగా అరుస్తూ ఆకాశంలోకి ఎగిరి పోయాయి.

పట్టపగలే ప్రళయం సంభవిస్తున్నంతగా....భయంకరంగా శ్మశానవాటిక దద్దరిల్లిపోయేలా మంత్రాలు పఠిస్తున్నాడు ఖాన్‌సాయిబు.

ఆ సమయంలో ఓ చెట్టుచాటునుండి ఎర్రటి జ్యోతుల్లాంటి రెండు కళ్లు ఆ దృశ్యాన్ని ఆగ్రహోదగ్రంగా తిలకిస్తున్నాయి. కచ్చగా చూస్తున్నాయి.

మంత్రాలు పఠిస్తున్న ఖాన్‌సాయిబు వున్నట్టుండి కూడా తెచ్చిన డబ్బాలోని కిరసనాయిలుని సమాధిమీద వున్న ఆ అస్తిపంజరంమీద పోశాడు. అగ్గిపుల్లగీసి అస్తిపంజరానికి నిప్పుపెట్టాడు.

చిటపటమని చప్పుడుచేస్తూ భగ్గుమని మండింది అస్తిపంజరం.

జ్వాలలు నలువైపులా లేచాయి.

అంతే!

హఠాత్తుగా ఆ చెట్టుచాటునుండి ఆ ఆగంతకుడు ఇవతలికి వచ్చాడు.

"వురేయ్! దొంగనా కొడుకుల్లారా! ఇంతకాలమూ నేనెంతో ప్రాణపదంగా చూసుకుంటూ వస్తున్న నా ప్రేయసిని నాకు దూరంచేస్తారా? హ్హ....హ్హ....హ్హ....హ్హ మిమ్మల్ని ప్రాణాలతో వదలను. మీ అంతు చూస్తాను.... హ్హ....హ్హ....హ్హ....హ్హో."

—అంటూ పదే పదే దిక్కులు పిక్కటిల్లేలా భయంకరంగా కేకలుపెడుతున్నా డా ఆగంతకుడు.

పిచ్చిగా అరుస్తున్నాడు....
వెర్రిగా కేకలు వేస్తున్నాడు....
వేదనగా రోదిస్తున్నాడు....
అస్తవ్యస్తంగా గెంతులు వేస్తూ డాన్స్ చేస్తున్నాడు.
అంతే!

ఆ ముగ్గురూ నిశ్చేష్టులై నోళ్ళు వెళ్ళబెట్టి ఆ ఆగంతకుడిని అలాగే చూస్తూండిపోయారు.

ఇంతకూ అతడెవరో కాదు....

ఓ ప్రేమ పిచ్చివాడు!

ఆ అస్థిపంజరం ఏడాది క్రితం భయంకరమైన కేన్సర్ వ్యాధితో మరణించిన అతడి ప్రేయసి క్లారాది. ప్రేమ పిచ్చితో ఆమె ఇంకా బ్రతికి వుందని భ్రమిస్తూ ఇంత కాలమూ ఆ అస్థిపంజరాన్ని పిచ్చిగా ఆరాధిస్తూ వచ్చాడతను. అంతే! □

నత్తి-?



గ్రాండ్ ట్రంక్ రోడ్డుమీద విజయవాడకు వస్తూంది ఒక ఫోర్డ్ కారు.

అందులో ఒకే ఒక మనిషి వున్నాడు. అతడే డ్రయివ్ చేస్తున్నాడు. అతని పేరు సుధీర్. పాతికేళ్ళుంటాయి.

మంగళగిరిలో ఏరియేటెడ్ వాటర్సు ఫ్యాక్టరీ వుందతనికి. నివాసం విజయవాడలో. ప్రతిరోజూ వుదయం మంగళగిరి వెళతాడు. సాయింకాలందాకా ఫ్యాక్టరీ వ్యవ

హారాలు చూసుకుంటాడు. సాయంకాలం బయలుదేరి మరలా విజయవాడ వస్తాడు.

సుధీర్ ఆరోజు రాత్రి ఎనిమిది గంటలకు మంగళగిరిలో బయలుదేరాడు. ఎక్కువ పనివుండటం వలన ఆలస్యమయింది. 'తొమ్మిది గంటలలోపే యింటికి చేరుకోవచ్చు' అనుకొన్నాడు. కానీ కారు పంచరయింది. చక్రం మార్చుకునేందుకు అరగంట పట్టింది ఆలస్యం అయితే అనూరాధ అనుమానపడుతుంది. అందుకని కారు వేగం హెచ్చించాడు.

కారు హెడ్ లైట్లలో ట్రంక్ రోడ్ రెండు ఫర్లాంగుల వరకూ కనిపిస్తూంది. రోడ్‌కు రెండువైపులా రాక్షసుల్లా పెద్దపెద్ద చెట్లున్నాయి. చల్లనిగాలి వీస్తూంది. జేబులోంచి సిగిరెట్ పాకెట్ తీసి సిగిరెట్ వెలిగించాడు. గట్టిగా పొగ పీల్చి వదులుతున్నాడు. కారును వేగంగా నడుపుతూ పదయ్యేసరికి యిల్లు చేరుకున్నాడు.

శీతాకాలం. చలి ఎక్కువగా వుంది.

సుధీర్ కారు హారన్ రెండుసార్లు మ్రోగించాడు. లోపలినుండి ఏ రకమయిన అలికిడీ లేదు. భార్యను తిట్టుకుంటూ కారు దిగాడు సుధీర్. గేటు తెరచాడు. కారును షెడ్‌లో పెట్టాడు. గుమ్మం దగ్గరకు వచ్చి కాలింగ్ బెల్ నొక్కాడు. సమాధానం లేదు.

సుధీర్ పళ్ళు కొరికాడు. "ఆడదానికి అనుమానం సహజం. కాని మరీ యింత మిడిసిపాటు వుండకూడదు". అతనిలో క్షణ క్షణానికీ విసుగు ఎక్కువైపోతోంది. కోపం తారస్థాయికి చేరుకోగా "అనూ!" అని గట్టిగా అరుస్తూ తలుపుమీద చరిచాడు. ఆశ్చర్యం! తలుపు తెరుచుకుంది.

హాలులో స్విచ్ వేశాడు. నాలుగు ప్రక్కలా కాంతి విరజిమ్మింది. బ్రీఫ్‌ని సోఫాలో పడేసి హాలంతా కలయ జూశాడు.

ఆశ్చర్యంతో అతని భృకుటి ముడిపడింది. హాల్లో - అనురాధ ఎక్కడా కనపడలేదు. కోపంతో అతని కళ్ళు ఎరుపెక్కాయి. "మరీ యింత తలబిరుసా?" అనుకుంటూ బెడ్‌రూమ్ తలుపును విసురుగా తన్నాడు.

తలుపు తెరచుకుంది.

హాల్లోని లైట్ కాంతి బెడ్‌రూమ్‌లో ప్రవేశించింది. గది మధ్యనున్న మంచంమీద అనురాధ వెల్లకిలా పడుకుని వుంది. ఆమె పడుకున్న తీరుచూస్తే సుధీర్‌కు ఏదో అనుమానం వచ్చింది.

"అనూ!" అంటూ పిలిచాడు. అతని గొంతు ఆదోలా వుంది.

సుధీర్ గదిలోకి వెళ్ళి లైట్ వేశాడు. మంచంవైపు పరిశీలనగా చూసిన సుధీర్ కొయ్యబారి పోయాడు.

అనురాధలో ప్రాణం లేదని పసిగట్టటం అతనికి ఏమంత పెద్ద కష్టం కాలేదు. ఆమె బట్టలన్నీ చెదరిపోయి వున్నాయి గాజులు పగిలిపోయి వున్నాయి. బోసి మెడ. ఒంటిమీద అక్కడక్కడ రక్కులు.

ఆమెను అలా నిర్జీవంగా చూస్తుంటే సుధీర్‌కు అప్పటి వరకు ఆమె మీదున్న కోపం అంతా మటుమాయం అయిపోయింది. "అనూ!" అంటూ బాధగా మూలిగి కూలబడిపోయాడు.

రెండు నిముషాలకు తేరుకున్నాడు సుధీర్. అతని వళ్ళంతా విపరీతంగా వణుకుతోంది. బట్టలన్నీ చెమటతో

తడిసి ముద్దయిపోయాయి. నీరసంగా లేచి హాలులోకి వచ్చాడు.

ఫోన్ దగ్గరకువెళ్ళి, వణుకుతున్న చేతులతో రిసీవరు ఎత్తి కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేసి జరిగింది చెప్పాడు.

సుధీర్ యింటిముందు - పోలీస్ జీపూ, వ్యానూ సైరన్ మ్రోదుకుంటూ వచ్చి ఆగాయి.

జీప్‌లోంచి ఇన్‌స్పెక్టర్ కాశ్యప దిగాడు.

ఇన్‌స్పెక్టర్ వెనుకనే పోలీసు వాన్‌లోంచి ఫోటోగ్రాఫర్లూ, కాన్‌స్టేబుల్సూ దిగారు. చుట్టుపక్కలవాళ్ళు ఆ హడావుడి చూసి, వీధిలోకి వచ్చి సుధీర్ యింటిముందు పోగయ్యారు. జనం లోపలకు రాకుండా లాఠీలు పట్టుకొని యిద్దరు కాన్‌స్టేబుల్స్ ఆపుతున్నారు.

"మాకు ఫోన్ చేసింది. మీరేనా?" అడిగాడు - తనకు ఎదురు వచ్చిన సుధీర్‌న్ను చూసి - కాశ్యప.

"అవును!" అన్నాడు సుధీర్.

"ఏం జరిగిందో చెప్పండి?"

తను చూసిందంతా పూసగుచ్చినట్టు చెప్పాడు-సుధీర్.

కాశ్యప తల వూపాడు. లోపలకు వెళ్ళాడు. గది మధ్య మంచంమీద పడున్న శవాన్ని చూశాడు. శవం మొహం చాలా వికృతంగా వుంది. మొహంమీదా, వంటిమీదా రక్కులున్నాయి. అక్కడక్కడ గోళ్ళతో గీరిన గీట్లున్నాయి. మెడ బాగా వాచిపోయింది. గొంతుపట్టి నలిపినట్లు లావుపాటి వ్రేళ్ళ గుర్తులు కనపడుతున్నాయి. నాలుక వెళ్ళుకువచ్చింది. పెదిమలు కూడా వుబ్బివున్నాయి.

ఆమె వేసుకున్న బట్టలను పరీక్షగా చూశాడు కాశ్యప.

తెల్లటి చిన్న చిన్న పూలున్న పాత వాయిల్ చీర, కొత్త పట్టు జాకెట్.

"చాలా విచిత్రంగా వుందే!" అనుకున్నాడు కాశ్యప.

ఫొటోగ్రాఫర్లూ, ఫింగర్ ప్రింట్స్ ఎక్స్పర్టూ, తమ తమ పనుల్లో నిమగ్నమైపోయారు.

కాశ్యప మరోసారి ఆ గదిని పరీక్షించాడు. తర్వాత సుధీర్ వైపు తిరిగి "ఈవాళ మీ యింటిలోగాని మీకు తెలిసున్నవారి యింటిలోగాని ఏదయినా ఫంక్షన్ వుందా?" అని అడిగాడు.

"లేదే! ఏం?" అడిగాడు సుధీర్.

"మీరు ఆమె వేసుకున్న జాకెట్ చూడండి, క్రొత్తగా వుంది. చీర పాతది. ఏదయినా ఫంక్షన్‌కు వెళ్ళినప్పుడు పట్టుబట్టలు కట్టుకొని వుంటారేమో. ఇంటికి వచ్చాక చీర మాత్రమే మార్చుకుని వుండొచ్చు. దీనికి సరిపోయే చీర ఏదయినా లోపల వుందేమో చూసిరండి!" అని కాశ్యప మళ్ళా గదిని చూడటం మొదలుపెట్టాడు.

మంచం ప్రక్కన పగిలిన గాజుముక్కలు చెదరి పడి వున్నాయి. వాటి మధ్యలో చిన్న అల్యూమినియం ముక్క పడివుంది. అది అర్ధచంద్రాకారంలో వుండి, దాని మధ్య గుండ్రంగా చిన్న ప్లాస్టిక్ రివిట్ వుంది. దానిని తీసి పొట్లం కట్టి జేబులో పెట్టుకున్నాడు కాశ్యప. రెండడుగులు ప్రక్కకువేసి డ్రస్సింగ్ టేబిల్ దగ్గర ఆగాడు. అక్కడ హతురాలు కట్టుకున్న చీరకు సరిపోయే మాచింగ్ జాకెట్ పడి వుంది. అది చెమటవాసన కొడుతోంది.

అంతలో సుధీర్ లోపల నుండి ప్లాస్టిక్ సంచిలో వున్న చీరను తీసుకొని వచ్చాడు. కాశ్యప దానిని పరీక్షగా చూసి "దీన్ని వాడినట్లు లేదు" అన్నాడు.

"అవును. మొన్ననే కొన్నాను" అన్నాడు సుధీర్.

"సరే: మీరు ఆమెకు వేరే బట్టలు కట్టి ఆమె వేసుకున్న బట్టలు తీసుకురండి." అన్నాడు కాశ్యప.

సుధీర్ లోపలకు వెళ్ళి శవంమీది బట్టలను తీసుకొని వచ్చాడు.

కాశ్యప జాకెట్‌ను పరిశీలనగా చూశాడు. కొత్తవాసన వేస్తోంది. జాకెట్ మీద పెన్సిల్ గీతలున్నాయి. "దొంగతనం ఏదయినా జరిగిందా?" అన్నాడు.

"మెళ్ళో మంగళసూత్రాలూ, నల్లపూసలూ లేవు. ఇంట్లో యేమీ పోలేదు" అన్నాడు సుధీర్.

పోలీస్ సర్జన్ బయటకు వచ్చాడు. "గొంతు నులపటంవలన మరణం సంభవించింది. ప్రాణం ఏడు, ఏడున్నర మధ్యన పోయివుండాలి. మానభంగం జరిగింది. ఈమె చాలాసేపు పెనుగులాడింది. హంతకుడు చాలా బలమైనవాడై వుండాలి" అన్నాడు.

3

అతడు దాదాపు పదినిముషాలు ఆవేశంగా మాట్లాడి ఆగాడు.

"మీరు అలా ఆవేశపడి లాభంలేదు" అన్నాడు కాశ్యప.

"ఆవేశపడక ఏం చెయ్యమంటారు సార్! నా చెల్లిని ఘోరంగా చంపిన దుర్మార్గుడిని ఈ భూమ్మీద వుండనివ్వను. ప్రేమా, దోమా అంటూ నా చెల్లి వెంటపడ్డాడు. ఇవ్వను పొమ్మంటే కాళ్ళావేళ్ళా పడ్డాడు. చివరకు పెళ్ళి చేస్తే నా చెల్లిని నాకు లేకుండ చేస్తాడా! సార్! ఆ సుధీర్ మేకవన్నె పులి సార్? మేకవన్నె పులి."

"అతడే హంతకుడనడానికి మనకి సాక్ష్యాధారాలు లేవు. పైగా హతురాలు చనిపోయే ముందు చాలా పెనుగులాడింది. హంతకుడు ఆమెను మానభంగం చేసి మరీ చంపాడు. సుధీరయితే ఆమెను అలా చెయ్యా నవసరం లేదు. పైగా ఆమెకు అలా పెనుగులాడాల్సిన అవసరం లేదు."

"అదే సార్? అదే వాడిలో వున్న తెలివితేటలు. ఈ రామారావు మొదట్లో వాడి బుట్టలో పడిపోయాడు. ఇప్పుడు వాడి పప్పులింక వుడకవ్. వాడు ఉరికంబాని కయినా యెక్కాలి. లేదా నా చేతిలో చావనైనా చావాలి" అంటూ విసురుగా పైకి లేచాడు.

"మీ బాధను నేను అర్థం చేసుకోగలను. కానీ మీ ప్రవర్తన నాకు నచ్చలేదు. ఒక బాధ్యతగల పోలీసాఫీసరు ముందు మీరు మాట్లాడాల్సిన తీరు యిదికాదు. ముందు మీరు కూర్చోండి" అన్నాడు కాశ్యప.

అతడు ఎంత సౌమ్యంగా మాట్లాడినా, అతని మాటల్లోని కరుకుదనం రామారావుకు సూటిగా తగిలింది. "సారీ!" అంటూ మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పండి" అన్నాడు కాశ్యప రెండు నిముషాలు ఆగి.

"సుధీర్, నా చెల్లికి రెండు సంవత్సరాల సీనియర్. కాలేజీలో చదివే రోజుల్లో నా చెల్లివెంట పడ్డాడు. ప్రేమ పాఠాలు వల్లించాడు. వ్యవహారం శృతిమించేటప్పటికి నేను రంగంలో దిగాను. కాని మా వాళ్ళు సర్దిచెప్పారు. నన్ను వొప్పించి వాడితో మా అనూ పెళ్ళి జరిపారు. వాడు కూటికి గతిలేని వెధవ. అయినా నేను బాధపడలేదు. కుర్రాడు మంచివాడు కదా అని సరిపెట్టు

కున్నాను. రెండులక్షలు పైచిలుకు ఖర్చుపెటి వాడిచేత ఫ్యాక్టరీ పెట్టించాను. వాడు నిలదొక్కుకున్నాడు. నాలుగు డబ్బులు చేసుకున్నాడు. రాను రాను వాడి ప్రవర్తన మారి పోయింది. తాగుడు, ఎక్కడెక్కడో తిరిగి అర్ధరాత్రికి యింటికి చేరుతాడు. అదేమని అడుగుతే దీన్ని చితగొట్టే వాడు."

"అప్పడిలో వచ్చిన ఈ మార్పుకు కారణం ఏదయినా వుందా?"

"ఆ! నా చెల్లి నా దగ్గర ఏడిస్తే నేను వాకబు చేశాను. వీడు మంగళగిరిలో ఎవతెనో తీశాడు."

కాశ్యప తల వూపి "ఆస్తి యెవరిపేర్న వుంది" అని అడిగాడు.

"అనూ పేర్నే వుంది. కానీ ఈ మధ్య సుధీర్ గుణదల దగ్గర ఓ పదెకరాల జాగా కొన్నాడు. బ్యాంకు బ్యాలన్స్ కూడా వుంది" అన్నాడు రామారావు.

"అనురాధ చనిపోవటంవలన సుధీర్‌కు ఏదయినా లాభం వుందా?"

"ఎందుకు లేదండీ! ఆస్తంతా దక్కుతుంది. ఓ రెండు నెలలు ఆగి ఆ ముండను డైరక్టుగా యింటికి తీసుకువచ్చి కులకొచ్చు."

కాశ్యప మౌనంగా అతడు చెప్పింది వింటున్నాడు. మధ్య మధ్య కొన్ని ప్రశ్నలు వేసి తన అనుమానాల్ని తీర్చుకుంటున్నాడు. అవసరమయిన చోట అతడిని ప్రోత్సహిస్తున్నాడు.

రామారావు మరో పావుగంట, తనకు తెలిసిన విషయాల నన్నిటిని ఏకరవుపెట్టి ఎలాగైనా సుధీర్‌కు శిక్ష పడేలా చేయమని ప్రతిమాలాడు.

"మీకు తప్పకుండా న్యాయం జరుగుతుంది. మీరు వెళ్ళండి!" అని రామారావును పంపించి, కాశ్యప ఆలోచనల్లో పడ్డాడు.

అనురాధను హత్య చెయ్యటానికి తగిన కారణం ఏమిటి? మానభంగమా? లేక దొంగతనమా? మానభంగం అయితే ఆమె ఒంటిమీది నగలు ఏమయ్యాయి? పోనీ, దొంగతనమే, అయితే యింట్లో వున్న వస్తువులు ఏమీ పోకుండా, ఒంటిమీది నగలు మాత్రమే యెందుకు పోయాయి? దొంగైతే అంతా వూడ్చుకుపోతాడు. కాబట్టి యిది దొంగతనం గాదు.

పోనీ రామారావు చెప్పినట్లు సుధీర్ ఈ హత్య చేశాడా? అంటే అలా కావటానికి వీలులేదు. హత్య జరిగే సమయానికి సుధీర్ కారు డ్రైవ్ చేస్తున్నట్టుగా తనకు సాక్ష్యం లభించింది. పోనీ అతడే ఎవరిచేతనైనా ఈ పని చేయించాడా? అంటే, ఎంత దుర్మార్గుడయినా భార్యను మరొకడిచే రేప్ చేయించే పనికి పూనుకోడు.

ఒకలా జరిగి వుండొచ్చు. సుధీర్ ఆమెను హత్య చేయమని ఎవరినో పురమాయించి వుండొచ్చు! అతడు ఆమె అందానికి ముగ్ధుడై యిలా చేసివుండొచ్చు. పోనీ సుధీర్‌ను కనక నిర్దోషిగా భావిస్తే—

ఆమె అందాన్ని చూసి మోహించి ఎవరో ఆమెను అనుభవించి తన వునికి బయటపడకుండా, ఆమె నోటిని శాశ్వతంగా మూసేసి వుండొచ్చు. పోతూ పోతు ఆమె మీద వున్న నగలను చుట్టపెట్టుకు పోయుండొచ్చు. అలాంటప్పుడు యిది వుద్దేశ్యపూర్వకంగా, ఒక పథకంప్రకారం జరిగిందా? లేకపోతే కాకతాళీయమా? ఉద్దేశపూర్వకం అయితే హంతకుడు ఆ సమయాన్ని యెందుకు యెన్ను

కుంటాడు? సాధారణంగా ఆసరికి సుధీర్ యింటికి తిరిగి వొచ్చేస్తాడు. కాబట్టి యిది కాకతాళీయం కావచ్చు. కాక తాళీయం అయితే ఆ అవకాశం ఎవరికి వుంది?

ఆ సమయంలో హంతకుడు అక్కడకు వెళ్ళాడు— అంటే— సుధీర్ వున్నా పర్వాలేదు అనుకుని వుండాలి. అలాంటివాడు ఎవరై వుంటారు?

కాశ్యప సిగిరెట్ వెలిగించి గదిలో పచార్లు ఆరంభిచాడు. అతడి మస్తిష్కం ప్రశ్నలు - సమాధానాలతో వేడెక్కిపోతోంది. కాశ్యప ఒక్క నిముషం ఆలోచనను ఆపాడు. కళ్ళు మూసుకుని కుర్చీలో జారగిలబడ్డాడు. మొహంమీద చిన్న చెమటబిందులు ఏర్పడ్డాయి.

కాశ్యప రుమాలు కోసం జేబులో చెయ్యి పెట్టాడు. అతడి చేతికి చిన్న కాగితం పొట్లం తగిలింది. దాన్ని బయటకు తీశాడు. పొట్లాం విప్పాడు. అది హతురాలి మంచం ప్రక్కన దొరికిన అర్ధచంద్రాకారపు అల్యూమినియం ముక్క.

దానిని చూడగానే అతని సమస్యలన్నీ మబ్బు వీడినట్లు విడిపోయాయి.

పాత చీర - కొత్త జాకెట్ ....కాశ్యప చిన్నగా ఈల వేశాడు.

గబ గబా బయటకు వచ్చి జీపు ఎక్కాడు.

అంతలో ఒక కాన్‌స్టేబుల్ అతని దగ్గరకు పరుగెట్టుకుంటూ వచ్చాడు. "సార్! సుధీర్ గురించి పూర్తి యిన్‌ఫర్మేషన్ లభించింది సార్!" అంటూ తను తెలుసుకున్న సమాచారాన్ని వివరించాడు.

సుధీర్ గురించి రామారావు చెప్పినదంతా నిజమే కానీ ఒక్క విషయంలో మాత్రం రామారావు పొరబడ్డాడు.

రామారావు వూహించినట్లు సుధీర్ ఏ చెడు తిరుగుళ్ళు తిరగటం లేదు. తన స్నేహితుడి భార్యకు ఆశ్రయం యిచ్చాడు. ఆమెను చెల్లిగా భావించాడు. కానీ ఆ విషయాన్ని ఈ అన్నా చెల్లెళ్ళిద్దరూ తప్పుగా భావించి అతడిని రాచి రంపాన పెడుతున్నారు. ఆ విషయంలో యింట్లో గొడవలు కూడా జరుగుతున్నాయి.''

కాశ్యప అతడు చెప్పినదాన్ని మౌనంగా విన్నాడు. తర్వాత జీప్‌ను ముందుకు వురికించాడు.

4

ఉదయం ఏడు గంటలు కావటానికి యింకా పది నిముషాలుంది.

గాంధీ నగరం అంతా మేలుకొంది. పాలవాళ్ళతోనూ, పేపర్ బాయ్స్‌తోనూ, పనివాళ్ళతోనూ హడావుడిగా వుంది.

కాశ్యప జీప్‌ను సుధీర్ యింటి ముందు పార్కు చేసి జీప్ దిగాడు.

సుధీర్ చేత అతని బంధువులు కొందరు బలవంతంగా కాఫీ త్రాగిస్తున్నారు. వాళ్ళు లోపలకు వస్తున్న యిన్‌స్పెక్టర్‌ను చూసి ప్రక్కకు తప్పుకున్నారు.

కాశ్యపను చూసి సుధీర్ పేలవంగా నవ్వాడు. "కూర్చోండి సార్!" అన్నాడు.

కాశ్యప కేప్ తీసి పట్టుకుని ఒక ఖాళీ కుర్చీలో కూర్చున్నాడు.

రెండు నిముషాలు నిశ్శబ్దం రాజ్యం ఏలింది.

చివరకు సుధీరే ముందు నోరు మెదిపాడు. "రాత్రి మా బావగారు స్టేషన్‌కు వచ్చారట!" అడిగాడు.

కాశ్యప మౌనంగా తలాడించాడు.

"ఎందుకో ఆయన నన్ను అనుమానిస్తున్నట్లుంది. నిజానికి నాకు ఏ పాపం తెలియదు సార్!" సుధీర్ యింకా ఏదో చెప్పబోయాడు.

కాశ్యప అతడిని వారించి "దాన్నలా వుంచండి. మీరు బట్టలను ఎవరిచేత కుట్టిస్తారు?" అని అడిగాడు.

మొదట సుధీర్ ఈ ప్రశ్నకు ఆశ్చర్యపోయాడు. ఇన్‌స్పెక్టర్‌ని అదోలా చూశాడు. తరవాత ఒక నిముషం ఆలోచించి "నా బట్టలు బయట యిస్తాను. తను మాత్రం ముసలయ్య అని - కొన్నాళ్ళనుంచీ అతడి దగ్గరే కుట్టిస్తుంది" అన్నాడు.

కాశ్యప సుధీర్ చెప్పిన అడ్రస్ నోట్ చేసుకుని బయటకు వచ్చాడు. ఆ వీధి చివర్నే ముసలయ్య మిషన్ బడ్డీ వుంది. అందుకే కాశ్యప జీప్‌ను అక్కడే వదలి కానిస్టేబుల్‌ను వెంట తీసుకుని బడ్డీవయిపు అడుగులు వేశాడు.

అక్కడ ఒక నడి వయస్కుడు మిషన్ తుడుస్తున్నాడు. అప్పుడే బడ్డీ తెరచినట్లున్నాడు, ఊదొత్తుల వాసన వేస్తోంది. తన బడ్డీవయిపే వస్తున్న పోలీసులను చూసి ముసలయ్య కంగారుపడ్డాడు. బడ్డీ దిగి వినయంగా చేతులు కట్టుకు నిలబడ్డారు.

"చూడు! నీ పేరేనా ముసలయ్య?" అడిగాడు కాశ్యప.

"అవును సార్!"

"ఈవీధి మొదట్లో వుంటున్న సుధీర్‌గారు నీకు తెలుసా?"

"తెలుసయ్యా? ఆ యమ్మగోరి బట్టల్ని నేనే కుట్టేవోడిని. పాపం ఆ పైనోడికి జాలి లేదు" వేదాంతం దొర్లబోయింది ముసలయ్య మాటల్లో.

"నువ్వు ఈ మధ్యన ఆవిడ బట్టలు ఏమయినా కుట్టేవా?" అడిగాడు కాశ్యప.

"లేదండి. మొన్న ఆయమ్మ నాకు కబురు చేశారండి. జాకెట్టు కుట్టమన్నారండి. నా దగ్గర లేడీ స్పెషలిస్టు మానేసి మరో బడ్డీ ఎట్టుకున్నాడండి. ఇదే యిసయం అమ్మగారితో చెప్పానండి."

"అతడి షాపెక్కడ?"

"ఈ పక్కవీధేనండి."

"మాతో వచ్చి అతని షాపు చూపించు!" అంటూ అతడిని తీసుకుని ప్రక్కవీధికి బయలుదేరాడు కాశ్యప.

ముసలయ్య ఒక పెంకుటింటి ముందు ఆగి "సుందరం!" అంటూ గట్టిగా పిలిచాడు.

"ఎవరూ?" అంటూ ఓ యువకుడు బయటకు వచ్చాడు. ఎదురుగా నిలబడ్డ పోలీసు యిన్స్పెక్టర్ని చూసి అదోలా మారిపోయాడు.

ఉపోద్ఘాతం ఏదీ లేకుండా "నిన్న రాత్రి ఏడూ ఏనిమిది మధ్య నువ్వు ఏం చేస్తున్నావ్?" అడిగాడు కాశ్యప.

"నిన్న మధ్యాహ్నం వూరెళ్ళానండి. తెల్లారుగట్టే వచ్చాను. ఇవిగోండి బస్సు టిక్కెట్లు కూడా వున్నాయి" అంటూ జేబులోంచి బస్సు టిక్కెట్లు తీసి చూపించాడు సుందరం.

"నువ్వు ప్రక్కవీధిలో వున్న అనూరాధగారింటికి జాకెట్ యివ్వటానికి వెళ్ళలేదూ?" అడిగాడు కాశ్యప.

"నే నసలు ఆవిడ జాకెట్టే కుట్టలేదండి. సత్యప్రమాణమండి." ఈలోగా కాన్స్టేబుల్ స్వామి లోపలకువెళ్ళి బాగా నలిగిపోయిన టేపునూ, కొన్ని గుడ్డపేలికలనూ తీసుకు వచ్చాడు. టేపు చివర్న వుండాల్సిన అల్యూమినియం ముక్క లేదు. సుందరం యింక మాటాడలేదు. మిషన్ క్రింద దొరికిన గుడ్డపేలికలు అనూరాధ జాకెట్ నుంచి

వచ్చినవని ఎవరయినా చెప్పగలరు.

సుందరం నేరాన్ని ఒప్పుకున్నాడు.

"రాత్రి జాకెట్ యిద్దమని వెళ్ళానండి. ఆమె తప్ప యింట్లో ఎవరూ లేదు. నన్ను కూర్చోమని ఆమె జాకెట్ ట్రయిల్ చూసుకోవటానికి లోపలకు వెళ్ళారు. ఐదు నిముషాలు పోయాక నేను నెమ్మదిగా లోపలకు వెళ్ళాను. ఆమెను చూసి వుద్రేకపడిపోయాను. విషయం బైటకు పొక్కకుండా ఆవిడను చంపేశాను. అటునుంచి అటే ఏలూరు వెళ్ళి యిప్పుడే తిరిగి వస్తున్నాను" అంటూ తల దించుకున్నాడు సుందరం. □

బక్ర పెళ్ళాం!!

ప్రతాప రవిశంకర్

సీరియల్

మాయా ద్వీపం

(గత సంచిక తరువాయి)

"ఏం చెయ్యాలో నిర్ణయించుకున్నా మనం చెయ్యగలిగింది ఏముంది? వీలైనంత త్వరలో మనం ఈ దీవిని వదిలి వెళ్ళిపోవాలి. ఈ దీవిలో ప్రమాదం వున్నా లేకపోయినా ఇక్కడ మనం వుండలేము. కాని ఏం చెయ్యాలి? ఎట్లా ఈ దీవినుండి బయటపడాలి? చెప్పండి" అన్నాడు నరేంద్ర.

మళ్ళీ ఆ ప్రాంతాన్ని నిశ్శబ్దం ఆవరించుకున్నది.

ఎవరికివారే ఆలోచించటం మొదలుపెట్టారు.

ఉన్నట్టుండి ఎవరో కెవ్వుమన్న అరుపు వినపడింది.

ఉలిక్కిపడ్డారు. ఒకరినొకరు చూసుకున్నారు.

మళ్ళీ వినపడింది.

అంతా చెట్టుమీదకు చూశారు.

కొమ్మమీద కూర్చునివుంది ఒక పక్షి. ఎర్రరంగులో వుంది. బాగా లావుగా వుంది. పొడుగ్గావున్న ముక్కుతో

చిత్రంగా కనపడింది వాళ్ళకి.

పెద్దకళ్ళతో కిందకూర్చున్న వాళ్ళనే చూస్తూన్నది.

"ఆశ్చర్యంగా వుంది. ఈ దీవిలో మనకు కనపడిన మొదటి పక్షి ఇది. ఇంతకుముందు ఎప్పుడూ ఇటువంటి పక్షిని చూడలేదు" అన్నాడు నరేంద్ర.

"నేనుకూడా, అండమాన్ దీవుల్లోకూడా ఎప్పుడూ ఇంత పెద్ద పక్షిని చూడలేదు. దీనికి తోకకూడా లేదు. కళ్ళు ఎర్రగా వున్నాయి కోపంగా చూస్తున్నట్టు" అన్నాడు స్టీఫెన్ పైకే చూస్తూ.

అతనట్లా అంటున్నప్పుడే ఆ పక్షి మళ్ళీ కెవ్వుమని అరిచింది. రెండునిముషాలదాకా అరుస్తూనే వుంది. మొదట్లో ఆ పక్షి అరుపు చిత్రంగా వున్నట్లనిపించినా ఆపకుండా అరుస్తూంటే వాళ్ళకి భయంగా అనిపించింది.

పైకే చూస్తున్నారు. వాళ్ళ పక్కనే చెట్టుకొమ్మలు వున్నాయి.

ఉన్నట్టుండి ఆ పక్షి అరుస్తూ వాళ్ళ మీదకు విసురుగా దూసుకు వచ్చింది.

భయపడ్డారు వాళ్ళంతా. లేచి నిలబడే ప్రయత్నం చేశారు. కంగారుగా లేవబోతూ ఒకళ్ళమీద ఒకళ్ళుపడ్డారు.

ఒక ఖైదీమీదకు సూటిగా వచ్చేసింది ఆ పక్షి. వస్తూనే పొడుగ్గా కత్తి మొనలాగా వున్న ముక్కుతో మెడమీద గట్టిగా పొడిచి ఎగిరిపోయింది ముందుకు—

కెవ్వుమని అరిచాడు.

కనపడకుండా ఎగురుతూ వెళ్ళిపోయింది పక్షి.

మెడమీద చర్మం లేచిపోయింది. నెత్తురు బయటకు వచ్చింది.

అరుస్తున్నాడు అతను బాధతో....

ముందు జాగ్రత్తగా—ఆ పక్షి మళ్ళీ దగ్గరకు రాకుండా అంతా చెట్టుకొమ్మలు చేతుల్లోకి తీసుకున్నారు.

"చిత్రంగా వుందనుకున్నాం. ఇది రాక్షస పక్షిలాగా వుంది. ఈసారి వస్తే దాన్ని వదలకూడదు" అన్నాడు నరేంద్ర.

"ఆ పక్షిని చంపి కాల్చుకుతిందాం....బాగా లావుగా కూడా వుంది....అంతా సిద్ధంగా వుండండి" అన్నాడు బలదేవ్....

పక్షి పొడిచిన ఖైదీ బాధతో మూలగటం మొదలు పెట్టాడు.

"ఈ ప్రాంతం వదిలి వెళ్ళిపోదాం....ఇంకా మనం చాలా దూరం తిరగాలి. మనతో మాయమైపోయిన మనిషిని కూడా వెతకాలి. పదండి" అన్నాడు స్టీఫెన్.

కొమ్మలు తీసుకుని మళ్ళీ నడక మొదలు పెట్టారు. ఆ ఖైదీ మెడమీదనించి నెత్తురు కారుతోంది. బాధగా చేత్తో దాన్ని అదిమిపట్టి నడుస్తున్నాడు అతను. అతని కొమ్మను కూడా ఇంకో ఖైదీ పట్టుకున్నాడు.

ఒక్కసారి రెండు పక్కలావున్న చెట్లమీదకు చూశారు ఆ పక్షి కోసం. ఎక్కడా అది కనపడలేదు.

కొంచెం దూరం నడిచారు.

అన్నీ పొదలు. కింద ఇసుక అప్పుడే ఎండకు వేడెక్కిపోయింది. పాదాలు మండుతున్నాయి.

అందరికంటే వెనకగా నడుస్తున్నాడు ఆ ఖైదీ. మాటల్లో మునిగిపోయిన వాళ్ళు ఆ ఖైదీ గురించి అంతగా పట్టించుకోలేదు.

అపరాధ పరిశోధన పోటీ-222

[ఫలితాలు]

జనవరి'87 నెల "అపరాధ పరిశోధన పోటీ-222" కి సరియైన సమాధానాలు:

1. రష్యా.
2. ఎన్జీవోల సమ్మె.
3. అప్నా ఉత్సవ్.
4. నక్సలైట్లు
5. పి.టి. ఉష.

పై జవాబుల ప్రకారం ముగ్గురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి వచ్చే నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలల పాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

1. శ్రీ టి. శంకర్ రావ్, జర్నలిస్ట్ సౌకార్ పేట, హామిడి—515 775 (అనంతపురం జిల్లా)
2. శ్రీ ఎ. సత్యనారాయణ, క్రిష్ణమందిర్ రోడ్, బెల్లంపల్లి—504251 (ఆదిలాబాదు జిల్లా)
3. శ్రీ వి. పార్వతీశ ప్రవీణ్, 32-శ్రీ కిషన్ కాలనీ, వరంగల్—506 002.

నడుస్తూవున్నప్పుడే అతనికి చూపు మందగించి పోయింది. ముందు నడుస్తున్న మనుషులు ముందు మసగ్గా—ఆ తర్వాత అలికినట్టుగా కనపడ్డారు. లోపల ఏదో అవుతున్నట్టుగా అనిపించింది.

ఆగిపోయాడు.

హటాత్తుగా కెవ్వుమని అరిచాడు.

ముందు నడుస్తున్నవాళ్ళు ఉలికిపాటుతో వెనక్కు తిరిగి చూశారు.

అప్పటికే ఆ ఖైదీ ఇసుకలో పడిపోయాడు.

పరుగుదీస్తూ అతన్ని చేరుకున్నారు. అతని శరీరం నీలి రంగులోకి మారిపోయింది. అతన్లో చలనం ఆగిపోయింది. తెరచివున్న కళ్ళుకూడా నీలిరంగులోకి మారిపోయాయి.

ఎదురుగానే మృత్యువును చూసినట్టు వాళ్ళు చలించి పోయారు. ఆ దృశ్యం వాళ్ళకు అంతులేని బాధను, దుఃఖాన్ని కలిగించింది.

"రాక్షసి పక్షి అనుకున్నాం. అది విషపక్షి. పాముల్లోనే విషం వుంటుందని ఇప్పటిదాకా మనకు తెలుసు. కాని ఈ దీవిలో పండ్లకు, పక్షులక్కూడా విషం వుంది. మనందరి ప్రాణాలకు ఎటువంటి రక్షణాలేదు. అంతా బతుకుమీద ఆశను వదులుకోవచ్చు" అన్నాడు నరేంద్ర.

మిగిలిన ఖైదీల కళ్ళలో మృత్యుభయం స్పష్టంగా కనపడింది....

"ఇటువంటి విషపక్షులకంటే భయంకరమైన క్రూర జంతువులవల్ల మనకు ప్రమాదం తక్కువ. ఒకరాత్రి గడిచేసరికి అప్పుడే మనం ఇద్దరు స్నేహితులను పోగొట్టు కున్నాం. ఇంతకంటే ఓడలోనే వుండి ఆ తుఫాన్లో

ఫారమ్ - 4

1. ప్రచురణ స్థలము	:	హైద్రాబాదు-29.
2. ప్రచురణ కాలము	:	మాస పత్రిక.
3. ముద్రాపకుని పేరు	:	శ్యామ దామోదర రెడ్డి.
జాతీయత	:	భారతీయుడు.
చిరునామా	:	హైద్రాబాదు-29.
4. ప్రచురణ కర్త పేరు	:	-డిటో-
జాతీయత	:	
చిరునామా	:	
5. సంపాదకుని పేరు	:	-డిటో-
జాతీయత	:	
చిరునామా	:	
6. వార్తాపత్రికపై యాజమాన్యము గల వ్యక్తులు, భాగస్తులు పేర్లు, చిరునామాలు	:	శ్యామ దామోదర రెడ్డి 3-4-554, నారాయణగూడ, హైద్రాబాదు-29. (సోల్ ప్రొప్రయిటరు)

శ్యామ దామోదర రెడ్డి అయిన నేను, పై తెలిపిన వివరములు నాకు తెలిసినంత వరకు, నేను విశ్వసించి నంత మేరకు సత్యమైనవని, ఇందు మూలముగా ప్రకటించు చున్నాను.

తేది :

1-3-87.

శ్యామ దామోదర రెడ్డి

(ప్రచురణకర్త సంతకం)

సముద్రంలో చచ్చిపోయివుంటే బాగుండేది" అన్నాడు మరో ఖైదీ.

"ఇది మనం భరించలేని దారుణం. ఈ దీవి నుండి బయటపడటానికి మనం ఏదో ఒక మార్గాన్ని ఆలోచించాలి" అన్నాడు స్టీఫెన్.

"అంతకంటే ముందు ఈ శవాన్ని మనం పూడ్చిపెట్టాలి. రండి....గొయ్యి తవ్వటానికి" అన్నాడు నరేంద్ర.

కొంతమంది అతని పక్కకు వచ్చారు.

చేతుల్లోవున్న కొమ్మలతో ఇసుకలో గొయ్యి తవ్వటానికి వొంగారు.

సరిగ్గా అప్పుడే కెవ్వుమన్న అరుపులు ఒక దిక్కుగా వినపడ్డాయి.

ఆగిపోయారు.

బెదురుతున్న కళ్ళతో ఆ దిక్కుగా చూశారు.

అదిరిపడ్డారు. గుండె ఆగిపోతున్నట్టుగా అనిపించింది.

గుంపుగా కొన్ని ఎర్రరంగు పక్షులు వాళ్ళు దాటివచ్చిన ప్రదేశం వైపునుండి రివ్వున ఎగురుతూ వస్తూ కనపడ్డాయి.

"పరిగెత్తండి" ఆందోళనగా — పెద్దగా అరిచాడు స్టీఫెన్.

"ఈ శవం" అన్నాడు బలదేవ్.

"శవాన్ని వదిలెయ్యండి. ఆలస్యం చెయ్యొద్దు. శక్తి కొద్దీ వీలైనంత ఎక్కువ దూరం పరిగెత్తండి" అంటూనే ముందుకు పరుగుదీశాడు స్టీఫెన్.

అంతా కొమ్మలు చేత్తో పట్టుకుని వెనక్కు తిరిగి చూడకుండా పరుగుదీశారు ప్రాణభయంతో.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ

మా వద్ద సుప్రసిద్ధ రచయితల, రచయిత్రుల సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య, స్కూలు, కాలేజి విద్యార్థులకు కావలసిన అచ్చు పుస్తకములు, ఎక్సర్‌సైజ్ పుస్తకములు

మరియు

రామాయణం, భారతం,

భాగవతం, దేవీ భాగవతం

ఇంకా

హిందీ, ఇంగ్లీషు

నవలలు లభించును.

తప్పక విచ్చేయండి!

నేడే మా కేటలాగు కొరకు వ్రాయండి.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(పాత కూరగాయల మార్కెట్ వద్ద)

రాజమండ్రి - 533 101.

అప్పుడే విషపక్షులు చచ్చిపోయిన ఖైదీ శవం దగ్గిర వాలిపోయి పొడుగ్గావున్న ముక్కులతో అతని శరీరాన్ని పొడిచి తినటం మొదలు పెట్టాయి.,

23

సాయంత్రమయ్యింది. అప్పటికి వాళ్ళు ఆ దీవిలో ఇంకో ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి చెట్లు విశాలంగా లేకుండా సూటిగా పైకి ఆకాశంలోకి దూసుకుపోతున్నట్టుగా వున్నాయి. వాటి ఆకులు చాలా చిన్నవిగా వున్నాయి. ఆ చెట్లకు పక్కలకు పెరిగిన కొమ్మలుకూడా లేవు.

“ఈ రాత్రికి మనం ఇక్కడే ఈ ప్రదేశంలో పడుకుంటే మంచిది” అన్నాడు స్టీఫెన్.

“ఎందుకు?” అనడిగాడు బలదేవ్.

“ఇక్కడి చెట్లమీద పక్షులు కూర్చునే అవకాశం కూడా లేదు. అందువల్ల మనకు ఆ విషపక్షుల గురించిన భయం వుండదు. అంతేకాదు. చీకటిపడిన తర్వాతకూడా ఆ పక్షులు తిరుగుతాయని నేను అనుకోవటంలేదు. ఏమంటారు?” అన్నాడు అతను.

“మీ ఇష్టం. ఈ దీవులగురించి ఎంతో కొంత విషయం తెలిసిన మనిషి మీరొక్కరే....మీరు చెప్పినట్టుగానే వింటాం. ఈరాత్రికి ఇక్కడే పడుకుందాం” అన్నాడు నరేంద్ర.

“బాగా చలిగా వుంటుందేమో....” అన్నాడు బలదేవ్.

“ఐనా తప్పదు. చెట్లకింద ఆ రాకాసి పక్షుల ప్రమాదం వుంది” అన్నాడు నరేంద్ర.

అక్కడే అంతా కూర్చున్నారు.

అందరినీ చూస్తూ అన్నాడు స్టీఫెన్—

అపరాధ పరిశోధన పోటీ-224

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-3-'87 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు మే '87 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. 1986 లో జరిగిన ఘోరమైన ప్రమాదం—?
(చెర్నోబిల్ ప్రమాదం, ఛాలెంజర్ పతనం)

2. ఇండియాపై దాడికి పాకిస్తాన్‌ను పురిగొలుపుతున్న దేశం—?
(అమెరికా, చైనా)

3. భవిష్యత్తులో వాహనాలు ఇక దీనితోనే నడుస్తాయంటున్నారు—?
(బ్యాటరీ, గ్యాస్)

4. మనకు ఇప్పుడిది—? (క్రికెట్ సీజన్, ఎన్నికల సీజన్)

5. రాష్ట్ర ముఖ్యమంత్రి మళ్ళీ నటించనున్న చిత్రం—?
(బ్రహ్మర్షి విశ్వామిత్ర చరిత్ర, స్వామి వివేకానంద)

"ఈ దీవిపేరు మనకు తెలీదు. కాని దీనికి మనం మృత్యుదీవి అని పేరుపెట్టుకుందాం. ఈ మృత్యుదీవి ఏ ప్రాంతంలో వున్నదో, అండమాన్స్‌కు ఎంతదూరంలో వున్నదో తెలీదు. అసలు మనకు ఏమీ తెలీదు. ఐనా మనం ఇంకా ఈ దీవిలోనే తిరుగటంవల్ల వుపయోగం వుండదు. ఎట్లాగైనా మనం ఇక్కడనుండి బయటపడే దారి ఆలోచించాలి"

"అవును. ఈ దీవిలో మనం ఇంకో నాలుగురోజుల వరకు ప్రాణాలతో వుంటామనే నమ్మకంలేదు. వెంటనే మనం ఈ దీవినుండి బయటకు వెళ్ళిపోవాలి" అన్నాడు బలదేవ్.

"మనందరి కోరికా అదే....కాని ఎట్లా? సముద్రంలో మనం ఎట్లా ప్రయాణంచేస్తాం? ఎన్నిరోజులు ఏ దిక్కుగా వెళతాం? ఇవన్నీ ఆలోచించండి" అన్నాడు నరేంద్ర.

"ఇక్కడ వుండి చచ్చిపోయే బదులు ఏదో ఒక ప్రయత్నం చేద్దాం" అన్నాడు స్టీఫెన్.

వాళ్ళిద్దరినీ చూస్తున్నారు మిగిలిన ఖైదీలు. ఎవరి కళ్ళల్లో జీవంలేదు. ఇంకొంచెం సేపట్లో మృత్యువు కబళించబోతున్నట్టుగా వున్నారు వాళ్ళు.

"అసాధ్యం అనుకుంటాను. సముద్రంలో ఎత్తుగా లేచే అలల్ని ఈ కొయ్య తెప్పలు తట్టుకోలేవు. మనం పడవల్ని తయారుచెయ్యగలిగితే ఈ దీవినుండి బయటకు వెళ్ళొచ్చు" అన్నాడు నరేంద్ర—బలదేవ్‌ను చూస్తూ.

"అవును. ఈ ఆలోచన బాగుంది. పడవలతో సముద్రంలో ప్రయాణం సాధ్యమవుతుంది" అన్నాడతను.

"ఆలోచన బాగానే వుంది. మీలో ఎవరికైనా పడవలు తయారుచెయ్యడం వచ్చునా?" అనడిగాడు స్టీఫెన్.

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించ నవసరం లేదు.

3. 'అపరాధ పరిశోధన' మాసపత్రిక మరియు సప్లిమెంట్‌కు కలిపి అర్థసంవత్సర చందా రు. 84/-లు మాత్రమే.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేవిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

6. సభ్యులకు ప్రతి నెలా V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యంకూడా వుంది. అయితే వి.పి. ఖర్చులుకూడా వారే భరించవలసి వుంటుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెలకానెల రు. 17-60లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం కావలసిన వారు మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

అంతా తలలు అడ్డంగా వూపారు రాదన్నట్లు....

"అటువంటప్పుడు వుపయోగం ఏముంది? ఐనా పడవలు తయ్యారుచెయ్యటం అంత సులభంకాదు. ముందుగా చెట్లను నరకాలి. వాటిని చెక్కాలి....మేకులు దించాలి ఇదంతా సాధ్యమేనా?" అనడిగాడు స్టీఫెన్ వాళ్ళని....

ఎవ్వరూ మాట్లాడలేదు.

"అంతేకాదు. ఏదో ఒక విధంగా మనం కొన్ని రోజులు కష్టపడి పడవను తయారుచేయాలనుకున్నా అప్పటిదాకా మనందరం బతికి వుంటామనే నమ్మకం నాకు లేదు. ఇది మృత్యుదీవి. చావు ఏ రూపంలో వస్తుందో మనకు తెలీదు" అన్నాడు.

అప్పటికి చీకటి పడింది.

మవునంగా వున్నారంతా....అప్పటికే అందరికీ బతుకుతామనే ఆశ పోయింది.

చీకటి బాగా చిక్కబడిపోయింది.

ఆ దీవిలో వాళ్ళకి అది రెండోరాత్రి.

క్రితం రాత్రి పడుకోబోయేముందు ఇరవైమూడు మంది మనుషులు వున్నారు. ఒక్కరాత్రి గడిచేసరికి ఇద్దరు మనుషులు తగ్గిపోయారు.

ఎర్ర రంగు పక్షివల్ల చచ్చిపోయిన ఖైదీ వాళ్ళందరి కళ్ళముందూ ఆ చీకటిలో కనపడ్డాడు. నీలిరంగులోకి మారిపోయిన అతని శవం ఎదురుగానే వున్నట్టు అనిపించింది.

తెల్లవారేసరికి కనపడకుండా పోయిన ఆ ఖైదీ అందరికీ అర్థంకాని ప్రశ్నలాగానే వుండిపోయాడు.

ఉన్నట్టుండి బలదేవ్ అన్నాడు—"ఈ దీవిలో చెకుముకి రాళ్ళున్నాయి. చూశారా?"

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-3-'87 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు మే '87 నెల సంచికలో ప్రకటిస్తాము. ✱

జనవరి'87 పోటీ ఫలితాలు

(1) జనవరి' 87 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

పగవారల పలాయనం!

దిగంబరుల నౌకాయానం!!

పంపినవారు: శ్రీమతి వింజమూరి సుబ్బలక్ష్మి, 8-4-32, శ్రీ కిషన్ కాలనీ, వరంగల్ - 506 002.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

మగువ సంకటం!

మరణ శకటం!!

పంపినవారు: శ్రీ కె. వి. సుబ్రహ్మణ్యం, C/O కె. సత్యనారాయణరావు, లింగమల్లు వారి ఇల్లు, పాత్ పట్టాభి పురం, గుంటూరు - 6.

"చూశాం .... కాని ఆ రాళ్ళతో మనకు అవసరం ఏముంది? ఏవైనా చిన్నజంతువులు వున్నట్లయితే వాటిని చంపి ఆ రాళ్ళతో నిప్పుచేసి కాల్చుకుతినేవాళ్ళం" అన్నాడు నరేంద్ర.

కొంచెం సేపటికి "మిగిలిన ఖైదీలుకూడా మనలాగే ఏదో దీవికి చేరుకొనివుంటారు. ఈ సమయంలో వాళ్ళు కూడా మన పరిస్థితుల్లోనే వుండొచ్చు" అన్నాడు స్టీపెన్.

"ఏమో! వూహించలేము. సముద్రంలోనే గద్దం ఖైదీలాగా చచ్చిపోయివుండొచ్చు. ఒకవేళ అట్లా అంతా చచ్చిపోయినట్లయితే వాళ్ళంతా అదృష్టవంతులు. వాళ్ళకు మనం అనుభవిస్తున్న నరకం వుండదు" అన్నాడొక ఖైదీ గుండెలోవున్న విచారాన్నంతా బయటపెడుతూ—

"అవును, అది చాలా మంచి చావు. హాయిగా వుంటుంది. ఈ బాధ-దిగులు ఎవరికీ వద్దు" అన్నాడు ఇంకో ఖైదీ.

వాళ్ళ మానసిక పరిస్థితి చూస్తే స్టీపెన్‌కు జాలి కలిగింది. నేరస్తులుగా శిక్ష అనుభవించటానికి బలి పశువుల్లాగా బయల్దేరారు. చివరకు ఈ మృత్యుదీవిలో చిక్కుకుపోయారు.

వెనక్కు వాలిపోయి ఇసుకలో పడుకున్నారు అంతా.

కిందటి రాత్రి బాగా కొమ్మలు పరుచుకున్న చెట్టుకింద పడుకున్నందువల్ల ఆకాశం - నక్షత్రాలు కనబడలేదు. కాని ఆరాత్రి వాళ్ళకు నల్లగావున్న ఆకాశం-మిలమిల మెరుస్తున్న నక్షత్రాలు కూడా కనపడ్డాయి.

నరేంద్ర కళ్ళముందు నక్షత్రాల్లాగానే నీలూ రూపం కూడా కనబడింది. గుండెను ఎవరో గట్టిగా పట్టుకొని

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

వెలువడినవి !

1. సగటు మనుషులు (కథలు)	మల్లాది వెంకట కృష్ణమూర్తి	18.00
2. దూరం	,,	25.00
3 గోకులంలో రాధ	వంశీ	20-00
4. మహావేధ	చివుకుల పురుషోత్తం	25 00
5. పావని	సి. విమలా గణేష్	16.00
6. జీవనవీణ	ముద్దాగడ సూర్యప్రకాశరావు	16-00

నేడే అడ్వాన్సుతో పాటు మీ ఆర్డరు పంపండి.

పోస్టు ఖర్చులు మీరే భరించుకోవలయును.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ-520 002.

పిండినట్టుగా బాధ కలిగింది. తర్వాత భూపేంద్ర - రేణు - పిల్లలు కూడా గుర్తుకు వచ్చారు.

చచ్చిపోయేలోపల తను వాళ్ళందరినీ తిరిగి చూడగలడా? అసాధ్యం....ఈ దీవిలోనే తనకూ్కడా చావు వుంది. మృత్యువు తనకోసం ఎదురుచూస్తూంది.

కళ్ళలో నీళ్ళు వచ్చాయి.

అంతా ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. నిద్రపోవటానికి అందరికీ భయంగానే వుంది. కళ్ళుమూసుకుంటే మృత్యువు కౌగిలించుకుంటుందనే ఆలోచన అందరిలోనూ బలంగా నాటుకుపోయింది.

బాగా రాత్రి గడిచేవరకూ అంతా మవునంగానే వున్నా మెలకువగానే వున్నారు.

ఆలోచనల్లో వుండగానే కొంచెం ముందు - వెనకగా అందరి కళ్ళూ మూసుకుపోయాయి.

నిద్రపోయారు.

చలిగాలి వాళ్ళమీదనుండి పరుగులు తీస్తూనేవుంది. పొడుగ్గా ఆకాశంలోకి దూసుకువెళ్ళిన చెట్లు గాలికి వూగిపోతున్నాయి. కొన్ని గంటలు గడిచాయి.

అందరికంటే చివరగా ముడుచుకుని పడుకున్న ఖైదీ కొంచెంగా కదిలాడు నిద్దట్లో - ఆ సమయంలో అతని పక్కనే నల్లగా - లావుగా వున్న ఒక ఆకారం నిలబడి వున్నది. ఆ ఆకారం ఒక చేతితో ఆ ఖైదీ నోరు నొక్కి రెండో చేతితో అతన్ని పట్టుకొని ఒక్కసారిగా గాల్లోకి లేపింది. (ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page


Regd.no: H/HD-48
PRABHAKAR